www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

జూలో సింహం చంపేసింది!

ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్థాన్ వాసి
దాడి చేసి లాక్కెళ్లిన సింహం.. శరీరం ఛిద్రం
సందర్శకుల అరుపులతో వదిలేసినా అప్పటికే మృతి
మద్యం మత్తులోనా.. ఆత్మహత్యా?
ఎన్‌క్లోజర్‌లో దూకిన కారణాలపై అస్పష్టత

3

శుక్రవారం | 16-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 302 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 8.56 తదుపరి అష్టమి; నక్షత్రం: భరణి ఉ. 8.48 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 8.47-10.23; దుర్ముహూర్తం: ఉ. 9.03-9.49, మ. 12.53-1.39; అమృతఘడియలు: తె. 6.23 మొదలు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఎన్నికల బాండ్లపై తీర్పునిచ్చిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం

ఎలక్టోరల్ బాండ్లు రద్దు



సమాచారహక్కు చట్టానికి, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకూ వాటితో విఘాతం

బాండ్ల పథకం రాజ్యాంగ వ్యతిరేకం.. అధికార పార్టీలు బెదిరింపులకు పాల్పడవచ్చు

క్విడ్‌ప్రోకోలో భాగంగా విరాళాలిచ్చి ప్రభుత్వ విధానాల్ని అనుకూలం చేసుకుంటున్నారు

సామాన్య జనం ఇచ్చే విరాళాలు.. కార్పొరేట్ సంస్థ విరాళాలూ రెండూ ఒకటి కావు

పార్టీలకొచ్చే విరాళాల వివరాలు ఓటర్లకు తెలియాలి.. నిష్పక్షపాత ఎన్నికలకది అవసరం

2019 నుంచి నేటి వరకూ వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బయటకు రావాలి

కొన్న వ్యక్తి, తీసుకున్న పార్టీ, బాండు విలువ వివరాల్ని ఎస్బీఐ మార్చి 6లోపు ఈసీకివ్వాలి

వాటిని మార్చి 13లోపు ఈసీ వెబ్‌సైట్‌లో ఉంచాలి.. నగదుగా మార్చని బాండ్లను

కొనుగోలుదార్ల ఖాతాల్లో జమ చేయాలి.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు

బాండ్లు కొన్న వారి వివరాలు బయటకొస్తే కలకలమే

ఈ అంశాన్ని సుప్రీంకోర్టులో పలువురు సవాల్ చేసే అవకాశం

అడ్డదారి వి రాళాలకుచె

పార్టీల కొరకు, పార్టీల చేత, పార్టీలే ఏర్పాటు చేసుకున్న 'ఫండింగ్ స్కీమ్'! ఆ డబ్బులు ఎవరు ఇచ్చారో మనకు తెలియదు! కానీ... ఎవరికి చేరాలో వారికే చేరుతుంది. ఇచ్చిన సొమ్ము నల్ల ధనమైనా ఫర్వాలేదు. ఆ ఖాతాలో పడగానే అంతా తెలుపై పోతుంది! తెరచాటున తీసుకునే ముడుపులను... అధికార పార్టీలు నేరుగా, బ్యాంకుల నుంచే అందుకోవచ్చు. ఇదంతా ఓ పెద్ద మిస్టరీ! దీనిపై ఇప్పుడు సుప్రీంకోర్టు సంచలన తీర్పు చెప్పింది. రహస్య వ్యక్తులు, రహస్య సంస్థలు, రహస్యంగా రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో ఇచ్చే విరాళాలు చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఇది... పార్టీలకు పెద్ద షాక్!

16,000 కోట్లు

బాండ్ల ద్వారా పార్టీలకు వచ్చిన విరాళాల సొమ్మిది

సింహభాగం బీజేపీకే

గత ఆర్థిక సంవత్సరానికే ఆ పార్టీకి రూ.6,565 కోట్లు

దేశంలోనే సంపన్న పార్టీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ముంగిట సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఎలక్టోరల్ బాండ్లను రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ ఆ పథకాన్ని కొట్టివేసింది. రాజ్యాంగం కల్పించిన భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు, సమాచార హక్కు చట్టానికి ఎలక్టోరల్ బాండ్లు వ్యతిరేకమని పేర్కొంది. ఈ పథకం కింద ఇప్పటి వరకూ బాండ్లను కొనుగోలు చేసిన వారి పేర్లు, ఆ బాండ్ల విలువ, వాటిని స్వీకరించిన వారి వివరాలను వెల్లడించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎలక్టోరల్ బాండ్లను విక్రయించే ఎస్‌బీఐని.. 2019 ఏప్రిల్ 12 నుంచి విక్రయించిన బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీలోపు ఎన్నికల సంఘానికి (ఈసీకి) సమర్పించాలని, మార్చి 13లోపు ఆ వివరాలను ఈసీ తన వెబ్‌సైట్‌లో

మిగతా 2వ పేజీలో...



ఎలక్టోరల్ బాండ్లలో ఏపీ వాటా 529 కోట్లు

అధికార వైసీపీకే సింహభాగం

ఆ పార్టీ ఖాతాలో 382 కోట్లు

ప్రతిపక్ష టీడీపీకి 146 కోట్లు

ఆ బాండ్లు అప్రజాస్వామికమని

అప్పుడే చెప్పాం

కేంద్రం ఇకనైనా మోసపూరిత ఆలోచనలు మానుకోవాలి

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్

లంచాలు, కమీషన్లకే ఎన్నికల బాండ్లు: రాహుల్‌గాంధీ

తీర్పును కొనియాడిన విపక్షాలు

ప్రధాని మోదీ నాయకత్వానికి ప్రత్యామ్నాయం లేదు

అందుకే ప్రతి అంశంపైనా విపక్షాల రాజకీయం: బీజేపీ

2

పారదర్శకత కోసమే..

దాతల భద్రత దృష్ట్యా పేర్లపై గోప్యత

బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్

తీర్పును గౌరవిస్తామని వ్యాఖ్య

వలంటీర్లకే వీరతాళ్లు!

ఇతర వర్గాలపై సవతి తల్లి ప్రేమే

'సొంత సైన్యానికి' నజరానాలు

ఎన్నికల వేళ రూ.392 కోట్ల కానుకలు

మరి.. ఉద్యోగులకు పంద్రాగస్టు సన్మానాలేవీ?

పారితోషికాలు, సర్టిఫికెట్లకు సెలవు

జగన్ రాగానే అటకెక్కిన సంప్రదాయం

సరెండర్ లీవు బిల్లులు రూ.300 కోట్లు

జీవిత బీమా క్లెయిములు రూ.300 కోట్లు

మెడికల్ క్లెయిమ్‌లూ పెండింగ్‌లోనే..

ఆశా, పారిశుధ్య కార్మికులన్నా చులకనే



వలంటీర్లకు అవార్డు ప్రదానం చేస్తున్న సీఎం జగన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రోడ్లు ఏమైపోయినా ఫర్వాలేదు.

చిన్నచిన్న పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు రాక రోడ్డున పడ్డా పట్టించుకోరు.

ఉద్యోగులకు వేలకోట్లు బకాయి పడినా బేఫికర్!

ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికుల డిమాండ్లకు దిక్కులేదు.

కానీ.. వలంటీర్లను మాత్రం చక్కగా చూసుకోవాలి! ఇస్తామన్న దానికన్నా, ఇస్తున్న దానికన్నా ఎక్కువ పారితోషికం ఇవ్వాలి! బిరుదులతో సత్కరించాలి! ఎందుకంటే.. వారిని వలంటీర్లుగాకంటే, తమ సొంత సైన్యంగానే వైసీపీ భావిస్తోంది! భావించడం కాదు.. 'మీరు మా సైన్యమే' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారు. ఎన్నికల ముందు వారికి

మిగతా 12వ పేజీలో...

మీరే యుద్ధం చేయాలి

వచ్చే రెండు నెలలూ ప్రతిపక్షాలతో పోరాడండి

వైసీపీకి మీరే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలి

'వలంటీర్లకు వందనం'లో సీఎం జగన్ వ్యాఖ్యలు

ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ ప్రసంగాలు

సభ కోసం బస్సుల దారి మళ్లింపు.. అదనపు బాదుడు

వస్తారా.. చస్తారా!

12

రాకుంటే గంజాయి కేసులో ఇరికిస్తా నా కొ...!

సీఎం కార్యక్రమానికి రావాలంటూ వలంటీర్లపై ఒత్తిడి

ఉద్యోగం ఊడుతుందంటూ వైసీపీ నేతల బెదిరింపులు

అయినా బస్సెక్కని వారు సగానికి పైనే!



ఆహారాన్ని ఫొటో తీస్తే.. కేలరీలు చెప్పేస్తుంది!

పోషకాలు.. చక్కెర శాతాన్నీ నిర్ధారించే యాప్

2

'న్యూట్రీ ఎయిడ్'ను ఆవిష్కరించిన ఎన్ఐఎన్

మంచి ఆహారపుటలవాట్లకూ యాప్ సూచనలు



వెలంపల్లి రాజకీయానికి.. కాపు యువకుడి బలి!

విజయవాడలో కైకాల చరణ్ అనుమానాస్పద మృతి

2

ఎమ్మెల్యే వెలంపల్లి వేధింపులు తట్టుకోలేకేనని కాపు సంఘాల ఆగ్రహం

అధికారంపై చెయ్యేస్తే

అరివీరభద్రుడే!

సొంత పార్టీ వారినీ నాశనం చేయకుండా వదలరు

ఆ ఉత్తరాంధ్ర నియోజకవర్గంలో కుటుంబ పాలన

రియల్ ఎస్టేట్‌లో పాతుకుపోయిన ఫ్యామిలీ

ఎక్కడెక్కడి సెటిల్‌మెంట్లు ఆయన దగ్గరకే..


రెవెన్యూలో తనకంటూ సొంత ఉద్యోగవర్గం

వ్యాపారాలకు అడ్డొచ్చేవారిపైకి పురమాయింపు

తన అడ్డాలో వెంచర్ వేశారని ఎమ్మెల్సీకీ చుక్కలు

ఎంపీపీ-తహసీల్దారు గొడవలో అధికారికే వత్తాసు

యంత్రాంగాన్ని డమ్మీ చేసి పవర్ తన గుప్పిట్లో..



3

ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఓ ఎమ్మెల్సీ భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ ప్రారంభించారు. అయితే అక్కడే ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు రియల్ ఎస్టేట్ వ్యాపారాలు ఉన్నాయి. ఆ ఎమ్మెల్సీ రాజుగారు. పైగా సొంత పార్టీ నేత. అయినా, తన వ్యాపారానికి ఎసరుపెట్టిన రాజుగారిని వదిలిపెట్టలేదు. అస్మదీయులైన తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిని ఎమ్మెల్యే ఉసిగొల్పారు. వారు వెంచర్లోకి ప్రవేశించి అందులో ప్రభుత్వ భూమి ఉన్నట్టు తేల్చేసి బోర్డులు పాతారు. దీనిపై రాజుగారు తొలుత ఆగ్రహించారు. బాహాటంగా సవాళ్లు చేశారు. కానీ, చివరకు సర్దుకుపోయారు.

సభా హక్కులకూ

దిక్కులేదు

గనుల శాఖ వెంకటరెడ్డి తీరిదీ

శాఖ ఉన్నతాధికారుల ఫైర్


నోటీసుపై సరిగా స్పందించలేదని ఆగ్రహం

అధికారిణిపై చర్యలేవంటూ శ్రీముఖం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓ ఎమ్మెల్యేకు కనీస గౌరవ మర్యాదలు ఇవ్వరు. సభాహక్కుల ఉల్లంఘన నోటీసుకూ సరిగా స్పందించరు. ఆదే.. గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డి కార్యాలయం. సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని అభియోగాలు ఎదుర్కొంటున్న

మిగతా 11వ పేజీలో...



గుడ్డి గుర్రాలకు పళ్లు

తోముతున్నారా

2

మీ చేతకానితనానికి మరో రెండేళ్లు

'ఉమ్మడి' కావాలని కేంద్రాన్ని అడుగుతారా: షర్మిల

25న తిరుపతిలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

ముఖ్య అతిథిగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఎస్వీయూ స్టేడియంలో సభ.. అనుమతికి దరఖాస్తు



ఎచ్చెర్లలో శంఖారావం సభకు హాజరైన ప్రజానీకం.. ప్రసంగిస్తున్న లోకేశ్

సొంత చెల్లిపైనే అసభ్య దాడి!

12

పేటీఎం కుక్కలతో జగనే చేయిస్తున్నారు: లోకేశ్

మీరు చొక్కాలు మడత పెడితే.. మేం కుర్చీలు మడతపెడతాం

జగన్ కుర్చీ గల్లంతే!

జాగ్రత్తగా ఉండు.. జగన్‌రెడ్డీ

నీకు కుర్చీ లేకుండా చేస్తాం

ఎన్నికలంటే చొక్కాలు, కుర్చీలు మడతపెట్టడం కాదు: బాబు

పిచ్చికూతలు కూయొద్దు..

మంచికీ హద్దులుంటాయ్

'విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో టీడీపీ అధినేత ధ్వజం



'విధ్వంసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్ తదితరులు

క్లాస్‌వార్‌పై బలమైన

పాఠం చెబుతాం

వలంటీర్ల గురించి ఏనాడూ తప్పుగా మాట్లాడలేదు

11

భవిష్యత్తులో వారికి అండగా ఉంటాం

33 వేల మంది ఆడపిల్లలు అదృశ్యమవడం నిజమైంది: పవన్

ఈ ప్రభుత్వం కూలడం ఖాయం

ఆహారాన్ని ఫొటో తీస్తే కేలరీలు చెప్పేస్తుంది!

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మనం తినే ఆహారంలో ఎన్ని కేలరీలున్నాయి? పోషకాలెన్ని? చక్కెర శాతం ఎంత? వంటి విషయాలను తెలుసుకోవాలంటే.. ఆ ఆహారాన్ని ఒక్కసారి క్లిక్‌మనిపిస్తే చాలు.. 'న్యూట్రీ ఎయిడ్' అనే యాప్ ద్వారా అన్నీ వెంటనే తెలిసిపోతాయి. వీటిని గుర్తించే ఈ యాప్‌ను జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆరోగ్యవంతమైన, పోషక విలువలు నిండిన ఆహారాన్ని ఎంపిక చేసుకునేందుకు ఈ యాప్ తోడ్పడుతుంది. మన ఆహారపు అలవాట్లలో పెనుమార్పులకు నాంది పలికే ఈ యాప్‌ను ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత, జర్మనీకి చెందిన ఆగస్‌బర్గ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మార్కస్ కెక్ గురువారం తార్నాకలోని ఎన్‌ఐఎన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రారంభించారు. జర్మనీ సహకారంతో రెండేళ్లపాటు శ్రమించిన ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్తల బృందం.. ఏ ఆహారం తీసుకుంటే మంచిదో వివరించే ఇతర సాధారణ యాప్‌లకు భిన్నంగా వినూత్నమైన, సమగ్రమైన యాప్‌ను అభివృద్ధి చేసింది. మన ఆహారపు అలవాట్లలో మంచి చెడులను గుర్తించడంతోపాటు మంచి ఆహారపు అలవాట్లు పెంపొందించుకునేందుకు కూడా ఈ యాప్ శాస్త్రీయమైన సూచనలు చేస్తుంది. మనం తీసుకునే ఆహారాన్ని ఈ యాప్‌తో స్కాన్ చేస్తే.. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ సహకారంతో ఆ ఆహారంలోని పోషక విలువలను ఇది క్షణాల్లో చెప్పేస్తుంది. ఇందుకోసం ఈ యాప్‌లో ప్రత్యేక టూల్‌ను పొందుపరిచారు. మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి సూక్ష్మ, స్థూల పోషకాలు ఉన్నాయెూ, ఆ ఆహారం వల్ల ఎంత పరిమాణంలో కర్బన ఉద్గారాలు ఉత్పన్నమవుతున్నాయనే వివరాలను కూడా ఈ యాప్ అందిస్తుంది. హైదరాబాద్‌కు చెందిన 720 మంది ఆహారపు అలవాట్ల ఆధారంగా మొదట పైలట్ ప్రాజెక్టుగా దీనిని చేపట్టారు. ఆ తరువాత రెండో దశలో ప్రజలందరి ఆహారపు అలవాట్లు, ఎలాంటి పోషకాహారం తీసుకోవాలనే వివరాలతో సమగ్ర యాప్‌ను అభివృద్ధి చేశారు. ఎన్‌ఐఎన్, జర్మనీకి చెందిన ఆగస్‌బర్గ్ విశ్వవిద్యాలయంతోపాటు చండీగఢ్‌కు చెందిన స్టార్టప్ కాల్‌ప్రే వెల్‌నెస్ సొల్యూషన్స్ సంస్థలు ఈ యాప్ అభివృద్ధిలో పాలుపంచుకున్నాయి. మనం ఎలాంటి ఆహారం తింటున్నామో తెలుసుకుని, అందుకు అనుగుణంగా శారీరక శ్రమ చేస్తూ, ఆరోగ్యంగా ఉండటంతో పాటు పర్యావరణ హితమైన ఆహారాన్ని ఎంపిక చేసుకునేందుకు న్యూట్రీ ఎయిడ్ యాప్ తోడ్పడుతుందని ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత అన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల వారీగా ఉన్న ఆహారపు అలవాట్ల ఆధారంగా వాటన్నింటి వివరాలను యాప్‌లో పొందుపరచడం సవాల్‌తో కూడుకున్నదని, అయినా ఈ యాప్‌లో సుమారు 5వేల వరకు పొందుపరిచామని చెప్పారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఎన్‌ఐఎన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంజీ సుబ్బారావు, కాల్‌ప్రే సీఈవో వినీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


న్యూట్రీ ఎయిడ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత, ప్రొఫెసర్ మార్కస్ కెక్ తదితరులు



ఎలక్టోరల్ బాండ్లలో ఏపీ వాటా 529 కోట్లు

- అధికార వైసీపీ ఖాతాలో 382 కోట్లు... ప్రతిపక్ష టీడీపీకి 146 కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎలక్టోరల్ బాండ్ల విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోని రెండు ప్రధాన రాజకీయ పార్టీలకు ఇప్పటి వరకు రూ.529.04 కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయి. ఇందులో సింహభాగం వాటా అధికార వైసీపీదే. వైసీపీకి 2017-18 నుంచి 2022-23 వరకు రూ.382.44 కోట్లు బాండ్ల రూపంలో వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీకి 146.60 కోట్ల రూపాయలు వచ్చాయి. 2023-24 సంవత్సరం లెక్కలు వెలుగుచూడాల్సి ఉంది. సుప్రీం కోర్టు తాజా ఆదేశాల మేరకు ఇటు వైసీపీ, అటు టీడీపీకి బాండ్ల రూపంలో వచ్చిన నిధులు ఎవరిచ్చారు? ఎక్కడి నుంచి వచ్చాయెూ? ఎన్నికల కమిషన్‌కు ఎస్‌బీఐ లెక్కలు చెప్పాల్సి ఉంది. పార్టీలకు ఏయే కంపెనీలు ఏ మేరకు బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చాయన్న విషయాలు త్వరలో బయటకు రానున్నాయి. ఇది రాజకీయ పార్టీలను, విరాళాలు ఇచ్చిన వారిని ముఖ్యంగా అధికార పార్టీని ఆందోళనకు గురి చేస్తోంది. రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లే అవకాశం లేదు.

వైసీపీ, టీడీపీకి బాండ్ల రూపంలో వచ్చిన నిధులు (రూ.కోట్లలో)		
ఆర్థిక సంవత్సరం	వైసీపీ	టీడీపీ
2017-18	ఏమీలేవు	ఏమీలేవు
2018-19	99.84	27.5
2019-20	74.35	81.6
2020-21	96.25	ఏమీలేవు
2021-22	60	3.5
2022-23	52	34
మొత్తం	382.44	146

మూడు రకాలుగా విరాళాలు

సాధారణంగా రాజకీయ పార్టీలకు మూడు రకాలుగా నిధులు సమకూరుతాయి. ఒకటి... వ్యక్తులు తమంతటతాముగా విరాళాలు ఇవ్వొచ్చు. అయితే 20 వేలకుపైగా వచ్చే విరాళాలు ఎవరిచ్చారో పార్టీలు వెల్లడించాలి. రెండోది... ప్రుడెన్షియల్ ట్రస్ట్ బాండ్లు. ఇది మధ్యస్తం. ఓ వ్యక్తి లేదా సంస్థ ప్రుడెన్షియల్ ట్రస్ట్‌కు విరాళం ఇచ్చి ఫలానా పార్టీకి అందజేయమని కోరవచ్చు. లేదా మీరే ఎవరో ఒకరికి ఇవ్వమని ట్రస్ట్‌ను కోరవచ్చు. సాధారణంగా ఇలాంటివన్నీ అధికారపార్టీకి వెళ్తుంటాయి. ఇక మూడోది... ఎలక్టోరల్ బాండ్లు. సంస్థ లేదా వ్యక్తి స్టేట్ బ్యాంక్‌లో ప్రాథమిక వివరాలు చెప్పి ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసి పార్టీలకు ఇస్తారు. ఆ విరాళం ఎవరిచ్చారన్నది పార్టీలు ప్రకటించాల్సిన అవసరం లేదు. అంటే.. బ్లాక్‌మనీ మొత్తం రాజకీయ పార్టీలకు ఈ రూపంలో వెళ్తుందన్నమాట. దీన్నే సుప్రీం కోర్టు తప్పు పట్టింది.

ఎలక్టోరల్ బాండ్లు అంటే?

రాజకీయ పార్టీలకు వ్యక్తులు, సంస్థలు ఇచ్చే విరాళాల్లో పారదర్శకతను తీసుకొచ్చేందుకు కేంద్రం ఎలక్టోరల్ బాండ్లు అనే విధానాన్ని 2017లో తీసుకొచ్చింది. ఆర్థిక బిల్లులో సవరణలు తీసుకొచ్చి 2018 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చింది. ఎలక్టోరల్ బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాత్రమే ఇస్తుంది. ఏ వ్యక్తి అయినా డబ్బులు ఇచ్చి దానికి సమాన విలువైన బాండ్లు కొనుక్కోవచ్చు. ఆ బాండ్లను తమకు నచ్చిన, గుర్తింపు పొందిన ఏ రాజకీయ పార్టీకి అయినా విరాళంగా ఇవ్వొచ్చు. కేంద్ర ఆర్థిక శాఖ నిబంధనల ప్రకారం ఎస్‌బీఐ నుంచి ఆ బాండ్లు ఎవరు కొన్నారు? ఎవరికి ఇచ్చారు? అన్నది సంబంధిత వ్యక్తులు ఆర్థిక లెక్కల్లో చూపాల్సిన అవసరం లేదు. అది వారి ఇష్టానికే వదిలేసింది. అయితే పార్టీలకు బాండ్ల రూపంలో వచ్చే నిధుల వివరాలను ఎన్నికల కమిషన్‌కు వెల్లడించాలి.

రాష్ట్రంలోని అక్రమాల్లో బీజేపీకీ వాటాలు

- ఇసుక అక్రమాలపై కేంద్రానికి ముందుగానే తెలుసు: మాణిక్కం ఠాగూర్

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో, ఇసుక తవ్వకాలో, మద్యం విక్రయాల్లో బీజేపీ పెద్దలకు వాటాలు ఉన్నందునే సీఎం జగన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవడం లేదని ఏపీసీసీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ విజయవాడలో ఆరోపించారు. 'రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఉంది. కేంద్ర మంత్రిత్వ శాఖ హైకోర్టుకు ఇచ్చిన నివేదికే దానికి సాక్ష్యం. ఇసుక అక్రమ తవ్వకాలు వాస్తవమేనంటూ కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ హైకోర్టుకు నివేదిక సమర్పించినా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎందుకు స్పందించలేదు? బీజేపీయేతర రాష్ట్రాల్లో ఏ తప్పు జరగకపోయినా కేసులు పెట్టి వేధిస్తున్న మోదీ ప్రభుత్వం... ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మైనింగ్, మద్యం అక్రమ ఆదాయంలో బీజేపీ పెద్దలకు వాటా ఉందని తమ సీనియర్ నాయకుడు కేవీపీ రామచంద్రరావు ఇటీవల చేసిన ఆరోపణలను సమర్థిస్తున్నా. రాష్ట్రంలో జరుగుతున్న ఈ అక్రమాలపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం' అని ఠాగూర్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో పర్యటించనున్న ఖర్గే, రాహుల్, ప్రియాంక

'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేలా కార్యాచరణ చేపట్టేందుకు త్వరలోనే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ముఖ్య నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కర్ణాటక, తెలంగాణ సీఎంలు సిద్దరామయ్య, రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పర్యటించనున్నారు. పర్యటనల తరువాత, పార్టీ బలాన్ని బేరీజు వేసుకున్నాక 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తాం' అని ఠాగూర్ చెప్పారు.

జగన్‌కు 10 సీట్లు కూడా రావు: చింతామోహన్

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, ఫిబ్రవరి 15: 'రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 130 సీట్లు గెలిచి అధికారంలోకి వస్తుంది' అని మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. 'వచ్చే ఎన్నికల్లో రెండవ స్థానంలో టీడీపీ ఉంటుంది. వైసీపీకి 10 కంటే తక్కువ స్థానాలు వస్తాయి. రాష్ట్ర రాజధానిగా తిరుపతి ఉండాలని రాష్ట్రంలో అత్యధిక మంది కోరుకుంటున్నారు. చిరంజీవి ప్రస్తుతం మా పార్టీలోనే ఉన్నారు. ఆయన సీఎం అయ్యేందుకు ఇదే చివరి అవకాశం. ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున తిరుపతి నుంచి పోటీ చేయాలి' అని చింతా మోహన్ అన్నారు.

గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారా..!

- వైఫల్యాలను కప్పిపుచ్చుకునే కుట్రలో భాగం: షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ మరో రెండేళ్లు కావాలని అడుగుతున్నారంటే... ఇన్నాళ్లూ గుడ్డి గుర్రాలకు పళ్లు తోమినట్లా?' అని సీఎం జగన్‌ను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీ చేతకానితనానికి ఉమ్మడి రాజధాని అడుగుతున్నారా? ఐదేళ్ల అధికారం ఇస్తే విభజన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి అమలు కాలేదు. రాష్ట్రానికి రాజధాని లేదు. ప్రత్యేక హోదా రాలేదు. ప్రత్యేక ప్యాకేజీలు లేవు. ప్రధాని మోదీకి మోకరిల్లి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారే కాని, విభజన హామీలపై ఏనాడూ నోరు విప్పలేదు. ఆంధ్రుల రాజధాని ఎక్కడా అని అడిగితే పదేళ్ల తర్వాత కూడా హైదరాబాద్ వైపు చూపించాల్సి దయనీయ పరిస్థితి. చంద్రబాబు అమరావతి పేరుతో చూపించింది త్రీడీ గ్రాఫిక్స్ అయితే... జగన్ మూడు రాజధానులపేరుతో మూడుముక్కలాట ఆడారని అసహనం వ్యక్తం చేశారు' అని షర్మిల విమర్శించారు.

25న తిరుపతిలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

- ముఖ్య అతిథిగా టీసీఎం రేవంత్ రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఈనెల 25వ తేదీన తిరుపతిలో విడుదల చేయనుంది. ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని, కర్ణాటక సీఎం సిద్దరామయ్యను ఆహ్వానించారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్టీఆర్ స్టేడియంలో సభ నిర్వహణకు అనుమతి ఇవ్వాల్సిందిగా కాంగ్రెస్ నేతలు గురువారం వర్సిటీ వీసీ కలిసి దరఖాస్తు చేశారు.

ఎలక్టోరల్ బాండ్లు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగపరచాలని ఆదేశించింది. నగదుగా మార్చని బాండ్లను కొనుగోలుదార్ల ఖాతాల్లో తిరిగి జమ చేయాలని ఎస్‌బీఐకి ఆదేశాలు జారీ చేసింది. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయాలని పేర్కొంటూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్, సీపీఎం, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు గత ఏడాది అక్టోబరులో విచారణ ప్రారంభించింది. దానిపై తాజాగా గురువారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ సారథ్యంలో జస్టిస్‌లు సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు చెప్పింది. 232 పేజీలతో కూడిన రెండు వేర్వేరు తీర్పులను ధర్మాసనం వెలువరించింది. అయితే, ఇవి రెండూ ఏకాభిప్రాయంతో ఉన్నవే.

ప్రజల హక్కులకు భంగకరం

తీర్పు సందర్భంగా ధర్మాసనం.. ఎలక్టోరల్ బాండ్ల పథకం ఏ విధంగా ప్రజల హక్కులకు భంగకరమైనదో వివరించింది. అధికారంలో ఉన్న పార్టీలు తమకు నిధులు అందించాలంటూ వ్యక్తులను, సంస్థలను బెదిరించే అవకాశం ఉందని స్పష్టం చేసింది. రహస్య బ్యాలెట్‌లాగా.. విరాళం ఇచ్చిన వ్యక్తి గోప్యతను ఎలక్టోరల్ బాండ్ల పథకం కాపాడుతుందన్న ప్రభుత్వ వాదనను తోసిపుచ్చింది. 'అజ్ఞాతవ్యక్తుల విరాళాలకు అవకాశం కల్పించే ఎలక్టోరల్‌బాండ్ల పథకం, దానిలోని నిబంధనలు.. ఓటరుకున్న సమాచార హక్కుకు భంగం కలిగించటమేగాక రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) కల్పించే భావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఉల్లంఘిస్తున్నాయి' అని ధర్మాసనం తేల్చి చెప్పింది. తమకు వచ్చిన, రానున్న విరాళాల గురించి ఈసీకి సీల్డ్‌కవర్‌లో రాజకీయపార్టీలు వివరాలు సమర్పించాలంటూ 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం తాజాగా ప్రస్తావించింది. 'ఈ ఉత్తర్వులు వెలువడిన నాటి నుంచి నేటి వరకూ బాండ్ల ద్వారా విరాళాలు తీసుకున్న రాజకీయపార్టీల వివరాలను ఎస్‌బీఐ ఈసీకి సమర్పించాలి. ప్రతీ ఎలక్టోరల్ బాండ్‌కు సంబంధించి.. ఆ బాండ్‌ను కొన్నది ఎవరు? దాని విలువ ఎంత? దానిని ఏ పార్టీ ఏ తేదీన నగదుగా మార్చుకుంది? అన్న పూర్తి వివరాలను ఎస్‌బీఐ ఈసీకి మార్చి 6వ తేదీలోపు ఇవ్వాలి. మార్చి 13లోపు ఆ వివరాలను ఈసీ తన వెబ్‌సైట్‌లో బహిరంగపరచాలి. నిర్ణీత 15 రోజుల్లోపు నగదుగా మార్చుకోని బాండ్లను ఆయా పార్టీలు లేదా వాటిని కొన్నవారు బ్యాంకుకు తిరిగి ఇచ్చివేయాలి. బ్యాంకు ఆ మొత్తాన్ని కొనుగోలుదారు ఖాతాలో జమ చేయాలి' అని ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకొచ్చేందుకు ఆదాయపన్ను చట్టానికి, ప్రజాప్రాతినిధ్య చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలు చెల్లవని పేర్కొంది. వివిధ రాజకీయ పార్టీల వార్షిక ఆడిట్ రిపోర్టుల ద్వారా 2017-18 నుంచి 2022-23 వరకూ.. ఆయా పార్టీలకు బాండ్ల రూపేణా లభించిన మొత్తాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ కాలవ్యవధిలో బీజేపీ రూ.6,566 కోట్లు, కాంగ్రెస్ రూ.1,123 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ రూ.1,092 కోట్లు బాండ్ల ద్వారా దక్కించుకున్నాయి.

నలుగురి తరఫున సీజేఐ తీర్పు

స్వయంగా తన తరఫునేగాక జస్టిస్‌లు గవాయ్, పార్దీవాలా, మిశ్రాల తరఫునా సీజేఐ చంద్రచూడ్ 152 పేజీల తీర్పు రాశారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ విరాళాల్లో నల్లధనాన్ని అరికట్టి పారదర్శకతను తీసుకురావచ్చన్న ప్రభుత్వ వాదనను సీజేఐ వ్యతిరేకించారు. 'నల్లధనాన్ని అరికట్టటానికి ఎలక్టోరల్ బాండ్లు ఒక్కటే మార్గం కాదు. మరిన్ని మెరుగైన ప్రత్యామ్నాయాలున్నాయి. సమాచార హక్కుపై ఇవి ఎలక్టోరల్ బాండ్ల కన్నా తక్కువ ప్రభావమే చూపుతాయి' అని పేర్కొన్నారు. బాండ్ల ద్వారా తమకు విరాళం ఇచ్చింది ఎవరో ఏ రాజకీయపార్టీ కూడా తెలుసుకోలేదని, ఆ వివరాలు బ్యాంకు వద్ద మాత్రమే ఉంటాయన్న ప్రభుత్వ వాదనను సీజేఐ తిప్పికొడుతూ, తమకు విరాళం ఇచ్చిన వారి వివరాలను ఆయా పార్టీలు తెలుసుకునేలా ఈ పథకంలో పలు లోపాలున్నాయని చెప్పారు. రాజకీయ పార్టీలకు విరాళాలు రెండు రకాలుగా ఉంటాయని, ఒకటి, ఆ పార్టీకి మద్దతివ్వటం కోసం, రెండు, విరాళమిచ్చి ప్రతిగా తాను ప్రయోజనం పొందటం (క్విడ్ కో ప్రో) అని పేర్కొన్నారు. 'దేశంలో రాజకీయ సమానత్వానికి రాజ్యాంగం గ్యారెంటీ ఇస్తోంది. రాజకీయ సమానత్వంలో, రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేసే అవకాశం పౌరులందరికీ సమానంగా ఉంటుంది. ఓ సంపన్నుడు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చి, ఆ తర్వాత తన ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు (క్విడ్ ప్రో కోకు) అనుకూల పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అంటే ప్రభుత్వ విధానాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవటం లేదా ఓ లైసెన్సును పొందటమో కావచ్చు. ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కూడా పార్టీలకు విరాళాలు ఇస్తుంటారు. సంకీర్ణ ప్రభుత్వం వంటి సమయాల్లో ఇవి మరింత ఎక్కువగా ఉంటాయి. కాబట్టే ఏయే రాజకీయపార్టీలకు ఎన్ని నిధులు లభిస్తున్నాయన్న సమాచారం ఓటర్లకు తెలియాల్సిన అవసరం ఉంది. ఓటరు తన ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవటానికి ఇది అవసరం' అని సీజేఐ స్పష్టం చేశారు. దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కొనసాగటానికి ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం అత్యంత కీలకమన్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించటానికి రాజ్యాంగం కూడా సమున్నత ప్రాధాన్యం ఇచ్చిందని గుర్తు చేశారు.

పేర్లు బయటకొస్తే కలకలమే!

అజ్ఞాతంగా ఉంటూనే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే అవకాశం ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వ్యక్తులకు, సంస్థలకు లభించింది. ఒక రకంగా ఇది బాండ్లు కల్పించిన హామీ వంటిది. ఆ భరోసాతోనే వ్యక్తులు, సంస్థలు విరాళాలు ఇస్తూ వచ్చారు. ఇప్పుడు సుప్రీంకోర్టు వారి పేర్లను బయటపెట్టాల్సిందేనని తీర్పు చెప్పటంతో వారి పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే, ఒక రాజకీయ పార్టీకి సన్నిహితంగా బయటకు ఉన్నప్పటికీ అంతర్గతంగా వేరే పార్టీకి విరాళం ఇచ్చిన వాళ్లు ఉండవచ్చు. తమ పేరు బయటపడితే వారికి ఇబ్బందే. ఈ నేపథ్యంలో, బాండ్ల కొనుగోలుదార్ల పేర్లను బయటపెట్టాలన్న అంశాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేయవచ్చన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

మద్దతు కోసం ఇచ్చే విరాళాలు వేరు

ఎన్నికల కోసమో, విధానాలను ప్రభావితం చేయటం కోసమో మాత్రమే కాదు.. నిజమైన ప్రజాస్వామ్య భాగస్వామ్యం కోసం కూడా డబ్బు అవసరమేనని జస్టిస్ చంద్రచూడ్ తన తీర్పులో పేర్కొన్నారు. 'ఒక విద్యార్థి, ఒక దినసరి కూలీ, ఒక కళాకారుడు, ఒక ఉపాధ్యాయుడు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు వేరు. ఆయా పార్టీలకు తమ మద్దతు ప్రకటించటానికి ఇచ్చే విరాళాలు ఇవి. వీటికి రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుంది. చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేని పార్టీలకు కూడా విరాళాలు లభిస్తుంటాయి. క్విడ్ ప్రో కో లావాదేవీల రూపంలో జరిపే విరాళాలు రాజకీయంగా మద్దతు ప్రకటించేవి కావు' అని తెలిపారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా విడిగా 74 పేజీల తీర్పును వెలువరించారు. సీజేఐ తీర్పుతో ఇది ఏకీభవించినప్పటికీ భిన్నమైన కారణాలను పేర్కొన్నారు. కాగా, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ప్రశాంత్ భూషణ్, విజయ్ హన్సారియా, సంజయ్ హెగ్డే వాదనలు వినిపించారు. ఎన్నికల బాండ్ల వివరాలను రహస్యంగా ఉంచడం వల్ల పారదర్శకత ఉండదని, ఓటర్ల సమాచారహక్కుకు భంగం కలుగుతుందని,షెల్ కంపెనీల ద్వారా నిధులు స్వీకరించేందుకు అవకాశం కలుగుతుందని, జవాబుదారీ విధానం, నిజాయితీ దెబ్బతింటాయని వారు వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున వాదించిన అటార్నీ జనరల్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. తాము చట్టబద్ధమైన నిధులనే బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా ప్రోత్సహిస్తున్నామని, నిధులు ఇచ్చిన వారిపై రాజకీయ కక్ష సాధింపు ఉండకూడదనే ఉద్దేశంతోనే వారి వివరాలను రహస్యంగా ఉంచామని వాదించారు.

బాండ్లు అప్రజాస్వామికమని అప్పుడే చెప్పాం

కేంద్రం మోసపూరిత ఆలోచనలు మానుకోవాలి.. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం: కాంగ్రెస్

- లంచాలు, కమీషన్లకే బాండ్లు: రాహుల్
- సుప్రీం తీర్పును కొనియాడిన విపక్షాలు
- ప్రతి అంశంపైనా విపక్షాల రాజకీయం: బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పును విపక్ష పార్టీలు స్వాగతించాయి. సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులోనైనా ఇలాంటి మోసపూరిత ఆలోచనలను అమలు చేయడం మానుకోవాలని సూచించారు. ఎన్నికల బాండ్ల పథకం అప్రజాస్వామికమని, దాన్ని అమల్లోకి తెచ్చినప్పుడే కాంగ్రెస్ స్పష్టం చేసిందని ట్విటర్‌లో ఆయన పేర్కొన్నారు. సుప్రీం తీర్పుపై రాహుల్ గాంధీ స్పందిస్తూ.. మోదీ అవినీతి విధానాలకు మరో రుజువు ప్రజల ముందు ఉంచినట్లయిందన్నారు. మోదీ సర్కారు లంచాలు, కమీషన్లు తీసుకోవడానికి ఎన్నికల బాండ్లను ఓ మాధ్యమంగా మార్చుకుందని ధ్వజమెత్తారు. నోట్ల కంటే ఓట్లకే శక్తి ఎక్కువనే వాస్తవాన్ని ఈ తీర్పు బలపర్చిందని, దీన్ని తాము స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. సుప్రీం తీర్పును సీపీఎం కొనియాడింది. ఎన్నికల బాండ్ల పథకం అధికార పార్టీకి ఉపయోగపడేందుకే రూపొందించారని ఆరోపించింది. ఎన్సీపీ(శరద్‌పవార్), శివసేన(ఉద్ధవ్), ఆప్ కూడా సుప్రీం తీర్పును స్వాగతించాయి. పారదర్శకతను సాధించడంలో ఈ తీర్పు కీలక అడుగు అని పేర్కొన్నాయి.



ప్రజాస్వామ్యానికి గొప్ప ఊరట: ఖురేషీ

సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్ ఎస్‌వై ఖురేషీ స్వాగతించారు. ఈ తీర్పును ప్రజాస్వామ్యానికి లభించిన గొప్ప ఊరటగా అభివర్ణించారు. కాగా, సుప్రీంకోర్టు ఇచ్చే ప్రతి తీర్పును గౌరవించాలని బీజేపీ పేర్కొంది. ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం లేదని, అందుకే ప్రతిపక్షాలు మాత్రం ఎన్నికల బాండ్లపై ఇచ్చిన తీర్పును రాజకీయం చేస్తున్నాయని విమర్శించింది. పార్టీలకు అందే విరాళాలు, మొత్తం ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత ఉండాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ బాండ్లను తీసుకొచ్చిందని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. కోర్టు తీర్పును గౌరవిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం మారినప్పుడు తమకు వేధింపులు ఉండకూడదన్న ఉద్దేశంతో విరాళాలు ఇచ్చే వారు తమ పేర్లను వెల్లడించ కూడదని చెబుతుంటారని, ఇది సహజమేనని అన్నారు. కాంగ్రెస్ వాళ్లను ప్రజలు మైదానం నుంచి బయటకు పంపించి వేశారని, వాళ్లు విమర్శలు చేయడమేంటని ఎద్దేవా చేశారు.

రద్దు వెనుక నేపథ్యం

2017 సెప్టెంబరు 14: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని వ్యతిరేకిస్తూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసు ఇచ్చింది.

2018 జనవరి 2: ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని కేంద్రం నోటిఫై చేసింది.

2022 నవంబరు 7: ఒక ఏడాదిలో బాండ్లను విక్రయించే రోజుల సంఖ్యను 70 నుంచి 85 రోజులకు కేంద్రం పెంచింది. అయితే, ఆ ఏడాదిలో ఎక్కడైనా అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంటుందని నిబంధన పెట్టింది.

2023 అక్టోబరు 16: బాండ్లకు వ్యతిరేకంగా దాఖలైన అన్ని పిటిషన్లను ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేసిన సుప్రీంకోర్టు. అదే నెల 31 నుంచి విచారణ ప్రారంభం.

2023 నవంబరు 2: తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు.

2024 ఫిబ్రవరి 15: బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ తీర్పు.

ఆ సవరణలే.. బాండ్స్‌కు శాపమా?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: దేశంలోని రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చేందుకు ఉపకరించే పథకం.. ఎలక్టోరల్ బాండ్స్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు అనేక కారణాలను స్పష్టం చేసినా కేంద్ర ప్రభుత్వం 2017లో ఆర్థిక చట్టానికి, కంపెనీల చట్టానికి చేసిన సవరణలే పలువురు పిటిషన్లు వేయడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. రాజకీయ పార్టీలు విరాళాలను స్వీకరించేందుకు ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 దోహదపడుతుంది. అయితే రూ.20 వేల కంటే ఎక్కువ విరాళాలు ఇచ్చిన వారి పేర్లను వెల్లడించాలని ఆ చట్టం స్పష్టం చేస్తోంది. 2017 ఫిబ్రవరిలో లోక్‌సభ బడ్జెట్ సందర్భంగా అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఈ పథకాన్ని ప్రకటించారు. ఇకపై రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు ఎలక్టోరల్ బాండ్ రూపంలోనే ఉండాలి అని ఆయన లోక్‌సభలో స్పష్టం చేశారు. రూ.20 వేల కంటే ఎక్కువ మొత్తంలో విరాళాలిచ్చే వారి పేర్లను ప్రకటించాలనే అంశాన్ని తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం విదేశీ విరాళాల నియంత్రణ చట్టం-2010, ప్రజాప్రాతినిధ్య చట్టం-1951, ఆదాయపన్ను చట్టం-1961, కంపెనీల చట్టం-2013, ఆర్థిక చట్టంల్లో పలు సెక్షన్లను సవరించింది. కంపెనీల చట్టం-2013 సెక్షన్ 182 సవరణ ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చే కంపెనీల పేర్లను ప్రకటించాలనే నిబంధనను తొలగించింది. ఇది కేవలం కంపెనీలకే వర్తిస్తుంది. పౌరులకు కాదు. అంటే.. విరాళాలిచ్చే కంపెనీల పేర్లను గోప్యంగా పెడతారు. రూ.20 వేల కంటే ఎక్కువ విరాళాలిచ్చిన పౌరుల పేర్లను మాత్రం ప్రకటిస్తారు. అంతేకాదు.. కంపెనీలు తమ లాభాల్లో 7.5% కంటే ఎక్కువ మొత్తంలో విరాళాలివ్వకూడదనే నిబంధనను కూడా సవరించింది. కంపెనీల విచక్షణ మేరకు ఎంతైనా విరాళాలు ఇవ్వొచ్చని స్పష్టం చేసింది.

రూ.16,000 కోట్లు

బాండ్ల ద్వారా పార్టీలకు వచ్చిన విరాళాల సొమ్మిది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో ప్రారంభం కాగా, ఇప్పటి వరకూ వివిధ రాజకీయ పార్టీలకు బాండ్ల ద్వారా రూ.16,518.11 కోట్ల నిధులు లభించాయి. వీటితో సింహభాగం బీజేపీకే దక్కాయి. గత ఆర్థిక సంవత్సరం వరకూ అన్ని పార్టీలకూ కలిపి రూ.12 వేల కోట్లు లభించగా, వీటిలో బీజేపీ వాటా రూ.6,565 కోట్లు. అంటే 55 శాతం. 2023-24 ఆర్థిక సంవత్సరం బాండ్ల వివరాలు పార్టీల వారీగా ఇంకా వెల్లడి కాలేదు. ఆయా పార్టీలు వార్షిక ఆడిట్ రిపోర్టులను ఎన్నికల సంఘానికి సమర్పించిన తర్వాతే ఈ వివరాలు తెలుస్తాయి. అయితే, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) అంచనా ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు 4,500 కోట్లకుపైగా బాండ్ల విక్రయం జరిగింది. ఎలక్టోరల్ బాండ్ల రంగప్రవేశం తర్వాతే బీజేపీ దేశంలో అత్యంత సంపన్నపార్టీగా మారింది. 2022-23లో ఆ పార్టీ ఆదాయం రూ.2,360 కోట్లు కాగా దాంట్లో రూ.1300 కోట్లు బాండ్ల ద్వారా వచ్చినదే. ఇదే ఏడాది కాంగ్రెస్ రూ.452 కోట్ల ఆదాయాన్ని ఆర్జించగా, దాంట్లో బాండ్ల వాటా రూ.171 కోట్లు.

బాండ్ల ద్వారా పార్టీలకు విరాళాలు (రూ.కోట్లలో)

పార్టీ	2017-18	2018-19	2019-20	2020-21	2021-22	2022-23
బీజేపీ	210	1,450	2,555	22	1,033	1,294
కాంగ్రెస్	5	383	317	10	236	171
తృణమూల్	0	97	100	42	528	325
ఎన్సీపీ	0	29	20	0	14	-
బీఆర్ఎస్	0	141	89	0	153	529

(2022-23లో బాండ్ల ద్వారా డీఎంకేకు రూ.185 కోట్లు, బీజేడీకి రూ.152 కోట్లు, టీడీపీకి రూ.34 కోట్లు సమకూరాయి)

రైతు నాయకులతో మూడో దఫా చర్చలు

చండీగఢ్, ఫిబ్రవరి 15: పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ శివారుల్లో ఒకవైపు అన్నదాతలు ఆందోళన కొనసాగుతుండగా మరోవైపు చండీగఢ్‌లో గురువారం ముగ్గురు కేంద్రమంత్రులు రైతు నాయకులతో చర్చలు జరిపారు. ఆందోళన మొదలయిన తరువాత ఇవి మూడో దఫా చర్చలు కావడం విశేషం. గురువారం అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగాయి.

వెలంపల్లి రాజకీయానికి.. కాపు యువకుడి బలి!

- విజయవాడలో కైకాల చరణ్ అనుమానాస్పద మృతి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని దేవీనగర్‌కు చెందిన కైకాల చరణ్ మృతిపై కాపు నాయకులు భగ్గుమంటున్నారు. సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాస్ ఒత్తిళ్ల కారణంగా చరణ్ చనిపోయాడని కాపు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దేవీనగర్‌కు చెందిన చరణ్ తొలి నుంచీ వైసీపీలో చురుగ్గా తిరిగేవారు. మల్లాది విష్ణు అనుచరుడిగా గుర్తింపు పొందారు. అదే సమయంలో చరణ్‌పై పలు ఆరోపణలు కూడా ఉన్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని ఎగ్గొట్టాడని, పలువురి వద్ద అప్పులు చేసి ఇవ్వకుండా తిప్పుకొంటున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. వెలంపల్లి సెంట్రల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత చరణ్ వెలంపల్లికి మద్దతుగా బ్యానర్లు కూడా కట్టారు. ఆతర్వాత ఏం జరిగిందో కానీ చరణ్ తన మాట వినడం లేదంటూ వెలంపల్లి అతడిని దూరం పెట్టడం ప్రారంభించారు. మరోవైపు చరణ్‌కు అప్పులు ఇచ్చిన వారిని ఎగదోసి అతనిపై ఒత్తిడి పెంచేవిధంగా చేశారని, పోలీసులతో పాత కేసులను తిరగదోడించారని వెలంపల్లిపై ఆరోపణలు ఉన్నాయి. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిళ్ల ఓవైపు, పోలీసుల ఒత్తిడి మరోవైపు తట్టుకోలేక చరణ్ మూడు నాలుగు రోజులుగా విపరీతంగా మద్యం తాగుతూ బయటకు రావడం లేదు. గురువారం ఉదయం చరణ్ అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈలోగానే చరణ్ మృతి చెందారు. ఈ వార్త తెలిసిన వెంటనే చరణ్ ఇంటికి ఎమ్మెల్సీ రుహుల్లా చేరుకుని, అంత్యక్రియలు అయ్యే వరకు అక్కడే ఉన్నారు.

కాపులంటే వెలంపల్లికి ద్వేషం

వెలంపల్లి శ్రీనివాసరావుకు తొలి నుంచీ కాపులంటే ద్వేషమని కాపు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. 2023 జనవరిలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతో వెలంపల్లి వాగ్వాదానికి దిగి పరుషపదజాలంతో దూషించడంతోపాటు కాపు సామాజికవర్గాన్నీ కించపరిచేలా 'కాపు రౌడీలు' అంటూ వ్యాఖ్యానించారు. అంతకుముందు కాపు నేత సి.రామచంద్రయ్యను, జనసేనాని పవన్ కల్యాణ్‌ను వెలంపల్లి అసభ్యపదజాలంతో దూషించారు' అని ఐక్య కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతు రామ్మోహనరావు పేర్కొన్నారు. కాగా, కైకాల చరణ్ మృతికి వైసీపీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ రాజకీయ ఒత్తిళ్లే కారణమని ఆల్ ఇండియా కాపు ఫెడరేషన్ కార్యదర్శి ఏటీ రామారావు ఆరోపించారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి ఉన్నట్టుండి మృతి చెందడం అనుమానాలకు తావిస్తోందన్నారు. చరణ్ మృతదేహానికి పోస్టుమార్టం చేయనీయకుండా ఖననం చేశారని విమర్శించారు. వెలంపల్లి తన రాజకీయ అవసరాలకు చరణ్‌ను బలి చేశారని ఆరోపించారు.

జూలో సింహం చంపేసింది!

- ఎన్‌క్లోజర్‌లోకి దూకిన రాజస్థాన్ వాసి
- దాడి చేసి లాక్కెళ్లిన క్రూరమృగం, శరీరం ఛిద్రం
- సందర్శకుల అరుపులతో విడిచిపెట్టినా అప్పటికే మృతి
- మద్యం మత్తులోనా... ఆత్మహత్యాయత్నమా?
- ఎన్‌క్లోజర్‌లో దూకిన కారణాలపై అస్పష్టత


చంపిన సింహం


ప్రహ్లాద్ గుజ్జర్

తిరుపతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జూ పార్కులో గురువారం దారుణం చోటుచేసుకుంది. ఎన్‌క్లోజర్‌లోకి దూకిన ఓ వ్యక్తిని సింహం చంపేసింది. మృతుడు రాజస్థాన్ వాసి కాగా, సింహం కూడా నాలుగేళ్ల క్రితం రాజస్థాన్‌లోని ఓ జూ నుంచి తీసుకువచ్చినది కావడం యాదృచ్ఛికం!. వివరాలివీ.. రాజస్థాన్ రాష్ట్రం ఆల్వార్ జిల్లా తురానా గ్రామానికి చెందిన ప్రహ్లాద్ గుజ్జర్ (38) మధ్యాహ్నం జూపార్కును సందర్శించడానికి వచ్చాడు. పలు ప్రాంతాలను చూసిన అతడు.. సింహాల ఎన్‌క్లోజర్ వద్దకు వచ్చి హఠాత్తుగా గేటుపైకెక్కి లోనికి దూకేశాడు. ఏడేళ్ల వయసు కలిగిన మగ సింహం ఒక్కసారిగా దాడి చేసి అతడి గొంతును నోట కరిచి వందమీటర్ల వరకు లాక్కెళ్లింది. సమాచారమందుకున్న జూపార్కు వైద్యుడు, సిబ్బంది కర్రలు పట్టుకుని గట్టిగా అదిలించడంతో ప్రహ్లాద్‌ను విడిచిపెట్టిన సింహం బోనులోకి వెళ్లిపోయింది. వైద్యుడు, సిబ్బంది వెళ్లేసరికి అప్పటికే ప్రహ్లాద్ తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఒళ్లంతా రక్తపు గాయాలతో నిండాయి. పోలీసులు మృతదేహాన్ని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు.

ఎన్‌క్లోజర్‌లో దూకిన కారణాలపై అస్పష్టత

ప్రహ్లాద్ సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకడానికి కారణాలు అంతుపట్టడం లేదు. సందర్శకులు, సిబ్బంది కథనాల మేరకు.. అతడు దూరం నుంచి ఒక్కసారిగా పరుగు తీస్తూ పది అడుగుల ఎత్తున్న ఎన్‌క్లోజర్ తొలి గేటు ఎక్కి లోనికి దూకాడు. అక్కడ 12 అడుగుల ఎత్తున్న రెండో గేటు కూడా ఎక్కి లోనికి దూకేశాడు. సెల్ఫీ ఫొటోలు గానీ, వీడియోలు గానీ తీసుకునే ప్రయత్నం చేయలేదు. దూకినప్పుడు అతడి వద్ద మొబైల్ లేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆ సమయంలో ఎన్‌క్లోజర్‌లో మరో రెండు సింహాలున్నాయి. ఎన్‌క్లోజర్‌లో మృతదేహం వద్ద గానీ, పరిసరాల్లో గానీ మొబైల్ ఫోన్ లభించలేదు. దీంతో మద్యం మత్తులో దూకి ఉండొచ్చని, లేదంటే మానసిక స్థిమితం లేక, ఆత్మహత్య చేసుకోవాలన్న ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడి ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రహ్లాద్ గుజ్జర్ మృతదేహం వద్ద మంగళవారం హైదరాబాద్ నుంచి తిరుపతికి కొనుగోలు చేసిన రైల్వే టికెట్, డ్రైవింగ్ లైసెన్స్ లభించాయి. స్వగ్రామం నుంచి రెండు నెలల కిందట బయల్దేరినట్టు బంధువుల నుంచి ప్రాథమిక సమాచారం అందినట్టు పోలీసులు చెబుతున్నారు. కాగా, ఈ ఘటన తర్వాత లోపలున్న సందర్శకులందరినీ జూ అధికారులు బయటికి పంపించేశారు. ఘటన జరిగిన తీరును తెలుసుకోవడానికి లయన్ ఎన్‌క్లోజర్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన ఫుటేజీ పరిశీలనలో ఉన్నారు.

భోజన విరామ సమయంలో సిబ్బంది ఏమరుపాటు!

జూపార్కులో మధ్యాహ్నం సిబ్బంది భోజన విరామ సమయం కావడంతో కొంత ఏమరుపాటుగా ఉన్నపుడు ఈ దుర్ఘటన జరిగింది. సింహాల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకుల కోసం ప్రధానంగా రెండు పాయింట్లు ఉన్నాయి. ప్రధాన పాయింట్ వద్ద సందర్శకులు, సిబ్బంది కదలికలు ఎక్కువగా ఉంటాయి కనుక సందర్శకులు దుందుడుకు చర్యలకు యత్నించరు. రెండో పాయింట్ వద్ద మధ్యాహ్నం సింహాలు విశ్రాంతి తీసుకుంటూనో, నిద్రిస్తూనో ఉంటే సందర్శకులు వాటిపై రాళ్లు విసిరి లేపే ప్రయత్నం చేస్తుంటారు. దానికోసం ఎన్‌క్లోజర్ యానిమల్ కీపర్ రెండో పాయింట్‌లో ఉండి, సందర్శకుల కోసం సింహాలను అదిలిస్తూ ఉంటారు. గురువారం మధ్యాహ్నం కూడా కీపర్ భోజనం చేసి వచ్చి రెండో పాయింట్ వద్ద ఉండగా, మొదటి పాయింట్ వద్ద రాజస్థాన్‌కు చెందిన ప్రహ్లాద్ గుజ్జర్ గేట్ల మీదుగా లోనికి దూకి మృత్యువాత పడ్డాడని తెలిసింది.



రథసప్తమికి ముస్తాబైన తిరుమల ఆలయం

రథసప్తమి వేడుకకు సర్వం సిద్ధం

- నేడు ఏడు వాహనాలపై మలయప్ప దర్శనం

తిరుమల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఒకరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమికి తిరుమల క్షేత్రాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు ప్రధాన వాహనాలపై వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తయిన మలయప్పస్వామి ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 5 గంటలకు మలయప్పస్వామి ఆలయం నుంచి వాహనమండపానికి వేంచేస్తారు. అక్కడ సూర్యప్రభపై ఆశీనులై ఊరేగింపుగా బయల్దేరుతారు. 5.30-8మధ్య వాయవ్యదిక్కుకు చేరుకుని రవి కిరణాల కోసం వేచిఉంటారు. భానుడి కిరణాలు స్వామిని స్పర్శించగానే వేడుకలు ప్రారంభమవుతాయి.

అరసవల్లిలో ఆదిత్యుడికి క్షీరాభిషేకం

అరసవల్లి, ఫిబ్రవరి 15: శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు గురువారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం శ్రీ శారదాపీఠానికి చెందిన స్వామి స్వాత్మానందేంద్ర తొలిపూజ చేశారు. ఆదిత్యుడికి క్షీరాభిషేకం నిర్వహించారు.

22లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు

అమరావతి: రాష్ట్రంలో రబీ పంటలకు ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదును ఈనెల 22లోగా పూర్తి చేయనున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు తెలిపారు. పంటలు కోతకు వచ్చినందున ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు చేయాలని, సీఎంయాప్ ఎలో మార్కెట్ ధరలు నమోదు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. పీఎం కిసాన్ 16వ విడత చెల్లింపులకు ఈనెల 21లోగా రైతుల ఆధార్, బ్యాంకు అకౌంట్ల అనుసంధానం, ఈకేవైసీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అధికారంపై చెయ్యేస్తే అరివీరభద్రుడే!

- సొంత పార్టీ వారినీ నాశనం చేయకుండా వదలరు
- ఆ ఉత్తరాంధ్ర నియోజకవర్గంలో కుటుంబపాలన
- రియల్ ఎస్టేట్‌లో పాతుకుపోయిన ఫ్యామిలీ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన ఆ అధికార నేత చేసిందే రాజకీయం. ఎదురుతిరిగితే సొంత పార్టీ వారినీ వదిలిపెట్టబోరని చెబుతారు. తల ఎగరేస్తే మండలస్థాయి నేత నుంచి శాసన మండలి సభ్యుని వరకు వేధించి వెంటాడటంలో అరివీరభద్రుడిగా ఆ నేతకు పేరు. రెవెన్యూ, ఇతర శాఖల్లో తనకు అనుకూలంగా పనిచేసే ఉద్యోగవర్గాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యుల రియల్ ఎస్టేట్, ఫైనాన్స్(చిట్టీలు) వ్యాపారాలకు ఈ వర్గం కాపు కాస్తోంది. ఆ నియోజకవర్గం ఉన్న ప్రాంతం వైసీపీ హయాంలో కార్పొరేషన్‌గా మారింది. ఇంకేముంది...నియోజకవర్గ పాలనతోపాటు 'నగర' పాలననూ తన కాంపౌండ్ దాటకుండా కట్టుదిట్టం చేశారు.



'రాజు' గారికే దిక్కు లేదు..

ఒక ఎమ్మెల్సీతో ఎమ్మెల్యేకు వివాదం చోటు చేసుకుంది. ఆ ఎమ్మెల్సీ రాజుగారు. ఓ భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు ప్రారంభోత్సవం చేశారు. అక్కడే ఎమ్మెల్యే కుటుంబీకుల భారీ రియల్ ఎస్టేట్ వెంచర్లున్నాయి. దీంతో రాజుగారికి వేధింపులు మొదలయ్యాయి. ఆ వెంచర్‌లో చెరువు గర్భాలు, డి పట్టాలు ఉన్నాయని తహసీల్దార్‌తో పాటు, సర్వేయర్ వంటి రెవెన్యూ సిబ్బందిని ఉసిగొల్పారు. వారు వెంచర్లోకి ప్రవేశించి అందులో ప్రభుత్వ భూమిని గుర్తించి బోర్డులు పాతారు. దీంతో 'దమ్ముంటే అన్ని వెంచర్లపైనా దర్యాప్తు చేయించా'లని విలేకరుల సమావేశంలోనే రాజుగారు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే కుటుంబం వేసిన వెంచర్లలో ప్రభుత్వ భూములు, చెరువు గర్భాలు, డీ పట్టాలున్నాయని.. వాటిని రాష్ట్ర స్థాయి మీడియా ముందు గుట్టు విప్పుతానని బహిరంగంగా చెప్పారు. ఓ ఎంపీపీ తన గ్రామంలో జగనన్న కాలనీ లబ్ధిదార్ల కోసం భూసేకరణ చేశారు. కొంత విస్తీర్ణంలో ఇళ్ల పట్టాలు అందించారు. మిగిలిన స్థలం అనుచరులకు కట్టబెట్టినట్లు సమాచారం. ఎమ్మెల్యేకు ఈ విషయం తెలిసి తహసీల్దారును పురమాయించి, అక్రమ కట్టడాలుగా యంత్రాలతో నేలమట్టం చేయించారు. తర్వాత తహసీల్దార్‌పై కేసు నమోదుకు మండల పరిషత్‌లో తీర్మానించారు. ఆ తీర్మానం అమలు జరగకుండా ఎమ్మెల్యే అడ్డుకున్నారు. ఎంపీపీకి కళ్లెం వేసేశారు.

ఆయన నియోజకవర్గం నడిబొడ్డున రెండు జూట్ ఫ్యాక్టరీలు ఉండేవి. వీటి స్థలాలు వందల కోట్ల విలువైనవి. అవి మూతపడటానికి ముందు మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు రావలసిన జీతాలు తదితర బెనిఫిట్లను ఫ్యాక్టరీల యాజమాన్యం బకాయి పడింది. స్థలాలు అమ్మి బకాయిలు చెల్లించడానికి ఈ మిల్లుల యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. కొనడానికి పార్టీలు ముందుకొచ్చాయి. ఈ క్రమంలో కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానంటూ ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. అయితే, ఈ వ్యవహారంలో కార్మికులకు న్యాయం చేయడం కంటే కూడా ఎమ్మెల్యే జేబులు నింపుకొన్నదే ఎక్కువగా ఉన్నదని చెబుతారు.

కాంపౌండ్ దాటని 'నగర' పాలన

కార్పొరేషన్ పరిధిలో ఏ అభివృద్ధి పని జరగాలన్నా ఎమ్మెల్యే కనుసన్నల్లో జరగాల్సిందే. కార్పొరేటర్లతో పాటు మేయర్‌ను సైతం డమ్మీని చేసినట్లు ప్రచారం ఉంది. కార్పొరేషన్‌లో 50 డివిజనుండగా, 49మంది అధికార పార్టీ కార్పొరేటర్లున్నారు. మేయరు, డిప్యూటీ మేయర్ స్వతంత్రంగా అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. ప్రతి విషయంలో ఎమ్మెల్యే జోక్యం ఉంటుంది. రూరల్ మండలంలో కూడా తన పట్టు ఉండాలన్న ఉద్దేశంతో పరోక్షంగా ఎంపీపీని అణచివేత ధోరణికి దిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన తరువాత ఆయన నియోజకవర్గం చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ స్థలాలు, చెరువులు దురాక్రమణకు గురవుతున్నాయి. ఇవన్నీ ఎమ్మెల్యేకు తెలిసినా చర్యలుండవు. దీనివెనుక లాబియింగ్‌లు సాగుతున్న కారణంగా పట్టించుకోవటం లేదన్నది ఒక వాదన. జ్ఞాన సరస్వతి ఆలయానికి వెళ్లే మార్గంలో రింగు రోడ్డుకు దగ్గరలో ఏడు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయిస్తున్నట్లు ఓ సందర్భంలో ఎమ్మెల్యే ప్రకటించారు. తరువాత ఏమైందో ఏమో ఈ స్థలం గురించే మాట్లాడటం మానేశారు.

సెటిల్‌మెంట్లలో దిట్ట...

విజయనగరంలో ల్యాండ్ మాఫియా తగాదాలన్నీ ఎమ్మెల్యే వద్దకు వెళుతుంటాయి. ఎత్తివేతకు గురైన పరిశ్రమల స్థలాల లిటిగెంట్లను సైతం సెటిల్ చేస్తుంటారు. ఆయన నియోజకవర్గం నడిబొడ్డున రెండు జూట్ ఫ్యాక్టరీలు ఉండేవి. వీటి స్థలాలు వందల కోట్ల విలువైనవి. ఈ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు రావలసిన జీతాలు తదితర బెనిఫిట్ల బకాయిలు చెల్లించాలంటే స్థలాల అమ్మకం ఒక్కటే మార్గమని యాజమాన్యం భావించింది. ఈ క్రమంలో కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానంటూ ఎమ్మెల్యే రంగంలోకి దిగారు. సెటిల్‌మెంట్ వ్యవహారం సాగించారు. దీని వెనుక భారీగా నిధులు చేతులు మారాయన్న ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో కార్మికుల కంటే కూడా ఆ నేత జేబులే ఎక్కువగా నిండాయని చెబుతారు. కార్మికుల్లో కొందరు ఇప్పటికీ న్యాయం జరుగుతుందని ఎదురుచూస్తున్నారు.

27 వసంతాలు పూర్తి చేసుకున్న ఎన్టీఆర్ ట్రస్టు

- పారదర్శకతే ప్రామాణికంగా ట్రస్టు సామాజిక సేవ
- ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పారదర్శకతే ప్రామాణికంగా ఎన్టీఆర్ ట్రస్టు సామాజిక సేవలందిస్తోందని ట్రస్టు సీఈవో కే రాజేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు 27 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ట్రస్టు ఫౌండేషన్ వేడుకలు నిర్వహించింది. 27 సంవత్సరాల ట్రస్టు బ్రోచర్‌ను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో ఏర్పాటుచేసిన ట్రస్టు, ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ప్రకృతి విపత్తుల సందర్భంగా సహాయక చర్యలు, ఎన్టీఆర్ సుజల, రక్తనిధి కేంద్రాలు, సాధికారత, ఉద్యోగ కల్పన, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో సేవలు అందిస్తోందని ఆయన వివరించారు. ఇప్పటివరకు 12,095 ఆరోగ్య శిబిరాల ద్వారా 19.74 లక్షల మందికి ఉచితంగా వైద్య సేవలందించినట్లు తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా 50 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులను గుర్తించి, వారికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు రాజేంద్రకుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, ఎన్టీఆర్ ట్రస్టు సీవోవో ఎ. గోపి, టీడీపీ రాష్ట్ర నాయకులు, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

సజ్జల కుటుంబానికి డబుల్ ఓట్లపై చర్య తీసుకోండి

- సీఈసీకి టీడీపీ నేత అచ్చెన్నాయుడు ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఓట్లు ఉండటంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి, చర్యలు తీసుకోవాలంటూ గురువారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు.

సీఈసీ దృష్టికి పెద్దిరెడ్డి వ్యవహారం

చిత్తూరు జిల్లా రాజకీయ పరిస్థితులపై స్వతంత్ర ఏజెన్సీతో విచారణ చేయించి, సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. పారదర్శక ఎన్నికల నిర్వహణకు పెద్ద సంఖ్యలో కేంద్ర బలగాలను, పరిశీలకులను నియమించాలని కోరారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికలప్పుడు ఎన్నికల సంఘాన్ని, జిల్లా కలెక్టర్‌ను బెదిరించిన మంత్రి పెద్దిరెడ్డి.. వచ్చే ఎన్నికల్లోనూ చిత్తూరు జిల్లాలో అరాచకాలు సృష్టించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యల వీడియో క్లిప్పింగులు, ఇతర సాక్ష్యాధారాలను లేఖకు జత చేశారు.

ఎన్నికల సంఘం ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వాలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచడం, బీఎల్వోలుగా పని చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని పోలింగ్ బృందంలో చేర్చకుండా, సహాయక విధులకు పరిమితం చేయడం వంటి చర్యలను స్వాగతిస్తున్నామని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ పేర్కొంది. ఈమేరకు సంస్థ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల పూర్వ ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సంఘం ఉత్తర్వులు.. సకాలంలో తీసుకున్న సరైన చర్య అని, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఈ ఉత్తర్వులు తోడ్పడతాయని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలందరికీ విశ్వాసం కలగడానికి వీలవుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు వినియోగించుకోవడానికి మార్గం సుగమం చేయడం ద్వారా ఈ విషయమై నెలకొన్న అనుమానాలకు కూడా తెరదించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. తాజా చర్యల నేపథ్యంలో ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు.


ఏపీ పోలీస్ కమాండో జట్టుతో డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి

పోలీస్ కమాండో జట్టుకు డీజీపీ అభినందన

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన ఆలిండియా 14వ పోలీస్ కమాండో కాంపిటీషన్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఏపీ పోలీస్ కమాండో జట్టును డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి అభినందించారు. ఈ పోటీల్లో మొత్తం 8 ట్రోఫీలకుగాను నాలుగింట జయకేతనం ఎగురవేసిన ఏపీ కమాండోస్ గురువారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి పతకాలు సాధించిన పోలీసులను అభినందించారు. 16 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 23 ప్రత్యేక దళ కమాండోలు పాల్గొన్న పోటీల్లో ఏపీ అన్ని విభాగాల్లోనూ సత్తా చాటి, 300పాయింట్లకుగాను 267.2 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిందన్నారు.

ఏపీ ఆర్‌సెట్ నోటిఫికేషన్ విడుదల

తిరుపతి వర్సిటీ/అమరావతి, ఫిబ్రవరి 15: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ఎస్వీయూ నిర్వహించనున్న ఏపీఆర్‌సెట్ నోటిఫికేషన్ గురువారం విడుదలైంది. ఈ నెల 20 నుంచి మార్చి 19వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు తెలిపారు. ఏప్రిల్ 4 నుంచి 7 వరకు సవరణలకు అవకాశం కల్పించారు. అదే నెలలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. సమాచారం కోసం.. 9030407022 ఫోన్ నెంబరులో కానీ, ఏపీఎస్‌సీహెచ్‌ఈ. ఏపీ.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌ను కానీ సంప్రదించవచ్చన్నారు.

బీడీ ఆకు టెండర్లలో గోల్‌మాల్

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీడీ ఆకు టెండర్లలో అవకతవకలు జరిగాయని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. గిరిజనుల నుంచి బీడీ ఆకు సేకరించి, వ్యాపారులకు విక్రయించేందుకు నోడల్ ఏజెన్సీగా అటవీ అభివృద్ధి సంస్థ ఈ-టెండర్లు పిలిచింది. ఈ నెల14న తొలి విడత 14 మంది టెండరు బిడ్లు దాఖలు చేయగా, ఏడుగురి డిపాజిట్లు వెనక్కి వచ్చాయి. ముగ్గురి బిడ్లు ఆమోదం పొందినట్లు చెబుతున్నారు. నిబంధల ప్రకారమే అన్ని డాక్యుమెంట్లతో బిడ్లు దాఖలు చేసినా.. తిరస్కరించారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీనిపై రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా టెండర్లు పారదర్శకంగానే నిర్వహించామని చెప్పారు. నిర్ణీత సమయంలో రాని, తగిన డాక్యుమెంట్లు లేని బిడ్లు తిరస్కరణకు గురవుతాయని తెలిపారు.

ఎస్జీటీలో.. బీఈడీలకు అనుమతిపై హైకోర్టులో పిటిషన్

డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్జీటీ పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులను అనుమతించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా అద్దంకికి చెందిన బొల్లా సురేశ్ ఈ పిటిషన్ వేశారు. ప్రభుత్వ నిర్ణయం విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 23, సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యేందుకు 19 రోజులే ఉందని, అన్ని సబ్జెక్టులు అధ్యయనం చేయడానికి ఈ సమయం సరిపోదన్నారు. ఎస్జీటీ పోస్టుల భర్తీకి బీఈడీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌లోని నిబంధనను రద్దు చేయాలని కోరారు.

అగ్రిగోల్డ్ బాధితుల న్యాయ పోరాట దీక్ష

విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 15: గత ఎన్నికల సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వారంలోగా సమస్య పరిష్కరించకుంటే తాడోపేడో తెల్చుకుంటామన్నారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో అగ్రిగోల్డ్ బాధితుల 'న్యాయ పోరాట దీక్ష' గురువారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ బాధితులకు నేటికీ న్యాయం చేయకుండా సీఎం జగన్ మోసం చేశారని మండిపడ్డారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీకి చెందిన వేల కోట్ల ఆస్తులను విక్రయించి బాధితులకు ఎందుకు న్యాయం చేయడం లేదని ప్రశ్నించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ 'వై నాట్ 175' నెరవేరాలంటే అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించాలన్నారు. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ.లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు ప్రసంగించారు.

ఎవడైతే నాకేంటి!?

- వైసీపీలో 'క్వార్ట్జ్' దుమారం
- దోచుకునేందుకు కాకాణి, అనిల్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు
- కాకాణి వర్గం వాహనాలను పట్టించిన అనిల్ వర్గీయులు
- కన్నెర్ర చేసిన మంత్రి కాకాణి
- నెల్లూరు జిల్లాలో అక్రమ మైనింగ్ అడ్డుకోవాలంటూ అధికారులకు లేఖ
- తాము మాత్రమే వ్యాపారం చేయాలని అనిల్ వర్గం బెదిరింపులు

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

నెల్లూరు జిల్లాలో అక్రమ సంపాదన కోసం వైసీపీ నేతలు సిగపట్లు పడుతున్నారు. 'మేం సంపాదించుకోవాలి' అని ఒకరంటే.. 'కాదు కాదు.. మేం మాత్రమే సంపాదించుకోవాలి' అని మరొకరు అడ్డుపడుతున్నారు. ఒకరి వాహనాలను మరొకరు అధికారులకు పట్టిస్తూ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. జిల్లాలో విలువైన తెల్లరాయి (క్వార్ట్జ్)ని దోచుకునేందుకు అధికార పార్టీ నేతలు పోటీ పడుతున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మధ్య మొదటి నుంచీ ఉన్న ఆధిపత్య పోరు తెల్లరాయి అక్రమ తవ్వకాలతో తారస్థాయికి చేరుకుంది. ఐదు రోజుల క్రితం కాకాణి వర్గీయులకు చెందిన తెల్లరాయి తరలిస్తున్న వాహనాలను చిల్లకూరు వద్ద అనిల్ వర్గీయులు అధికారులకు పట్టించారు. ఆ వెంటనే మంత్రి రంగంలోకి దిగారు. జిల్లాలో అక్రమంగా తెల్లరాయి ఎలా తవ్వుతారో తానూ చూస్తానంటూ అధికారులకు లేఖ రాశారు. జిల్లాలో మూడు నెలలుగా విచ్చలవిడిగా తెల్లరాయి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు రూ.వెయ్యి కోట్ల విలువైన తెల్లరాయిని వైసీపీ నేతలు దేశం దాటించి ఉంటారని అంచనా. ప్రభుత్వ స్థాయిలోనే ఎవరెవరు ఏ మండలంలో తవ్వకాలు జరుపుకోవాలనేది నిర్ణయించడంతో ఏ ఒక్క అధికారి కూడా అడ్డుకునే సాహసం చేయలేకపోతున్నారు. టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పొదలకూరు మండలంలో అక్రమ తవ్వకాలను, తెల్లరాయి తరలిస్తున్న వాహనాలను అడ్డుకొని మూడు రోజుల పాటు సత్యాగ్రహ దీక్ష చేసినా ఒక్క అధికారి కూడా కన్నెత్తి చూడలేదు. నాడు తన సొంత మండలంలో ఇంత జరిగినా మంత్రి కాకాణి పట్టించుకోలేదు. ఇప్పుడు తన వర్గీయుల వాహనాలను అధికారులు అడ్డుకోవడంతో ఆయనలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. తమను అడ్డుకున్నప్పుడు ఇతరులెవరూ తవ్వకాలు జరిపేందుకు వీల్లేదంటూ అధికారులకు హుకుం జారీ చేశారు. జిల్లాలో అక్రమ తెల్లరాయి తవ్వకాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి అడ్డుకోవాలంటూ జిల్లా అధికారులకు మంత్రి లేఖ రాశారు. మూడు రోజులుగా తెల్లరాయి తవ్వకాలు నిలిచిపోయాయి. మరోవైపు అనిల్ వర్గం మాత్రం తామొక్కరిమే వ్యాపారం చేయాలని, ఎవరైనా తమకే తెల్లరాయిని విక్రయించాలంటూ బెదిరిస్తున్నట్లు ప్రచారం. ప్రజా సమస్యల పరిష్కారంలో పోటీపడాల్సిన ప్రజాప్రతినిధులు, అక్రమ సంపాదన కోసం పోటీ పడుతుండడం వైసీపీ ప్రభుత్వంలోనే చెల్లిందంటూ ప్రజలు విస్తుపోతున్నారు.


ప్రజలను వెళ్లనీయకుండా అడ్డుకుంటున్న పోలీసులు

వివాహ వేడుకలో సీఎం.. మండుటెండలో జనం

- 20 నిమిషాల జగన్ పర్యటన... గంటల తరబడి ప్రజల నిరీక్షణ
- ట్రాఫిక్ ఆంక్షలతో తప్పని తిప్పలు


రోడ్డు వెంబడి ఏర్పాటు చేసిన ఇనుప బారికేడ్లు

కర్నూలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ మోహన్ రెడ్డి పర్యటన ఉందంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆయన పర్యటన కొద్ది నిమిషాలైనా సరే గంటల కొద్దీ ప్రజలు, ప్రయాణికులు నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కర్నూలు నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మనవడు పవన్‌కల్యాణ్‌రెడ్డి, కీర్తనరెడ్డిల వివాహం జరిగింది. ఈ వేడుకకు సీఎం రావడంతో విధించిన ఆంక్షలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కర్నూలు- కోడుమూరు రహదారిపై ఉన్న కల్యాణ మండపానికి సీఎం జగన్ వస్తుండటంతో ఆ రహదారిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. జగన్ వచ్చి వెళ్లే వరకూ ఎవరినీ రహదారిపై అనుమతించలేదు. ముందురోజే రహదారిపై ఇనుప బారికేడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి జగన్ కల్యాణమండపానికి వెళ్లే వరకు రహదాలన్నీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వివాహ వేడుకలో కేవలం 20 నిమిషాలు మాత్రమే జగన్ ఉన్నారు. అయితే ప్రజలు మాత్రం గంటల కొద్దీ కోడుమూరు- కర్నూలు ప్రధాన రహదారిపై వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయకుండా ఆంక్షలతో తమను ఇబ్బందుల పాలు చేయడం ఏమిటని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్

- డిప్యూటీ సీఎం ఇంటి ముట్టడి యత్నం
- ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతల అరెస్ట్


యూత్ కాంగ్రెస్ నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: ఏటా జాబ్ క్యాలెండరు అంటూ జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి నట్టేట ముంచిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధు యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందంటూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధ్రువకుమార్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గోకుల్‌లాడ్జీ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడి నుంచి సమీపంలోని డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఇంటిని ముట్టడించేందుకు వెళుతుండగా పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వారిని పోలీసులు అడ్డుకుని చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాగమధుయాదవ్, రామారావు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలు, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి అధికారం చేపట్టాక నిరుద్యోగులను నిలువునా మోసం చేశాడని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి సహకారం లేక యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి కొన్ని పోస్టులు మాత్రమే విడుదల చేసి దగా చేశారన్నారు. కమీషన్ల కక్కుర్తితో ఏడేళ్లుగా రూ.17 లక్షల కోట్ల పెట్టుబడులను పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల యువత జీవితాలతో చెలగాట మాడారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో యువత డ్రగ్స్, గంజాయి, మద్యం వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాన్ని పాడు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె పవన్‌తేజ్ పాల్గొన్నారు.

పథకాలకు జగన్ సొంత డబ్బు ఇవ్వట్లేదు

- నియోజకవర్గాన్ని నేనే అభివృద్ధి చేశా: కాపు రామచంద్రారెడ్డి

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జగన్ తన సొంత డబ్బు ఇవ్వడం లేదని, అది ప్రజల సొమ్ము అని అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి కట్టే పన్నులను పథకాల రూపంలో తిరిగి వారికే అందిస్తున్నారని అన్నారు. డి.హీరేహాళ్‌లో గురువారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ రెబెల్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో కాపు రామచంద్రారెడ్డికి టికెట్ నిరాకరించిన నేపథ్యంలో సీఎం జగన్‌ను నేరుగా టార్గెట్ చేస్తున్నారు. నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేయలేదని, ఎమ్మెల్యేలమే ఆ పని చేయగలమని అన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. ఏ ప్రొటోకాల్ ప్రకారం మెట్టు గోవిందరెడ్డి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశ్నించారు. అసమర్థుడైన గోవిందరెడ్డిని కాకుండా సమర్థుడైన కాలవ శ్రీనివాసులుని గెలిపించాలని కాపు పరోక్షంగా అన్నారు. అనంతరం గోవిందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తానే అభ్యర్థిగా ఉంటానని, కొందరు చేసే ప్రచారాలను నమ్మవద్దన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గోప్యతకు చెల్లుచీటీ

ఎ రేళ్ళుగా ఉన్న ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగానికి వ్యతిరేకం అంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం ప్రకటించింది. వ్యక్తులు, సంస్థలు రహస్యంగా, ఎంత మొత్తాన్ని అయినా రాజకీయ పార్టీలకు ఇవ్వగలిగే అవకాశం ఉన్న ఈ విధానం ప్రజల ప్రాథమిక హక్కులను అతిక్రమిస్తున్నదని సుప్రీంకోర్టు అభిప్రాయం. పథకాన్ని రద్దుపరచడంతో పాటు, ఇక బాండ్ల అమ్మకాన్ని నిలిపివేయాలని, 2019 నుంచి ఇప్పటివరకూ జారీ చేసిన బాండ్ల వివరాలు, అంటే, కొనుగోలుదారు–బాండు విలువతో కూడిన సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి 6వతేదీలోగా అందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కోర్టు ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆ సమాచారాన్నంతా మార్చి 31వతేదీలోగా తన వెబ్‌సైట్‌లో ఉంచాలి. ఇంకా నగదుగా మార్చుకోని బాండ్లను రాజకీయపార్టీలు వెనక్కు ఇచ్చేయాల్సి ఉంటుంది. మొత్తంగా ఈ గొలుసుకట్టు చర్యల ద్వారా సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల విధానం నీతిబాహ్యమైనదీ, లోపభూయిష్టమైనదీ అని తేల్చిచెప్పింది. ఈ తీర్పును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్వాగతిస్తూనే, కొత్త ఎత్తుగడలు, కుటిలయత్నాలు వద్దని మోదీ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పారదర్శకతకు పాతరేస్తున్నదంటూ ఈ పథకాన్ని సుప్రీంకోర్టు రద్దుచేస్తే, రాజకీయ విరాళాలలో పారదర్శకతను పెంచేందుకే ఈ బాండ్లు తెచ్చామని బీజేపీ నాయకులు వెంటనే సమర్థింపు వ్యాఖ్యలు చేయడంతో, ఓ ఆర్డినెన్సు ద్వారా ఈ తీర్పును రద్దుపరచడానికి బీజేపీ ప్రయత్నిస్తుందన్న అనుమానం ఖర్గేకు కలిగి ఉండవచ్చు.

విపక్షాలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించాయి. ఎన్నికల బాండ్ల ద్వారా ఇప్పటివరకూ అధికార బీజేపీ ఒక్కదానికే దేశంలోని ముప్పై రాజకీయపక్షాల కంటే ఎక్కువ మొత్తం ముట్టిన నేపథ్యంలో, వాటికి ఆ మాత్రం అక్కసు ఉండకపోదు. అధికారపక్షానికి అధికారికంగా లంచం ఇవ్వడానికి ఈ విధానం దోహదపడుతున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ పథకాన్నే కాక, దానికి పునాదులువేసిన ఐటీ, కంపెనీ చట్టాల్లో సవరణలను సైతం సుప్రీంకోర్టు కొట్టివేయడం దానికి ఉత్తేజాన్నిచ్చింది. ఇక, పిటిషనర్ల వాదనలతో కోర్టు చాలా అంశాల్లో ఏకీభావం ప్రకటించడం విశేషం. ప్రధానంగా బీజేపీకీ, ఆ తరువాత రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలకే ఎక్కువ మొత్తాలు వెడుతున్నందున అది క్విడ్ ప్రోకోకు అవకాశం ఇస్తున్నదని, ఈ విధానం అన్ని పార్టీలకూ సమన్యాయం చేయడం లేదన్న వాదన కోర్టుకు నచ్చింది. ఏ రాజకీయ పార్టీకి ఎవరు ఎంత విరాళం ఇచ్చారన్నది ప్రజలకు ఎలాగూ తెలియకపోగా, బ్యాంకునుంచి ఆ వివరాలు తెలుసుకోగలిగే అవకాశం అధికారంలో ఉన్నవారికి ఉండటం, విపక్షాలకు లేకపోవడం అక్రమం, ప్రమాదకరం అని కోర్టు గుర్తించింది. అధికారపార్టీకే అధిక విరాళాలు ఎందుకు అందుతున్నాయి, ఎన్నికల సంఘమే బాండ్ల నిధులన్నీ సేకరించి అన్ని పార్టీలకూ పంచవచ్చును కదా అని న్యాయస్థానం గతంలో ప్రశ్నించినప్పుడు, అప్పుడు అసలు విరాళాలే రావు అని సొలిసిటర్ జనరల్ ఓ మాటన్నారు. భూరి విరాళాలు ఎవరికి ఎందుకు అందుతాయో కోర్టుకు తెలియకపోదు.

ఏడు దశాబ్దాలుగా రాజకీయ విరాళాలకు సంబంధించి ఒక చక్కని, పారదర్శకమైన విధానాన్ని తయారుచేసుకోలేకపోయాం, దీనితో పాప ప్రక్షాళన సాధ్యం అంటూ నాలుగుకీలకమైన చట్టసవరణలతో, ఏమాత్రం జవాబుదారీతనం లేని ఈ బాండ్ల విధానాన్ని ప్రభుత్వం తెచ్చింది. దేశీయ కంపెనీలకు శక్తికి మించి విరాళాలు ఇవ్వగలిగే అవకాశంతో పాటు, విదేశీ కంపెనీలు సైతం గోప్యంగా నిధులు ధారపోసేందుకు వీలుకల్పించింది. బాండు కొన్నవారికీ, నగదుగా మార్చుకుంటున్న పార్టీకి మధ్య ప్రతీదశలోనూ గోప్యత వచ్చిచేరింది. ఎన్నికల సంఘానికి లెక్కలు అప్పచెప్పాల్సిన అవసరం రాజకీయపార్టీలకు లేకుండా పోయింది. ఆదిలో ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఈసీ అనంతరం మారుమాట్లాడకుండా ఊరుకుంది.

ఈ బాండ్ల నిధులతోనే రాజకీయపార్టీలన్నీ బతికేస్తున్నాయని, ఎన్నికల యుద్ధం చేస్తున్నాయని ఎవరికీ భ్రమలు లేవు. కానీ, అప్పటి వరకూ సాగుతున్న ఓ బల్లకిందవ్యవహారాన్ని సంపూర్ణంగా మార్చకుండా, మరోరూపంలో దానినే అధికారికం చేసిన ఈ విధానాన్ని ఇప్పుడు కోర్టు కాదన్నది. తాను ఇచ్చినది ఎంతో, అందుకున్న పార్టీ ఏమిటో ఎవరికీ తెలియకూడదని దాతలు కోరుతున్నంత మాత్రాన అదే విధానంగా మారకూడదు. ఏ రాజకీయపార్టీకి ఎవరు దాతలో ప్రజలకు తెలిస్తే, ఎవరికి ఓటువేయవచ్చునో ప్రజలు నిర్ణయించుకోవచ్చు.

మనిషితనాన్ని ప్రేమించిన కథకుడు

‘తండ్రీ కొడుకుల మధ్య, భార్యాభర్తల మధ్య, సోదరుల మధ్య, ఆత్మీయుల మధ్య బాంధవ్యం అనురాగ బాంధవ్యంగానే కొనసాగాలి తప్ప ఆస్తి సంబంధం కాకూడదు. ఆస్తి సంకెళ్ళకు ఈ అనుబంధం చిక్కకూడదు. ప్రేమానుబంధాలను మించిన ఆస్తి ప్రపంచంలో మరేదీ లేదు. జీవితం కొత్త విలువలతో విశాలం కావాలి. సంకుచితపరిచే ఇరుకు సాంఘికాచారాల పెత్తనం సాగకూడదు. సదాశయాలను ప్రేమించి జీవించడంలో శాంతి, సంతోషాలున్నాయి’ అని త్రికరణశుద్ధిగా విశ్వసించిన కథా రచయిత శ్రీపతి. పూర్తిపేరు పుల్లట్ల చలపతిరావు. పుట్టింది శ్రీకాకుళం జిల్లా బైరిపురంలో. విద్యాభ్యాసం ఇచ్ఛాపురం, విశాఖపట్నం. ఉద్యోగం కొంతకాలం రాష్ట్ర రాజధానిలో, మరికొంత కాలం దేశ రాజధానిలో చేశారు. సృజన కార్యక్షేత్రాలు కూడా ఇవే. కథా ఇతివృత్తాలు మాత్రం దేశవ్యాప్తమైనవి. కథల సందేశం విశ్వజనీనం.

‘బెనారస్ కథలు’, ‘ఎల్లోరాలో’, ‘వాళ్ళు ముగ్గురు’, ‘సత్యజిత్‌రాయ్ ఎవరు?’, ‘మంచు పల్లకి – మరి తొమ్మిది’, ‘శ్రీపతి కథలు’... ఈ పుస్తకాల ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం సంపాదించుకున్న ప్రతిభావంతుడైన కథా రచనా శిల్పి శ్రీపతి. ఆయన గొప్ప కథా రచయిత మాత్రమే కాదు, నాలాంటి ఎందరో సాహితీవేత్తలను తయారు చేసిన ఒక సాహిత్యక్షేత్రం.

సముద్రం కనబడినా, సముద్రమనే మాట వినబడినా మైమరిచిపోయే సముద్ర హృదయుడి కథల నిండా ప్రకృతి ప్రీతి, అడవులూ, కొండలూ, నదీనదాలు, సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయం సముచితంగా కనబడుతుంటాయి. ‘ప్రకృతి శోభ ముందు ఏ ఐశ్వర్యమూ, సంపదా, ఏ పదవీ సరితూగదు. ఇంత సుందరమైన పురాతన ప్రకృతి మనకు అర్థంకాని రహస్యం. కొండలు మనం చిత్రాల్లో, ఛాయాచిత్రాల్లో నీలంగా ఉన్నట్లు చూస్తాం. కానీ కొన్నిచోట్ల కొండలు ముదురాకు పచ్చరంగులో ఉన్నట్లు కనబడతాయి. పర్వతారణ్యాలు ఒక అద్భుతం. హృదయానికీ, భౌగోళికమైన అందాలకీ మధ్య జన్మజన్మల అనుబంధం ఉన్నట్లు అన్పిస్తుంది.’... ఇదీ శ్రీపతిగారి భావుకత. సాధారణంగా కవి హృదయంలో ప్రతిఫలించే అనుభూతి – గాఢత కథా రచయితలో అడుగడుగునా కనబడుతూ పాఠకులను మంత్రముగ్ధులను చేస్తుంది.



గత అర్ధ శతాబ్ద కాలంగా గ్రామాల్లోనూ, నగరాల్లోనూ జరుగుతున్న పరిణామాలు, మానవ మనస్తత్వాలపై వాటి ప్రభావాల విశ్లేషణ శ్రీపతి కథల ముడి సరుకు. ఒకవైపు ఆధునికత శరవేగంగా జీవితాల్లోకి, కుటుంబాల్లోకి దూసుకు వస్తున్నా, మరోవైపు మనల్ని వదలకుండా పట్టుబిగిస్తున్న కులం, కట్టుబాట్లు, మూఢవిశ్వాసాలు, కట్టుకథల ప్రచారం, ద్వంద్వ విలువలు వంటివాటిని చక్కటి కథాకథనంతో, సహజ సిద్ధ వాడుక భాషలో కథలుగా రచించిన ఉత్తమ కథకుడు శ్రీపతి.

గత అర్ధ శతాబ్దకాలంగా గ్రామాల్లోనూ, నగరాల్లోనూ జరుగుతున్న పరిణామాలు, మానవ మనస్తత్వాలపై వాటి ప్రభావాల విశ్లేషణ శ్రీపతిగారి కథల ముడి సరుకు. ఒకవైపు ఆధునికత శరవేగంగా జీవితాల్లోకి, కుటుంబాల్లోకి దూసుకు వస్తున్నా, మరోవైపు మనల్ని వదలకుండా పట్టుబిగిస్తున్న కులం, కట్టుబాట్లు, మూఢ విశ్వాసాలు, కట్టుకథల ప్రచారం, ద్వంద్వ విలువలు వంటి వాటిని చక్కటి కథాకథనంతో, సహజసిద్ధ వాడుక భాషలో కథలుగా రచించిన ఉత్తమ కథకుడు శ్రీపతి. మనిషినీ, మనిషిలోని మనిషితనాన్ని ప్రేమించే ఉదాత్త లక్షణం ఆయన కథలకు జీవనాడి.

ఇక ఆయన వ్యక్తిత్వం విషయానికి వస్తే, ఒక తరాన్ని ప్రభావితం చేసిన ఉత్తమ ఉపాధ్యాయులు. శిష్యులపై అపారమైన ప్రేమను వర్షించిన సహృదయులు. 1969లో హైదరాబాద్ పాతనగరంలోని లాల్ దర్వాజాలో వెంకట్రావ్ స్మారకోన్నత పాఠశాలలో ఆంగ్ల భాషా ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరారు. తరగతి గదిలోకి రాగానే ‘మహాప్రస్థానం’లోని ఒక కవితా ఖండిక చదివి వినిపించేవారు. అయిదు నిమిషాలపాటు ఆనాటి దినపత్రిక హెడ్‌లైన్స్ చదివేవారు. ఆ తరువాత పాఠం బోధించేవారు. నేను అప్పుడు తొమ్మిదో తరగతి విద్యార్థిగా ఆ స్కూల్‌లోనే చదువుతున్నాను. ఆ రకంగా శ్రీపతిగారు నాకు ప్రత్యక్ష గురువు. నేనప్పుడు రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో చురుకైన కార్యకర్తను. బాలల దళానికి శిక్షకుడిని. మాష్టారు కమ్యూనిజం చెబుతున్నారని తరగతిలోనే ఒకసారి ఆయనతో వాదనకు దిగాను. ఆయన కోపగించుకోలేదు. ఓపికగా నా ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పారు. ఆ తరువాతి రోజు స్కూల్ వేళలు పూర్తయ్యాక నా భుజం మీద చేయివేసి, మా ఇంటి కొస్తావా? అని అడిగారు. నేను సరేనని, నారాయణగుడాలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి మహిళా కళాశాలకు ఎదురుగా ఉన్న సందులో ఆయనతోబాటు ఆయన గదికి వెళ్ళాను. గది తెరిచి ఉంది. జ్వాలాముఖి టీ కాస్తున్నాడు. నిఖిలేశ్వర్ బిస్కట్లు తింటున్నాడు. ఆర్టిస్ట్ చంద్ర తను రూపొందించిన సినిమా పోస్టర్‌ను మిత్రులకు చూపెట్టడానికి తెచ్చాడు. వాళ్ళంతా శ్రీపతి సార్ మిత్రులని తెలిసి ఆశ్చర్యపడ్డాను. అరగంటసేపు వాళ్ల కబుర్లు విని, ‘సరేసార్! వెళ్లొస్తా’నని లేచాను. ఆగు ఒక్క నిమిషం! అని తన బుక్‌షెల్ఫ్‌లోంచి మాక్సింగోర్కీ రాసిన ‘అమ్మ’ నవల తీసి నాకు ఇచ్చి, చదివి ఇమ్మన్నారాయన. ఇంటికెళ్లాక నవల చదవడం మొదలుపెట్టాను. నవల పూర్తిగా అర్థం కాలేదు కానీ మెదడంతా గందరగోళమయింది. అప్పటిదాకా నాకు తెలిసిన ‘జంబూద్వీపే భరతఖండే’కు ఆవల ఒక పెద్ద ప్రపంచముందని అర్థమయింది. వారం రోజుల్లో నవల చదివి శ్రీపతి గారికిచ్చాను. ఆయన ‘మహాప్రస్థానం’ చదవడానికిచ్చారు. ఆ తరువాత ‘రక్తాక్షరాలు’, ‘ఉక్కుపాదం’, ‘చెంఘీజ్‌ఖాన్’ నవలలు. క్రమంగా కథా సంపుటులు, కవితా సంకలనాలు ఇచ్చి నాతో చదివించారు. నా అభిప్రాయాల్లో మార్పు వచ్చింది. ఆరెస్సెస్ శాఖా కార్యక్రమాలకు వెళ్ళడం మానేశాను. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగింది. చిన్నచిన్న కవితలు రాయడం మొదలుపెట్టాను. 1970లో నేను పదవతరగతి కొచ్చాను. శ్రీపతి గారే మాకు ఆంగ్ల ఉపాధ్యాయుడు. ఒకరోజు పాఠం చెబుతున్న ఆయన కంట్లో నోటుబుక్‌లో నేను రాసుకున్న కవిత ‘మానవత్వాన్ని రక్షించుకుందాం’ పడింది. ఆయన చదివారు. ఎవరు రాశారు? అని అడిగారు. ‘నేనే’ అని బదులిచ్చాను. ఆశ్చర్యపడ్డారు. ఫెయిర్ కాపీ రాసివ్వమన్నారు. రాసిచ్చాను. కరీంనగర్ నుండి ఆ రోజుల్లో వెలువడుతున్న ‘విద్యుల్లత’ మాసపత్రికకు ఆయనే పంపారు. అది ఏప్రిల్ నెల సంచికలో బహుమతి పొందిన కవితగా అచ్చయింది. అప్పటికే ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంలో మా ‘విప్లవశంఖం’ గేయ వాహిని వెలువడింది. అవి ఉద్యమగీతాలు. అచ్చయిన నా మొదటి వచన కవిత శ్రీపతిగారి ప్రమేయంతోనే ప్రచురింపబడింది.

ఇలా ఎందరో విద్యార్థులు మార్క్సిజం భావజాలం పట్ల ఆకర్షితులు కావడానికి శ్రీపతి ఉత్ప్రేరకంగా పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలేసిన తరువాత ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం నుంచి జాతీయ వార్తలు చదివే న్యూస్ రీడర్‌గా కొంతకాలం పాటు పనిచేసి, అపారమైన మిత్ర సంపదను సంపాదించుకున్నారు. తరువాత హైదరాబాద్ నగరంలో స్థిరపడ్డారు. శ్రీపతిగారితో అర్ధ శతాబ్దానికిపైగా కొనసాగిన నా అనుబంధాన్ని గమనించిన గుంటూరు అభ్యుదయ రచయితల సంఘం మిత్రులు, ముఖ్యంగా పెనుగొండ లక్ష్మీనారాయణ నా చేత ‘శ్రీపతి కథలు’ సంపుటిని రూపొందింపజేశారు. శ్రీపతి దిగంబర, విప్లవ కవులకు సన్నిహితమిత్రులు, విరసం వ్యవస్థాపకుల్లో ఒకరు. ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు, గొప్ప కథా రచయిత శ్రీపతి మరణం తెలుగు సాహిత్య రంగానికి తీరని నష్టం.

■ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

‘మద్దతు ధర’: మోదీపై కాంగ్రెస్ అస్త్రం

మోదీ అజేయుడు అనే భావన అందరిలోనూ బలపడిపోతోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఆయన నేతృత్వంలోని బీజేపీ మరోమారు ఘనవిజయం సాధించనున్నదనే అభిప్రాయం దేశవ్యాప్తంగా వ్యక్తమవుతోంది. అయితే మోదీ అజేయశక్తిని గట్టిగా ప్రశ్నించగలిగే, సమర్థంగా ఎదర్కోగలిగే అంశం ఒకటి ఎట్టకేలకు రంగంలోకి ప్రవేశించింది. మోదీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రయోగించిన అస్త్రమది– వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర. అవును ఉత్తరాది రైతులను మళ్ళీ మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు పురిగొల్పిన అంశమది. కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలచింది. మోదీనా లేక కనీస మద్దతు ధరా? 2014 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఆ మాటకొస్తే మన రిపబ్లిక్ భవిష్యత్తు ఈ ఒక్క ప్రశ్నపైనే ఆధారపడి ఉన్నది. తాము అధికారంలోకి వస్తే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇది సరైన నిర్ణయం, సందేహం లేదు. అయితే అది మరింత ప్రభావవంతమయ్యేందుకు మరింత ముందుకు వెళ్లవలసి ఉన్నది.

రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర అంబికాపూర్ (ఛత్తీస్‌గఢ్‌లోని ఒక చిన్నపట్టణం)కు చేరిన సందర్భంగా అక్కడ జరిగిన ఒక బహిరంగ సభలో కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రపకటించారు. స్వామినాథన్ కమిషన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి)కి చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఆ సభలో ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రప్రథమంగా చేసిన కీలక ప్రకటన ఇది.

ఈ ప్రకటనకు కీలక ప్రాధాన్యమున్నదనే వాస్తవాన్ని ఏ రాజకీయ పరిశీలకుడూ నిరాకరించలేడు. కనీస మద్దతు ధర విషయమై తాను అధికారంలో ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనుసరించిన వైఖరికి కాంగ్రెస్ తాజా నిర్ణయం భిన్నమైనది. నిజానికి కనీస మద్దతు ధర విషయమై కాంగ్రెస్ ప్రస్తుత విధానాన్ని 2022లో రాయపూర్ ప్లీనరీ తీర్మానం సూచనప్రాయంగా వ్యక్తం చేసింది. అయితే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని చాలా కాలంగా రైతులు చేస్తున్న డిమాండ్‌ను నెరవేర్చడానికి కాంగ్రెస్ తిరుగులేని రీతిలో నిబద్ధమవడం ఇదే మొదటిసారి. అంతేకాదు, రైతుల ప్రాథమిక డిమాండ్ అయిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంలోని మూడు కీలక అంశాలకు ఒక ప్రధాన జాతీయ రాజకీయ పక్షం కట్టుబడడం ఇదే మొదటిసారి. కనుక కాంగ్రెస్ ప్రకటన రైతాంగ ఉద్యమ చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా చెప్పవచ్చు.

రైతుల డిమాండ్‌లోని మూడు కీలక అంశాలు ఏమిటో వివరంగా చూద్దాం. (1) కనీస మద్దతు ధరను నిర్ణయించేందుకు ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతిని ‘స్వామినాథన్ సూత్రం’కు అనుకూలంగా మార్చాలి. దీని ప్రకారం పంట సాగుకు అయిన సమగ్ర ఖర్చుల మొత్తానికి యాభై శాతాన్ని అదనంగా కలిపి ఎమ్ఎస్‌పిని నిర్ణయించాలి; (2) దీన్ని అధికారంలో ఉన్న ప్రభుత్వాల, వాటి అధికారుల ఇష్టాయిష్టాలకు వదిలివేయకుండా, ఆ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించి తీరాలి; (3) కనీస మద్దతు ధరపై ఈ హక్కును రైతులు అందరికీ సమకూర్చాలి. కేవలం ఎమ్ఎస్‌పిని ప్రకటిస్తున్న 23 పంటలను సాగు చేస్తు రైతులకు మాత్రమే ఆ హక్కును పరిమితం చేయకూడదు.



స్వామినాథన్ కమిషన్ సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర (ఎమ్ఎస్‌పి)కు చట్టబద్ధత కల్పించాలనేది రైతుల ప్రధాన డిమాండ్. దీనిని తాము నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రప్రథమంగా చేసిన కీలక ప్రకటన ఇది. ఈ హామీతో మోదీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షం ఒక గట్టి సవాల్ విసిరింది.

రైతుల డిమాండ్‌ను నెరవేర్చేందుకు కాంగ్రెస్ తన నిబద్ధతను ప్రకటించేందుకు ఇంతకంటే సరైన సమయం, సందర్భం ఉండబోవు. రెండు సంవత్సరాలు మౌనంగా ఉన్న తరువాత రైతులు మళ్లీ ఆందోళనకు పూనుకున్నారు. ప్రధాన రైతు సంఘాలు రెండూ ఆందోళనకు పిలుపునిచ్చాయి. ఉద్యమ కార్యాచరణ విషయమై వివిధ రైతు సంఘాల మధ్య ఏకాభిప్రాయం లేనప్పటికీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే అంశం వాటి డిమాండ్లలో తొలిస్థానంలో ఉన్నది. కాంగ్రెస్ తనకు తాను ఈ శక్తిమంతమైన ఉద్యమానికి మద్దతునిచ్చింది.



■ యోగేంద్ర యాదవ్

కాంగ్రెస్ మద్దతు 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేయగలుగుతుందా? మోదీ ప్రభావశీలత, అయోధ్యలో రామ మందిర నిర్మాణ మనంతరం దేశవ్యాప్తంగా ఆయనకు పెరిగిన ప్రజాదరణను కనీస మద్దతు ధర అంశం సమర్థంగా ఎదుర్కోగలదా? పూర్తిగా ఎదుర్కోలేదు. అయితే కొన్ని సంవత్సరాల క్రితం ఒక రాజకీయ కార్యకర్త నాకు ఇలా వివరించాడు: ‘చునావి ముద్ద అప్నే ఆప్ బంతా నహీ హై, బనాయ జాతా హై’ (ఎన్నికలను ప్రభావితం చేసే అంశం దానికది సొంతంగా ఉద్భవించదు, దాన్ని సృష్టించాలి). ఒక సమస్యను ప్రభావశీల ఎన్నికల అంశంగా మార్చేందుకు కనీసం ఆరు షరతులను నెరవేర్చవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తానన్న కాంగ్రెస్ ప్రకటన నాలుగు షరతులను నెరవేర్చింది. మిగతా రెండు షరతులను నెరవేర్చే విషయమై ఆ పార్టీ కృషి చేయవలసి వున్నది.

రైతుల సమస్యకు ఒక పరిష్కారాన్ని కనుగొనవలసి ఉన్నది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడమనేది అందుకొక పరిష్కారం కాగలదు. ఇందుకు ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉన్నది. ఈ లక్ష్య సాధనకు రైతులను సమీకరించవలసి ఉన్నది. సమస్యేమిటంటే రైతులలో అత్యధికులు ఇప్పటికీ కనీస మద్దతు ధర గురించి విననే లేదు! మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిర్వహించిన చరిత్రాత్మక ఆందోళన కనీస మద్దతు ధరను సాధించలేదు. అయితే కనీస మద్దతు ధర అంశాన్ని ప్రతి రైతు కుటుంబానికి సుపరిచితం చేసింది. కేవలం పెద్ద రైతులకు మాత్రమే కాకుండా వ్యవసాయ కుటుంబాలు అన్నిటికీ కనీస మద్దతు ధర గురించి ఆ ఆందోళన తెలియబరిచింది. రైతులకు మాత్రమే కాకుండా ఇతర సామాజిక వర్గాలకు కూడ ఆ సమస్యను ఎరుకపరిచింది. ఎమ్ఎస్‌పిని పొందడమనేది ప్రతి రైతు హక్కు అనేది రైతు ఉద్యమాల కార్యకర్తలకు బాగా తెలుసు. ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్న కిసాన్ సంఘ్ నేతలతో సహా రైతు నాయకులు అందరి ఆలోచనలు మూడు పదాల చుట్టూ తిరుగుతున్నాయి. అవి: ఎమ్ఎస్‌పి, స్వామినాథన్, చట్టబద్ధత. కాంగ్రెస్ ప్రకటనకు ఈ మూడు మాటలే ప్రాతిపదిక.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించాలన్న డిమాండ్‌కు ఆయన విశేష ప్రాచుర్యం కల్పించారు. రైతు ఉద్యమం ఈ విషయాన్ని విస్మరించబోదు. రైతుల చరిత్రాత్మక ఆందోళన ముగిసి రెండేళ్లు గడిచినప్పటికీ కనీస మద్దతు ధర విషయమై మోదీ ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకోలేదు.

ఎన్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించే విషయమై కాంగ్రెస్ హామీ సరైన రాజకీయ సమయంలో ఇచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా రెండు నెలల వ్యవధి మాత్రమే. ప్రభుత్వం ఈ విషయమై తన వైఖరిని మార్చుకునేందుకు సమయం మించిపోయింది. ఎన్నికల ప్రచార ఘట్టంలో ఈ ఓటర్లు ఈ అంశాన్ని తప్పకుండ గుర్తుంచుకుంటారు. కాంగ్రెస్ హామీని వారు విస్మరించబోరు. మీడియా సైతం రైతుల సమస్యలకు ప్రాధాన్యమివ్వడం అనివార్యమయింది. ‘కనీసమద్దతు ధర’ అంశం మళ్లీ పతాక శీర్షికల్లో ఉన్నది.

కాంగ్రెస్ ప్రకటన రైతు ఉద్యమ కార్యకర్తలకు కూడా ఇంకా చేరలేదు. ఇక సామాన్య రైతుల గురించి చెప్పేదేముంది? ఢిల్లీ చలో సందర్భంగా పోలీసులతో రైతుల ఘర్షణకు ప్రధాన స్రవంతి మీడియా ప్రాధాన్యమిస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రకటన గురించి ప్రస్తావించడం లేదు. మీడియా అలక్ష్యాన్ని అధిగమించి తన హామీ గురించి ప్రతి రైతుకూ తెలియజేసేందుకు కాంగ్రెస్ మరింత కృషి చేయవలసిన అవసరమున్నది.

సరే, మోదీ ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉన్న ‘ఆర్థిక వేత్తల’ను కనీస మద్దతు ధరకు చట్టబద్ధత అంశానికి వ్యతిరేకంగా తప్పక మోహరిస్తుంది. ఎమ్ఎస్‌పికి చట్టబద్ధత కల్పించడం సాధ్యం కాదని మోదీ సర్కార్ ఇప్పటికే ప్రచారం చేస్తోంది. దానివల్ల ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందని పదేపదే చెప్తోంది. ఇది పచ్చి అబద్ధం. నేను, కిరణ్ విస్సా గతంలోనే ప్రభుత్వ వాదనను ఖండించాం, ఎమ్ఎస్‌పి గ్యారంటీని ఎలా అమలు పరచవచ్చో కవిత కురుగంటి సవివరంగా రాశారు.

కనీస మద్దతు ధరను కల్పించి తీరాలి. దీనివల్ల వ్యవసాయ ఉత్పత్తులు అన్నిటిని ప్రభుత్వం సేకరించవలసిన అవసరం లేదు. కనీస మద్దతు ధరను చట్టబద్ధంగా కల్పించేందుకు పెద్ద మొత్తాన్ని వినియోగించవలసి ఉన్న మాట నిజమే. అయితే ప్రభుత్వ ఖజానా ఖాళీ అవుతుందనడం శుద్ధ అబద్ధం. స్థూల దేశీయోత్పత్తిలో ఒక శాతాన్ని రైతులకు ఇవ్వలేరా? ఇది ఎంతో రాజకీయ ప్రాధాన్యమున్న విషయం. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడమనేది దేశ భవిష్యత్తులో మదుపు చేయడమే.

కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు రాజకీయ శ్రేణుల సమీకరణ, విశేష స్థాయిలో రాజకీయ ప్రచారం అవసరం ఎంతైనా ఉన్నది. సరిగ్గా ఈ విషయంలో కాంగ్రెస్‌కు ఒక ఇబ్బంది ఉన్నది. ఎందుకంటే ఆ పార్టీ చాలా కాలంగా రైతుల సమస్యల పరిష్కారానికి పని చేయడం లేదు. రైతు సంఘాలు తనను విశ్వసనీయమైన మిత్రుడుగా పరిగణించేందుకు కాంగ్రెస్ చాలా కృషి చేయవలసి ఉన్నది. అంతే కాకుండా ‘ఇండియా’ కూటమిలోని తన మిత్ర పక్షాల మద్దతును కూడా ఇందుకు పూర్తిగా పొందాలి. ఇదేమంత కష్టమైన విషయం కాదు. సమాజ్ వాది పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్, ఎన్‌సిపి మొదలైనవి రైతు అనుకూల పక్షాలే. ‘ఇండియా’ కూటమిలోని మిత్రపక్షాలన్నిటినీ కలుపుకుని నిర్ణయాత్మక ఎన్నికల పోరాటానికి సంసిద్ధమవ్వాలి. మరి దీనివల్ల విజయం సిద్ధిస్తుందా? అన్నది అటుంచితే, ప్రజలకు సంబంధించిన ఒక ప్రధాన సమస్య ప్రాతిపదికన అధికార పక్షానికి గట్టిపోటీ నివ్వడం కచ్చితంగా సాధ్యమవుతుంది.

(వ్యాసకర్త స్వరాజ్ ఇండియా’ అధ్యక్షుడు)

నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష...!

కేయూరాణి న భూషయంతి పురుషం హారా న చంద్రోజ్జ్వలాః... అని చెప్తూ.. వాగ్భూషణం భూషణమ్.. అంటున్న ఈ శ్లోకం ఎక్కడో విన్నట్లు అనిపిస్తోంది కదూ! మూడు పదుల ఏండ్లకు లోపు ఉన్నవారికి పెద్దగా తెలియకపోవచ్చు కానీ, ఓ ముప్పై ఏండ్ల కిందటి తరానికి రేడియోలో వచ్చే ఈ శ్లోకం బాగా గుర్తే. “ఎన్ని సుగంధాలు పూసుకున్నా... చక్కని వాక్కు మించిన అలంకారం లేదు సుమా” అని దీని సారాంశం.

ఇప్పుడీ విషయం ఎందుకొచ్చిందంటే... మన రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకులు చెప్తున్న నీతుల వల్లనే. తెలంగాణ భాషకు ఇంపు, సొంపు దాని పలుకుబడుల ద్వారానే వస్తుంది. అంతే కాని తెచ్చిపెట్టుకున్న ఆలంకారాల వల్ల రానే రాదు. అందునా భాష వాడకంలో కూడా వ్యవసాయంలో ఉన్న వారి భాష ఉత్పత్తి భాష. అది జీవద్భాష. అందుకే కాళ్ల భూమిపై ఉన్న వారు సహజంగానే తమ జీవితానుభవ భాషను ఉపయోగిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడిన ‘రండ’ అనే పదాన్ని మాజీ ముఖ్యమంత్రిని సంబోధిస్తూ అన్నారని బీఆర్ఎస్ నాయకులు ఎగిరెగిరిపడుతున్నారు. చాలా కాలం ప్రజాప్రతినిధులుగా ఉన్న మరి కొందరు నాయకులు చెప్పులు చూపించారు. ఇంకొక మాజీ ప్రతినిధి మరింతహీనమైన భాషతో తమ నాలుకకు నరం లేదని, చదువుకున్న సంస్కారం కూడా లేదని నిరూపించుకున్నారు. మూడేళ్ల క్రితం కేంద్ర మంత్రిని ఉద్దేశించి మాజీ ముఖ్యమంత్రి ఇదే మాటను వాడిన విషయం వారు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు.



మాజీ ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఏమిటా మాటలు అంటూ దీర్ఘాలు తీస్తున్న అపర సంస్కారులు ఇప్పుడూ ఉన్నారు, సరిగ్గా మూడు నెలల క్రితం కూడా ఇక్కడే ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రిని, అధికార పార్టీని దద్దమ్మలు, చవటలు అని మాట్లాడితే మాత్రం వారికి చెవులు వినపడవు, కళ్లు కన్పించవు. అంతేకాదు... సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఏం పీకడానికి మేడిగడ్డ సందర్శనకు వెళ్లావని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగసభలోనే వ్యాఖ్యానించారు. ఓ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి గురించి ఇట్లా మాట్లాడొచ్చునా? ఇది ఆయన సభ్యతకు తగునా? ఒకరి విషయంలో గౌరవాలు, మరొకరి విషయంలో అగౌరవాలు ఆమోదనీయమేనా? ఒకే రీతి న్యాయం ఉండదా? ఈ ప్రాథమిక విషయాన్ని ఎందుకు గుర్తించడం లేదు. ఆ సంస్కారులకు కేసీఆర్ ఏది మాట్లాడినా వినసొంపుగా ఉంటున్నది ఎందుకు...? తెలంగాణభాష, యాస కేసీఆర్‌కు మాత్రమే స్వంతం అనే అభిప్రాయం ఎందుకు ఉందో అర్థం కాదు. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి ప్రవచనాల్లో ఇలాంటివారికి సంబంధించి ఒక ఉదాహరణ ఉంది. వేలాది శస్త్రచికిత్సలు చేసిన ఒక వైద్యునికి ఒకసారి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. వైద్యుడు ఆ నొప్పిని భరించలేకపోతూ ‘అయ్యో... నేను వేలాది ఆపరేషన్లు చేసానే, ఎన్నడూ ఇంత నొప్పిని ఎరుగకపోతిని’ అని వాపోయాడట. కేసీఆర్, ఆయన వందిమాగధులు చేస్తున్న వాదన కూడా అట్లనే ఉంది. కేసీఆర్ ఉద్యమ ముసుగులోనూ, ఆ తర్వాత కూడా నోరు పారేసుకుంటే ఈ భాషా సంస్కారులు మురిసిపోయిన సంగతి చూసినం. కేసీఆర్, ఆయన పరివారం ఎవ్వరినైనా ఏమైనా అనొచ్చు. కానీ వాళ్ళను ఎవ్వరూ ఏమీ అనకూడదు! ఈ తరహా పోకడ సరైందేనా?

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు సీమాంధ్ర నాయకులనుద్దేశించి కేసీఆర్ మాట్లాడిన భాష గురించి తెలంగాణ ప్రజలు అప్పట్లో పెద్దగా పట్టించుకోలేదు. కేసీఆర్ ఏం మాట్లాడినా ఆ రోజున్న ఉద్యమ అవసరాల రీత్యా తెలంగాణ సమాజం ఆయన వెన్నంటి నిలబడింది. పదేళ్ల పాటు తెలంగాణను పాలించారు, మార్గదర్శినని చెప్పుకున్నారు, కానీ మాటల పోకడ మాత్రం మారలేదు. పుస్తక పఠనం మనిషిని సున్నితంగా మారుస్తుంది. అటువంటప్పుడు, 80 వేల పుస్తకాల మహా చదువరి ఎలా ఉండాలి? కానీ మాజీ సీఎం కేసీఆర్ మాటల తీరు అట్లా ఉందా? భాషను ఎప్పుడు ఎట్లా వాడాలో బాగా తెలిసిన ఆయన, తన స్థాయిని తగ్గించుకునేలా నల్లగొండ సభలో ‘పాలిచ్చే బర్రెను కాదని.... దున్నపోతును తెచ్చుకున్నారు’ అని వ్యాఖ్యానించారు. ఇలా ప్రజలను తప్పుబట్టడం వారి స్థాయికి తగునా? రాజకీయ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడితే జనం మెచ్చరు. నోటికొచ్చిందల్లా మాట్లాడి... చెప్పులు చూపించి, ఛీంకరించి, గర్జించి, జనాలను భయపెట్టాలని చూస్తే అది సరికాదు. మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయిన వేదనతో అట్లా మాట్లాడారని సరిపెట్టుకునేందుకూ వీలు లేదు. రాజకీయాల్లో మంచి నిర్ణయాలే కాదు, మంచి వచనం కూడా ఉండాలి.

“భూషలు కావు మర్త్యులకు భూరి మయాంగద తార హారముల్...” అంటూ ఏనుగు లక్ష్మణ కవి మంచిగా మాట్లాడటమే మనిషికి అలంకారం అన్నాడు. దేవుడు నోరిచ్చాడు, మాట ఇచ్చాడు, ఆలోచన ఇచ్చాడు... కాస్త నాలుగు మంచి మాటలు మాట్లాడితే సరిపోయేది కదా అంటాడు. ఇక ఆలోచించుకోవాల్సిందే.. విజ్ఞులైన విపక్ష నాయకులే. తాము ఒకప్పుడు ఉండిన స్థానంలో నేడు మరొకరున్నరు. తాము కోరుకున్న గౌరవ మర్యాదలనే మరొకరు కోరుకుంటారని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

○ బోరెడ్డి అయోధ్యరెడ్డి
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్‌ఓ

అంచనాలను మించిన చక్కని పాలన

కాంగ్రెస్ అంటే అంతర్గత కుమ్ములాటలు, మితిమీరిన ప్రజాస్వామ్యం, నిత్య అసంతృప్తుల కూటమి... వగైరా విమర్శలన్నింటినీ నేడు చెత్త బుట్టలో పడేయాల్సిందే! అంత చక్కగా ఉంది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో సమన్వయం. వారి ఐకమత్యం ఇప్పుడు ప్రత్యర్థులకు కొరకరాని కొయ్య. అది తెలంగాణకు శ్రీరామ రక్ష. ఎవరి కర్తవ్యాన్ని వాళ్ల నిబద్ధతతో నిర్వర్తిస్తూ, అవతలి వాళ్ల పరిధుల్ని గౌరవిస్తూ, పరస్పరం సహకరించుకుంటూ బాధ్యతగా వ్యవహరిస్తున్నారు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి, ఆయన మంత్రి వర్యులు. దీనికి చక్కని ఉదాహరణ ఇటీవలి దావూస్ పర్యటన, అక్కడి నుంచి తెచ్చిన దాదాపు రూ.40వేల కోట్ల పెట్టుబడులే! ఈ భరోసా చాలు కదా– రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి ఢోకా ఉండదని, అభివృద్ధీ సంక్షేమం నిరాటంకంగా కొనసాగుతాయని నిశ్చింతగా ఉండడానికి! ఆరు గ్యారెంటీల్లో ఒకటైన స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని చిన్న అడ్డంకి కూడా లేకుండా చక్కగా అమలు చేస్తూ, మిగతా గ్యారంటీల సత్వర అమలు దిశగా ప్రభుత్వం తెలంగాణలో సుస్థిర సంక్షేమ ప్రగతి ప్రభుత్వం పట్ల అపార విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారు.

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ముఖ్యమైన పోర్ట్‌పోలియోలతో భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు వంటి సీనియర్ నేతలు అధికార బాధ్యతలు చేపట్టే నాటికి తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నది. ఆ విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని తప్పించి, సంక్షేమ హామీలను నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథం దిశగా నడిపించేందుకు కసరత్తు మొదలుపెట్టారు రేవంత్. అందులో భాగంగా అవినీతికి తావులేని అధికారగణం నియామకం మీద దృష్టి సారించారు. నిజాయితీపరులుగా పేరున్న అధికారులకు ముఖ్య బాధ్యతలను అప్పగించారు. కుదేలైన రాష్ట్ర ఆర్థిక రంగాన్ని ప్రక్షాళన చేయడానికి ఈ ఉన్నతాధికారుల సహకారం చాలా అవసరమని గ్రహించిన ముఖ్యమంత్రి ఈ దిశగా మొదటి అడుగువేశారు. వీరి ద్వారా గత ప్రభుత్వపు పొరపాట్లను బేరీజు వేసుకుంటూ, కొత్త తప్పులు దొర్లకుండా అప్రమత్తమవుతూ ఆర్థిక వ్యవస్థను మెరుగుదిద్దడానికి నడుం కట్టారు. అందులో భాగంగానే బకాయిల వసూలు, కొత్త ఆర్థిక వనరుల అన్వేషణ చర్యలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతున్న కొద్దీ ఒక్కొక్క హామీనీ అమల్లో పెడుతూ వస్తున్నారు ముఖ్యమంత్రి. అందులో భాగంగానే మొదట చిన్నకారు, సన్నకారు రైతులకు ‘రైతుబంధు’ అందజేయడం. ఈ కార్యాచరణతో ‘కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతు బంధు ఆగిపోతుంది, కరెంట్ ఉండదు’ వంటి ప్రచారాలను అసత్యాలుగా తేల్చుతున్నారు.

గత ప్రభుత్వం మాటిచ్చి తప్పిన హామీలకూ న్యాయం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తున్నారు. ముఖ్యంగా ఎన్నారై పాలసీ, ఎన్నారై సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం ఉపన్యాసాలకే పరిమితమైంది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆయా పాలసీలను నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. అంతేకాదు, ప్రవాసీ తెలంగాణీయుల చేత ఇక్కడ పెట్టుబడులు కూడా పెట్టించి వాళ్ల ద్వారా సొంత రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచేలా చేస్తున్నారు.

ఎవరి కర్తవ్యాన్ని వాళ్లు నిబద్ధతతో నిర్వర్తిస్తూ, పరస్పరం సహకరించుకుంటూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలంతా ముందుకు సాగుతున్నారు. ఈ క్రెడిట్ పూర్తిగా ముఖ్యమంత్రిదే. పాలనలో పారదర్శకత, హామీల అమలులో చిత్తశుద్ధి రేపటి లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం అక్కర్లేని అస్త్రాలు.



ప్రభుత్వం భర్తీ చేయగల ఉద్యోగాల పట్లా కార్యాచరణను వేగవంతం చేస్తున్నారు ముఖ్యమంత్రి. అందులో భాగంగానే ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మండలానికో గురుకుల పాఠశాల ఏర్పాటు మీద కసరత్తు మొదలుపెట్టారు. పాత శాలలను పెంచితే ఉపాధ్యాయుల నియామకమూ జరుగుతుంది. ఇక, 18 జిల్లాల ఏర్పాటు పట్ల రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో, ధోరణితో ఉన్నది. ఇప్పుడున్న జిల్లాలకు అవసరమైన యంత్రాంగం, అధికార గణం లేదు. అశాస్త్రీయ విభజనతో పాలనా విషయంలో ఇటు అధికారులు, పాలనా సౌకర్యం విషయంలో అటు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శాస్త్రీయ ఏకీకరణ ఈ రెండు సమస్యలను తీర్చే పరిష్కారంగా ఉందని అధికారులు, మేధావులు, ప్రజలు కూడా అభిప్రాయపడుతున్నారు. అందరూ ముఖ్యమంత్రి ఆలోచనను సమ్మతించడానికి కారణం ఆయన అవలంబిస్తున్న పారదర్శకతే. ప్రజాస్వామ్యానికి పారదర్శకతే ఆయువుపట్టు.

తెలంగాణ పోరులో అసువులు బాసిన అమరవీరుల స్మరణకు స్థూపాలు సరే, వారి కుటుంబాలకు ఆసరా కూడా కావాలి కదా! అందుకే అమర వీరుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉపాధి కల్పించే విషయంపై శ్రద్ధపెట్టారు రేవంత్ రెడ్డి. అంతేకాదు, ఉద్యమకారులకూ న్యాయం చేయాలనే ఆలోచన చేశారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తు ఫారంలో ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల స్థలానికి ఒక కాలమ్ కేటాయించారు. ఆరు గ్యారెంటీలూ అచ్చంగా అర్హులకే చేరాలన్న లక్ష్యంతో ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వచ్చి దరఖాస్తులను స్వీకరించింది. అత్యంత విజయవంతంగా సాగిన కార్యక్రమం ఇది. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ విషయంలో యువతకు ఇచ్చిన మాట మరువలేదు రేవంత్ రెడ్డి. అధికార బాధ్యతలు చేపట్టిన వెంటనే కమిషన్‌లోని అవకతవకలను సరిచేసేందుకు రంగంలోకి దిగారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారిని ఛైర్మన్ పదవికి నిర్ణయించారు. ఇతర కమిషన్స్, కార్పొరేషన్స్ పదవులను కూడా ప్రజాజీవితంలో ఉండి వచ్చిన వారికి ఇస్తే ప్రజల సమస్యలు, పాలనా బాధ్యతలు సరిగా తెలుస్తాయని వారికే ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు ముఖ్యమంత్రి. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ నేతలంతా ముందుకు సాగుతున్నారు. ఈ క్రెడిట్ పూర్తిగా ముఖ్యమంత్రిదే. ఈ సంయమనం, సమష్టి బాధ్యత ఎన్నికల సమయంలోనే మొదలైంది. అది ఇప్పటికీ కొనసాగుతున్నది. ఇవన్నీ కాంగ్రెస్‌కు కలిసొచ్చే విషయాలే, ప్రభుత్వాన్ని సుస్థిరపరచే అంశాలే. ఈ సానుకూలత, పారదర్శకత, హామీల అమలులో చిత్తశుద్ధి రేపటి లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం అక్కర్లేని అస్త్రాలుగా మారుతాయి, కాంగ్రెస్ గెలుపును ఖాయం చేస్తాయి.

● డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు
మాజీ ప్రధాన సమాచార కమిషనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

బూడిద కాలుష్యంపై ఉద్యమం

- ఎన్టీటీపీఎస్ రోడ్డులో విద్యార్థులతో మానవహారం
- మేధావులు, న్యాయవాదులు, వైద్యులు, రైతుల సమావేశం
- ఆ బూడిద భావితరాలకు ప్రాణ సంకటం
- ఎన్టీటీపీఎస్ గేట్ల ముందు వంటావార్పు చేద్దాం

సమావేశంలో వక్తల ఉద్ఘాటన

- 6లో..





నగరంలోని పంచాయతీరాజ్ ఆఫీసులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగుల నినాదాలు

కొండలు.. గుట్టలు.. కాల్వలు.. కాదేదీ అక్రమార్జనకు అనర్హమంటూ అధికార పార్టీ నాయకులు దోచుకు తింటున్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఎలాగైనా దోచేయాలన్న ఆలోచనతో శరవేగంగా పనులు చక్కబెట్టేస్తున్నారు. ఓవైపు వెదురుపావులూరు కొండను పిండి చేస్తుండగా, మరోవైపు పోలవరం కాల్వ మట్టి కొట్టేస్తున్నారు. ఇంకోవైపు రెడ్డిగూడెంలోని జగ్గవరపు గట్టును మంత్రి అనుచరులు గుట్టుగా తవ్వేస్తుండగా, పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఇలా రెండు జిల్లాల్లోని ప్రకృతి సంపదను వైసీపీ నేతలు కొల్లగొట్టేస్తుంటే, అధికారులు తమకేమీ తెలియదన్నట్టు చోద్యం చూస్తున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి/రెడ్డిగూడెం



వెదురుపావులూరులో అక్రమ తవ్వకాలు

దొరికింది దోచుకో..

ఎన్నికల వేళ అధికార పార్టీ నేతల అక్రమాలు

- రెండు జిల్లాల్లో భారీగా అక్రమ తవ్వకాలు
- వెదురుపావులూరు కొండను మింగేస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తి
- వైసీపీ నాయకుల సహకారంతో యథేచ్ఛగా..
- పోలవరం కాల్వ మట్టిని కొట్టేస్తున్న ప్రజాప్రతినిధి బంధువు
- జగ్గవరపు గట్టుపై గుట్టుగా మంత్రి అనుచరుల కన్ను
- పోలీసుల దాడి.. జేసీబీలు, టిప్పర్లు స్వాధీనం
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ అధికారులు



పోలవరం కాల్వ వద్ద పరిస్థితి ఇదీ..

పోలవరం కాల్వపై మళ్లీ పంజా

ఆగిపోయిందనుకున్న పోలవరం కాల్వ మట్టి తవ్వకాలు మళ్లీ మొదలయ్యాయి. అధికార పార్టీ నాయకుడి ముఖ్య అనుచరుడి బంధువు పేరిట ఒక వ్యక్తి గొల్లనపల్లి సమీపంలో భారీగా పోలవరం కాల్వ మట్టిని తవ్వేస్తున్నాడు. స్థానికులు ప్రశ్నించగా, తాను ప్రజాప్రతినిధి బంధువునంటూ గ్రామస్తులతో గొడవకు దిగుతున్నాడు. భయపడిన గ్రామస్థులు పక్కకు తప్పుకోగా, పోలవరం కాల్వ మట్టిని భారీగా తరలించుకుపోతున్నాడు. ఇలా గట్లను తరలించుకుపోవటం వల్ల భవిష్యత్తులో వరద ప్రవాహాన్ని అడ్డుకునే పరిస్థితి ఉండదని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. గ్రామాలపైకి నీరు పోటెత్తే అవకాశం ఉంటుందంటున్నారు. ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇచ్చిందని చెబుతూ అధికార పార్టీ నేత ముఖ్య అనుచరుడి బంధువు ఎడాపెడా తవ్వేస్తున్నాడు. ఇరిగేషన్ అధికారులేమో తామెలాంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. బల్లిపర్రులో కూడా ఇదే పోలవరం కాల్వ మట్టిని తవ్వుతున్నారు.

జగ్గవరపు గట్టుపై గుట్టుగా..

ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన ఓ మంత్రి అనుచరుల కన్ను ఇప్పుడు మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెంలోని జగ్గవరపు గట్టుపై పడింది. మూడు రోజులుగా జేసీబీలు, టిప్పర్లు పెట్టి గుట్టుచప్పుడు కాకుండా గ్రావెల్ అక్రమ రవాణాకు తెరలేపారు. ఎంతో ఆహ్లాదంగా ఉండే ఈ గట్టుపై ఒకపక్క కార్తీక వనసమారాధనలు, మరోపక్క గట్టుపై ఉన్న శిలువకు క్రైస్తవులు ప్రార్థనలు చేస్తూ ఉంటారు. ఇలాంటి గట్టును గుట్టుగా మాయం చేయాలనుకుంది గ్రావెల్ మాఫియా. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి జేసీబీలు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

వెదురుపావులూరులో ఎదురులేకుండా..

వెదురుపావులూరులోని కొండను ఇంతకుముందు కృష్ణాజిల్లాకు చెందిన ఓ మాజీమంత్రి బ్యాచ్ పిండేసింది. అదే కొండలో సర్వే నెంబర్ 860లో ఈసారి అధికార పార్టీ నాయకుల సహకారంతో ఓ ప్రైవేట్ వ్యక్తి తవ్వకం మొదలుపెట్టాడు. భారీ క్రేన్లను రప్పించి మరీ తవ్వేస్తున్నారు. రైల్వేలైన్ల పనుల పేరిట ఈ ప్రక్రియ యథేచ్ఛగా జరుగుతోంది. దీనివల్ల భారీ నష్టం జరుగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు సాగించటం ఒక ఎత్తయితే, మినరల్ ఫండ్‌ను కోల్పోవాల్సి వస్తోంది. పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల మీదుగా వందల సంఖ్యలో భారీ టిప్పర్లు తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దుమ్ము, ధూళి వెదజల్లుతూ తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. స్థానికులు లారీలను అడ్డగిస్తున్నా మైనింగ్ మాఫియా రెచ్చిపోతూనే ఉంది. స్థానికులు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే, తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని, మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని చెబుతున్నారు. ఇలా రెండు శాఖలు తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నాయి. ఈ వ్యవహారంలో అధికార యంత్రాంగానికి భారీగా అక్రమార్కులు ముడుపులు ముట్టజెప్పారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జగ్గవరపు గట్టు వద్ద..

ఉద్యమ గర్జన

పిడికిలి బిగించిన ప్రభుత్వ ఉద్యోగులు

- వాస్తవాలు ప్రజలకు చెప్పే దమ్ముందా..?
- మేం సిద్ధం.. మీరు సిద్ధమేనా అంటూ ప్రభుత్వానికి సవాల్
- పంచాయతీరాజ్ కార్యాలయంలో నిరసన
- జిల్లావ్యాప్తంగా మిన్నంటిన ఆందోళనలు

'ఉద్యోగులు గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నారన్న భావనను ప్రజల్లో కల్పించి లబ్ధి పొందేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. గొంతెమ్మ కోర్కెలు కోరుతున్నామో లేదో ప్రజలకు జవాబు చెప్పటానికి మేము సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం సిద్ధమేనా' అంటూ ఉద్యోగులు ఉద్యమ శంఖారావంలో రెండో రోజైన గురువారం గర్జించారు. బకాయిలను చెల్లించాలంటూ తాము దేహీ.. అంటుంటే.. ప్రభుత్వం కనికరించటం లేదన్నారు. ఇప్పుడు కూడా ఉద్యోగి అనేవాడు వివేకంగా లేకపోతే రాజకీయ నేతల చేతిలో మోసపోవాల్సి వస్తుందన్నారు. ఏపీజేఏసీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో పెద్ద ఎత్తున ఆందోళన జరిగింది. ఉద్యోగులు పెద్దపెట్టున నినదించారు. నందిగామలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది భోజన విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ కోరుతూ, సీపీఎస్ రద్దు-ఓపీఎస్ అమలు, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల అంశాలపై విస్సన్నపేట తాలూకా యూనిట్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీటీకి అందించారు. తిరువూరులో ఏపీఎన్జీవో సభ్యుల నేతృత్వంలో జీజీహెచ్ వద్ద ఆందోళన జరిగింది. నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని సిబ్బంది కూడా భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

రమణీయం.. రథోత్సవం





మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించిన అర్చకులు గురువారం రాత్రి పురవీధుల్లో కల్యాణమూర్తులను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు.

- 6లో..

'గాంధీ'బోర్డు సమావేశం

రసాభాస

- అక్రమాలపై సహకార శాఖ విచారణ అంతా డొల్లతనమే..
- చైర్మన్‌తో కుమ్మక్కై తప్పుడు నివేదిక
- విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం.. : గాంధీ బ్యాంకు డైరెక్టర్లు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గాంధీ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు బోర్డు సమావేశం గురువారం రసాభాసగా జరిగింది. ఏడుగురు అసమ్మతి డైరెక్టర్లను ఓవైపు, చైర్మన్, నలుగురు డైరెక్టర్లను మరోవైపు ఉంచి గురువారం నిర్వహించిన ఈ సమావేశం అర్ధంతరంగానే ముగిసింది. చైర్మన్ సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. బ్యాంకు అభివృద్ధితో పాటు రుణాల మంజూరు, ఇతర లావాదేవీలకు సంబంధించి బోర్డు అనుమతి కోసం ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని బ్రాంచీల నుంచి వచ్చిన రుణ దరఖాస్తులను పరిశీలించిన బోర్డు సభ్యులు అత్యధిక భాగాన్ని అంగీకరించారు. అయితే, చైర్మన్‌కు సన్నిహితుడైన ఓ వ్యక్తి తీసుకొచ్చిన రూ.50 లక్షల రుణ అర్జీని బోర్డు సభ్యులు వ్యతిరేకించారు. కాగా, కొత్తగా ఏర్పాటు చేయాలనుకున్న విశాఖ బ్రాంచి వ్యవహారంపై వాడివేడిగా చర్చ జరిగింది. ఈ సమయంలోనే చైర్మన్ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

సహకార శాఖ అధికారులపై ఫిర్యాదు చేస్తాం..

బ్యాంకు అక్రమాలపై సహకార శాఖ విచారణ నివేదిక తప్పులతడకగా ఉందని బోర్డు డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన యజమాని నుంచి ముందుగా షరతులతో కూడిన అంగీకారపత్రాన్ని బోర్డు ముందు ప్రవేశపెట్టి ఉంటే, విచారణ అధికారి ఎందుకు పరిశీలించలేదని అసమ్మతి డైరెక్టర్లు ప్రశ్నించారు. ఇద్దరు డైరెక్టర్లు స్థలాన్ని పరిశీలించామని చెబుతున్నా దాన్ని ఎందుకు బోర్డులో రికార్డు చేయలేదన్నారు. అగ్రిమెంట్ చేయకుండానే అడ్వాన్స్ చెల్లించారని ఆందోళనకు దిగిన డైరెక్టర్లు బ్రాంచి ఏర్పాటుకు ఆమోదం తెలిపినట్లు నివేదికలో పేర్కొనడం విచారణలోని డొల్లతనాన్ని తెలియజేస్తోందన్నారు. భవన యాజమాన్యం రూ.28 లక్షలకే ఫర్నీచర్, స్ట్రాంగ్‌రూమ్, లాకర్లు, కంప్యూటర్లను ఏర్పాటు చేసిందని, తమకు రూ.5 లక్షలు మిగిలాయని చైర్మన్ చెబుతున్నారని, అయితే, భవన యజమాని పేరుపై బిల్లులు ఎక్కడ ఉన్నాయని, వాటిని విచారణ అధికారి ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. కొత్త బ్రాంచి ఏర్పాటుకు ఐటీ కమిటీ ఆమోదం తీసుకున్నారని నివేదికలో రాశారని, అసలు ఐటీ కమిటీ అనేదే బ్యాంకులో లేదన్నారు. 'ట్రైనింగ్ ఆఫీసర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు అంటూ ఏమీ లేవని నివేదికలో పేర్కొన్నారు. మరి రిటైర్డ్ సహకార అధికారులను ఆ పోస్టులో ఎలా తీసుకున్నారు. ఈ విషయాలను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు.' అని డైరెక్టర్లు ప్రశ్నించారు. ఈ విషయాలన్నింటిపైనా తాము విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



టీటీడీ కల్యాణమండపంలో అన్నదానం

కొందరు భక్తులు దర్శనం పూర్తయిన తర్వాత భోజనానికి వెళ్తారు. మరికొందరు భోజనం చేసిన తర్వాత దర్శనానికి వెళ్తారు. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలో నిత్యం కనిపించే దృశ్యం ఇది. తిరుమల తరహాలోనే టీటీడీకి అనుబంధంగా ఉన్న అన్ని దేవాలయాల్లో ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే, నగరంలోని దూరదర్శన్ ఎదురుగా ఉన్న వేంకటేశ్వరుడి ఆలయం వద్ద మాత్రం కూపన్ ఉన్న వారికి మాత్రమే అన్నదాన ప్రసాదం పంపిణీ చేయాలన్న విధానాన్ని తీసుకొచ్చారు. కూపన్‌లేని భక్తులను నిర్దాక్షిణ్యంగా వడ్డన వద్ద నుంచి పక్కకు లాగేస్తున్నారు.

కూపన్ ఉంటేనే ఆహారం

టీటీడీలో కొత్త విధానం

- కొద్దినెలల క్రితం అన్నదానం ప్రారంభం
- తొలుత పరిమితి లేకుండా అన్నదానం
- రద్దీ పెరగడంతో కూపన్ పద్ధతి
- మండిపడుతున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి చెందిన వేంకటేశ్వరుడి ఆలయాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. విజయవాడలో టీటీడీ కల్యాణ మండపం ప్రాంగణంలోనే ఈ ఆలయం ఉండగా, రాజధాని ప్రాంతం వెంకటాయపాలెంలో మరో ఆలయాన్ని నిర్మించారు. తిరుమలలో నిత్యం ఏ విధంగా అన్నప్రసాద వితరణ జరుగుతుందో అదేవిధంగా ప్రతి శనివారం అనుబంధంగా ఉన్న అన్ని ఆలయాల వద్ద ప్రసాద వితరణ చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ జరిగే అన్నప్రసాద వితరణ దాతల సహకారంతో జరిపించాలని భావించారు. ఈ బాధ్యతలను స్థానికంగా ఉండే ఆలయ, కల్యాణ మండప మేనేజర్లకు అప్పగించారు.

కూపన్ లెక్క ఏమిటి?

టీటీడీ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ఇక్కడ ఉన్న అధికారులు, సిబ్బంది దాతలను ఆహ్వానించారు. అన్నప్రసాద వితరణకు సహకరించాలని కోరారు. దీని ప్రకారం కొద్దినెలల క్రితం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలోని వేంకటేశ్వరుడి ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ప్రతి శనివారం ఉదయం 11 గంటల నుంచి ఇక్కడ అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ప్రతి శనివారం 11 గంటల సమయంలో స్వామి వారికి హారతి ఇస్తారు. ఈ కార్యక్రమం పూర్తయిన తర్వాత భక్తులకు అన్నదానం చేస్తున్నారు. అన్నదానం ప్రారంభించిన మొదట్లో భక్తులు స్వల్ప సంఖ్యలో వచ్చారు. ఇక్కడ ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నట్టు బోర్డు ఏర్పాటు చేశాక భక్తుల సంఖ్య పెరిగింది. వంటకాలు ఉన్నంత వరకు వచ్చిన వారందరికీ ప్రసాదాన్ని వడ్డిస్తున్నారు. దీనికి ఎలాంటి పరిమితి ఉండేది కాదు. ఇప్పుడు భక్తుల సంఖ్య పెరిగిపోవడంతో కూపన్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

కూపన్ లేకపోతే లాగేయడమే..

హారతులు పూర్తయిన తర్వాత దర్శనానికి వెళ్లే భక్తులకు అన్నదాన కూపన్ ఇస్తున్నారు. ఈ కూపన్ తీసుకుని క్యూలో ఉన్నవారికి మాత్రమే భోజనాలు వడ్డిస్తున్నారు. చివరికి టీటీడీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూపన్ తప్పనిసరి చేశారు. కూపన్ లేకుండా క్యూలో ఉన్న వారిని వడ్డన వద్దకు వెళ్లేసరికి నిర్దాక్షిణ్యంగా పక్కకు లాగేస్తున్నారు. దీనిపై భక్తులు మండిపడుతున్నారు. భక్తులకు పంపిణీ చేసే అన్నప్రసాదంలో పరిమితులు విధించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై టీటీడీ అధికారులను వివరణ కోరగా, ఈ అన్నదానాన్ని దాతలు చేస్తున్నారని, వారే ఈ విధానాన్ని ప్రవేశపెట్టారని చెబుతున్నారు.

భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

- జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను వ్యక్తిగత ఫొటోగ్రాఫర్ అరెస్టు
- 613 బాటిళ్లు, ఆటో స్వాధీనం
- పోలీసులు గుట్టుగా సమాచారం

- 6లో..

పటమట సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

- గుణదల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో గతంలో ఏసీబీ తనిఖీలు
- ప్రైవేట్ వ్యక్తుల దగ్గర డబ్బు గుర్తింపు
- బాధ్యుడ్ని చేస్తూ చైతన్యపై వేటు
- అప్పట్లో జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్‌గా విధినిర్వహణ

- 6లో..

నీటి సత్యాగ్రహం విజయవంతం

- కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాల కోసం..
- టీడీపీ-గిరిజనుల ఆధ్వర్యంలో పాదయాత్ర
- దిగొచ్చిన ప్రభుత్వం.. నీటి సరఫరాకు ఏర్పాట్లు

- 6లో..

వైభవంగా సుబ్బారాయుడి రథోత్సవం



మోపిదేవిలో రథంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

మోపిదేవి, ఫిబ్రవరి 15: సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి రథో త్సవం వైభవంగా జరిగింది. విద్యుత్ దీపాలు, పూల దండలతో విశేష అలంకరించిన రథంపై కల్యాణ మూర్తులైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీ నులను గావించారు. అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, డీఎస్పీ మురళీధర్, ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధర రావులు కొబ్బరి కాయలు కొట్టి రథాన్ని లాగి రథోత్సవాన్ని ప్రారం భించారు. పలురకాల నృత్య ప్రదర్శ నలు, విచిత్ర వేషధారణలు రథం ముందు ప్రదర్శనగా ఏర్పాటు చేశారు.



అవార్డులు అందుకున్న వలంటీర్లతో కలెక్టర్ ఢిల్లీరావు

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 15: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని ఎన్టీఆర్ జిల్లా కలె క్టర్ ఢిల్లీరావు అన్నారు. గురువారం గుంటూరుజిల్లా ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించాక కలెక్టరేట్ సమావేశమందిరంలో ఎన్టీఆర్ జిల్లాలో 10,150 మందికి పురస్కారాలు అందజేశారు. 982 మందికి సేవా మిత్ర, 133 మందికి సేవా రత్న, 35 మందికి సేవా వజ్ర పురస్కారాలకు ఎంపిక య్యారు. సేవా వజ్ర పురస్కార గ్రహీతకు రూ.45 వేలు, సేవా రత్న పురస్కార గ్రహీతకు రూ.30వేలు, సేవా మిత్ర పురస్కార గ్రహీతకు రూ.15వేల నగదు బహు మతిని అందిస్తామని తెలిపారు. గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, గ్రామ, వార్డు సచివాల యాల అధికారి కె.అనురాధ పాల్గొన్నారు.

పటమట సబ్ రిజిస్ట్రార్‌పై వేటు!

» గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీల కేసులో చైతన్యను బాధ్యుడిని చేస్తూ సస్పెన్షన్

» అప్పట్లో జాయింట్ - 2 సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న చైతన్య

» ఏసీబీ తనిఖీల్లో కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల దగ్గర డబ్బు గుర్తింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పటమట సబ్ రిజిస్ట్రార్ చైతన్యపై రిజిస్ట్రేషన్స్ శాఖ వేటు వేసింది. ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీకి వచ్చిన ఆదేశాల మేరకు చైతన్యపై సస్పెన్షన్ విధిస్తూ శుక్రవారం విజయవాడ డీఐజీ రవీంద్రనాథ్ ఉత్తర్వులిచ్చారు. మూడేళ్ల కిందట రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ ఆకస్మిక తనిఖీలు చేసింది. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీల సమయంలో కొంతమంది ఏజెంట్ల దగ్గర డబ్బులు ఉండటాన్ని గుర్తించి ఏసీబీ నగదును స్వాధీనం చేసుకుంది. ఆ సమయంలో విధి నిర్వహణలో జాయింట్-2 రిజి స్ట్రార్ చైతన్య ఉన్నారు. చైతన్య దగ్గర డబ్బులు కానీ, డాక్యుమెంట్స్ కానీ ఏసీబీ అధి కారులు గుర్తించలేదు. ఏజెంట్ల దగ్గర డబ్బులున్న విషయాన్ని ఏసీబీ ప్రభుత్వానికి రిపోర్టు చేసింది. తర్వాత చైతన్యను ఐజీ ఆఫీసుకు బదిలీ చేశారు. మూడేళ్లపాటు నాన్ ఫోకల్ పోస్టులో ఉన్న చైతన్య గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఫోకల్ స్థానంలో చేరారు. గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో పనిచేసిన కాలంలో దొంగ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న రాకెట్‌ను పట్టుకున్నారు. గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అది అప్పట్లో సంచలనంగా మారింది. పటమట సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాఘవరావుపై ఏసీబీ దాడుల నేపథ్యంలో, ఖాళీగా ఉన్న స్థానాన్ని ఐజీ కార్యాలయం చైతన్యతో భర్తీ చేసింది. అనూహ్యంగా అప్పటి కేసుకు సంబంధించి చైతన్యను బాధ్యుడిని చేస్తూ చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభు త్వం నుంచి ఐజీ కార్యాలయానికి ఆదేశాలు వచ్చాయి. ఐజీ ఆదేశాలతో చైతన్యపై సస్పెన్షన్ విధిస్తూ వి జయవాడ డీఐజీ ఆదేశాలు ఇచ్చారు. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ ఆకస్మిక తనిఖీల్లో భాగంగా నమోదు చేసిన కేసులకు సంబంధించి ఏ సబ్ రిజిస్ట్రార్లనూ బాధ్యులను చేయకుండా పటమట సబ్ రిజిస్ట్రార్‌ను మాత్రమే బాధ్యుడిని చేసి సస్పెన్షన్ వి ధించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సీనియర్ అసి స్టెంట్‌గా కొనసాగుతున్న నవాబుకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది.



ఉంగుటూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

ఈడ్పుగంటి ఇంటిపై దాడికి యత్నించిన

నిందితులను అరెస్టు చేయాలి

» పోలీస్ స్టేషన్ ఎదుట టీడీపీ నేతల ఆందోళన

ఉంగుటూరు, ఫిబ్రవరి 15: టీడీపీ ఉంగుటూరు గ్రామ సీనియర్ నాయకుడు ఈడ్పుగంటి కృష్ణమూర్తి ఇంటిపై అర్ధరాత్రి దాడికి ప్రయత్నించిన గుర్తుతెలియని దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయ కులు గురువారం ఉంగుటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ ఆగడాలు నశించాలని, కృష్ణమూర్తి ఇంటిపై దాడికి యత్నిం చిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేయాలని, గన్నవరంలో పిల్లసైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలు చేశారు. ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు నీచ రాజకీ యాలు చేస్తున్నారని, టీడీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసి, బెదిరించి, తద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు కుతంత్రాలు పన్నుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా ఆరోపించారు. బాధితులకు అండగా నిలిచి, రక్షణ కల్పిం చవలసిన పోలీసులే అధికార పార్టీనేతలకు దాసోహమయ్యారని ఆరోపించారు. ఆందోళనలో పార్టీ నాయకులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, అళ్ల హనోక్, మూల్పూరి సాయికల్యాణి, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, దండు సుబ్రహ్మణ్యరాజు, మేడేపల్లి రమాదేవి, కాసన్నేని రాజా, మండవ రమ్యకృష్ణ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడి బలి

» అప్పులపాలై ఆత్మహత్య..తనలా జూదానికి బానిస కావొద్దని సూసైడ్‌నోట్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 15: ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బు పోగొట్టుకున్న ఒక యువ కుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం ఆర్.శి వరామపురానికి చెందిన చందక కోటేశ్వరరావు (22) ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసయ్యాడు. రూ.లక్షలు అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్స్‌లో పోగొట్టాడు. తల్లిదండ్రులు ఉన్న కొద్దిపాటి స్థలాన్ని అమ్మి అప్పు తీర్చారు. ఆ తరువాత కూడా కోటేశ్వరరావు 'ఆన్‌లైన్' ఉచ్చులో నుంచి బయటపడలేదు. మళ్లీ అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు బంధువుల అమ్మాయి బలవర్మణం కేసులో కోటేశ్వరరావుపై ఆరోపణలు వచ్చాయి. ఒకపక్క అప్పులు, మరోపక్క కేసుతో ఒత్తిడికి గురైన కోటేశ్వరరావు బుధవారం రాత్రి పొలాల్లో గల పశువుల పాకలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, ఆన్‌లైన్ గేమ్ లకు బానిస కావడంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని, తనను క్షమించాలని తల్లిదం డ్రులను కోరుతూ కోటేశ్వరరావు సూసైడ్ నోట్ రాశాడు. తనలా ఎవరూ ఆన్‌లైన్ గేమ్ లకు బానిస కావద్దని, ఎన్నో ఆశలతో పెంచిన తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టవద్దని, వారికి భారం కావద్దని పేర్కొన్నాడు.







నల్లబ్యాడ్జీలతో కానూరు హైస్కూల్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, విజయవాడ జీజీహెచ్, మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో వైద్య సిబ్బంది

ఉద్యోగుల బకాయిలపై

బహిరంగ నివేదిక ఇవ్వాలి

» ఉద్యోగ సంఘాల లెక్కప్రకారం బకాయిలు రూ.25,500 కోట్లు

» ప్రభుత్వ లెక్కప్రకారం రూ.20,500 కోట్లు

» ఈ భారీ వ్యత్యాసంపై ఆందోళనలో ఉద్యోగులు

» బహిరంగ నివేదిక ఇస్తే అపోహలు తొలగుతాయి

» ఏపీజేఏసీ జిల్లా ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ డిమాండ్



తిరువూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉద్యోగులు, ప్రభుత్వానికి మధ్య అపో హలు తలెత్తకుండా ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావాల్సిన బకాయిల మొత్తాన్ని బహిరంగ నివేదిక ద్వారా వెల్లడించాలని ఏపీజేఏసీ జిల్లా ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఏపీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యమ శంఖారావం రెండో రోజున గురువారం నగరంలోని పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల లెక్క ప్రకారం ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు రూ.25,500 కోట్లు అని, ఇటీవల మంత్రి వర్గ ఉపసంఘం సమావేశంలో కూడా దీనిని తెలియజేశారని తెలిపారు. అయితే ప్రభుత్వం మాత్రం రూ.20,500 కోట్ల బకాయి ఉన్నామని పేర్కొం దని తెలిపారు. దీంతో ఉద్యోగుల్లో కొత్త ఆందోళన మొదలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగులు కొత్తగా ఏమీ కోరటం లేదని, తమ జీతాల నుంచి వివిధ రూపాల్లో మినహాయించిన, ఉద్యోగులు దాచుకున్న డబ్బు లను మాత్రమే చెల్లించాలని కోరుతున్నారని తెలిపారు. ఉద్యోగుల సమ స్యల పరిష్కారంపై ప్రభుత్వం తెగేదాక లాగకుండా నిర్ణీత సమయంలో పరిష్కరించగలిగితే గౌరవప్రదంగా ఉంటుందన్నారు. ఈనెల 27 వరకు వి విధ రూపాల్లో తమ ఆందోళన నిర్వహిస్తామన్నారు. పన్నెండో పీఆర్సీ కమి షనర్‌ను నియమించినా ఎలాంటి పురోగతి లేదన్నారు. కమిషనర్ పని చేయడానికి కార్యాలయం, సిబ్బందిని ఇవ్వలేదన్నారు. జిల్లాలు పర్యటించ డంతో పాటు, ఉద్యోగ సంఘాల నుంచి అభిప్రాయాలను తెలుసుకోవటం చేయాలని, వీటన్నింటినీ సేకరించాక అధ్యయనం చేయటానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. అధ్యయనం పూర్తయ్యి నివేదిక ఇవ్వటా నికి చాలా సమయం పడుతుందని తెలిపారు. జూలై 1, 2023 నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. నేటి వరకు పూర్తిస్థాయిలో పీఆర్సీ కమిషనర్ తన కార్యాచరణను ప్రకటించలేదన్నారు. తమ శాఖలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశంలో జాప్యం చేయకుండా సత్వరమే న్యాయం చేయాలని ఐటీఐ, డీఎల్‌టీ ఉద్యో గుల సంఘం ప్రతినిధి కృష్ణకిషోర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎండీ ఇక్బాల్, రాష్ట్ర జేఏసీ కార్యనిర్వాహక కార్యదర్శి కె.జగదీష్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఒ.సాయిరాం, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం నాయకులు మంగేశ్వరరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.రాజబాబు, పంచాయతీ రాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం ప్రతినిధి కె.రవీంద్రబాబుతో పాటు జేఏసీలో ఉన్న వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు ఆందోళనలో పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నిరసన

మచిలీపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏపీ జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు గురు వారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్ వద్ద, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వద్ద ఉద్యోగులు భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఏపీ జేఏసీ తూర్పు కృష్ణాసంఘం అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, వివిధ విభాగాల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చల్లపల్లి, అవనిగడ్డ, ఘంటసాల, మోపిదేవి మండలాల్లో ఉద్యోగులు తమ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజర య్యారు. పెనమలూరు మండలం కానూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రెడ్డమ్మ ఆధ్వ ర్యంలో టీచర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు.

డొక్కు బస్సులతో నరకం చూస్తున్నారు

● ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు రామకృష్ణ

తమ శాఖలో మూడు వేల బస్సుల కొరత ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికీ కాలం చెల్లిన బస్సులే నడుపుతోందని ఆర్టీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. డొక్కు బస్సులు, కాలం తీరిన బస్సుల కారణంగా ఆర్టీసీ ఉద్యోగులు నరకం చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించలేదన్నారు.

ఆస్పత్రులకు వాటా చెల్లించని ప్రభుత్వం

● పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధి జి.నారాయణరావు

పదవీ విరమణ చెందిన ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించడం లేదని, పదవీ విరమణ తర్వాత సాధరణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు వైద్య సదుపాయం లభించటం లేదని పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధి జి.నారా యణరావు తెలిపారు. ప్రభుత్వం ఆస్పత్రులకు చెల్లించాల్సిన తన వాటా చెల్లించకపోగా ఉద్యోగుల నుంచి మినహాయించుకున్న సొమ్మును ప్రభు త్వం తన దగ్గరే ఉంచుకోవడటం బాధాకరమని ఆయన అన్నారు.

తీసుకోని డీఏలకు ఆదాయ పన్ను కడుతున్నాం..ఇదెక్కడి చోద్యం: ఏపీ జేఏసీ తూర్పు కృష్ణా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ

మచిలీపట్నం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపా ధ్యాయ, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, మధ్యంతర భృతిని విడుదల చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వి డుదల చేయాలని, 2018నుంచి 2022 వరకు చెల్లించాల్సిన డీఏ బకా యిలను పూర్తిస్థాయిలో చెల్లించాలని ఉల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఉద్యో గులు తీసుకోని డీఏలకు ఆదాయపు పన్నును చెల్లించాల్సి వస్తోందని ఇదెక్కడి చోద్యమని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగులకు 12వ పీఆర్సీని ఇంతవరకు చెల్లించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారంలోపే సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పినా, ఇంతవరకు చేయలేద న్నారు. పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా జీపీఎస్‌ను అమలు లోకి తెచ్చి ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు. సీని యర్ పెన్షనర్లకు అదనపు పింఛనులోనూ ప్రభుత్వం కోత పెట్టిందన్నారు.

నీటి సత్యాగ్రహ పాదయాత్ర

విజయవంతం





కొలికపూడి శ్రీనివాస్ నేతృత్వంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు, నేతలు, ఇన్‌సెట్‌లో వృద్ధురాలు

» కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాల కోసం టీడీపీ-గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర

» దిగివచ్చిన ప్రభుత్వం.. నీటి సరఫరాకు ఏర్పాట్లు

» టీడీపీ అధికారంలోకి వస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం: కొలికపూడి శ్రీనివాస్

ఎ.కొండూరు, ఫిబ్రవరి 15: మండలంలోని కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలు సరఫరా చేయాలని టీడీపీ-గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిం చిన నీటి సత్యాగ్రహ పాదయాత్ర విజయవంతమైంది. గురువారం ఉదయం టీడీపీ నేత, అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు, గిరి జన సంఘం నేతలు భీమానాయక్, పీక్లానాయక్ ఆధ్వర్యంలో ఎ.కొండూరు అడ్డరోడ్డు నుంచి గిరిజన మహిళలు, టీడీపీ నేతలు ఖాళీ బిందెలతో పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ఐదు కిలోమీటర్లు మేర సాగింది.

నీరు సక్రమంగా సరఫరా చేయకపోతే కలెక్టరేట్, సీఎం కార్యాలయాలు ముట్టడిస్తాం : కొలికపూడి

మూడు రోజుల క్రితం కృష్ణా జలాలు సరఫరా నిలిచిపోవడంతో సమస్య తెలుసుకున్న కొలికపూడి గిరిజన తండాలో పర్యటించారు. ప్రభుత్వం ఈ 14 లోపు కృష్ణా జలాలు సరఫరా చేయకపోతే 15న కిడ్నీ వ్యాధిగ్రస్తులు, గిరిజనుల కోసం నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని ఆయన ప్రకటిం చారు. ప్రకటించినట్టే గురువారం యాత్రను ప్రారంభించారు. దీప్లానగర్ తండాకు పాదయాత్ర రాగానే రెండు ట్యాంకర్లు తెచ్చి, నీటి సరఫరా చేస్తున్నట్లు నేతలకు అధికారులు, పోలీసులు తెలిపారు. దీంతో కొలికపూడి యాత్రను నిలిపివేశారు. కిడ్నీ ప్రభావిత గ్రామాలకు నీటిని సక్రమంగా సరఫరా చేయకపోయినా, ఒక్క రోజు నీరు రాకపోయినా కలెక్టరేట్, సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాంతంలో తీవ్రమైన కిడ్నీ వ్యాధులతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కొలికపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతి ఇంటికీ తాగునీరు, రూ.49 కోట్లతో కృష్ణా జలాలు అందజేస్తామన్న హామీ తాడేపల్లి గడప దాటలేదన్నారు. టీడీపీ అధికా రంలోకి వస్తే మండలంలోని కిడ్నీ, తాగు, సాగునీటి సమస్యలకు శ్వాశత పరిష్కా రం దొరుకుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, అలవాల రమేష్‌రెడ్డి, అబ్బు, గిరిజన నేతలు భీమానాయక్, పీక్లా నాయక్, గోపిరాజు, దేవి డ్‌రాజ్, మునియ్య శంకర్, ప్రసాదరెడ్డి, చంద్రం, కిషోర్ పాల్గొన్నారు.

పేటలో భారీగా తెలంగాణ మద్యం స్వాధీనం

» ఇద్దరు అరెస్టు..రూ.62 వేల విలువైన 613 మద్యం బాటిళ్లు, ఆటో స్వాధీనం

» నిందితుల్లో ఒకరు విప్ సామినేని ఉదయభాను పూర్వ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్, వైసీపీ కార్యకర్త

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 15: పట్టణంలో పట్టపగలు ఆటోలో అనధికారికంగా తెలంగాణ మద్యం తరలిస్తూ ఇద్దరు జగ్గయ్యపేట పోలీసులకు చిక్కారు. నిందితుల్లో ఒకరు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాజీ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్, వైసీపీ కార్యకర్త కాగా.. మరొకరు తెలంగాణకు చెందిన వ్యక్తి. బుధవారం బలుసుపాడు రోడ్డు జంక్షన్‌లో తనిఖీలు చేస్తుండగా ఓ ఆటోలో రూ.62 వేల విలువైన 613 బాటిళ్ల మద్యం దొరికిందని ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రెడ్లకుంటకు చెందిన పోలంపల్లి రామకృష్ణ, జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామానికి చెందిన అమ్మనబోయిన గోపా లకృష్ణ అలియాస్ గోపి మద్యం రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. గోపీ గతంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయ భానుకు వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. గత ఏడాది గరికపాడు చెక్‌పోస్టు వద్ద తెలంగాణ మద్యంతో పట్టుబడ్డాడు. ఉదయభానుపై విమర్శలు రావటంతో గోపీని ఆయన దూరంగా ఉంచాడు. ఫొటోగ్రాఫర్‌గా పని చేయకున్నా బలుసుపాడులో వైసీపీ కార్యకలాపాల్లో చురుకుగా ఉంటున్నాడు. బుధవారం ఉదయమే మద్యం పట్టుకున్నా దీనిని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

మతం ముసుగులో మోసం

» రూ.ఆరు లక్షలకు శఠగోపం

» వైరా మండలం తాటిపూడిలో ఘటన

వైరా, ఫిబ్రవరి 15: ముందు మతం పేరిట ఆకర్షిం చారు..ఆతర్వాత తమను నమ్మిన పేదలు, అమాయ కులకు ఆర్థిక లబ్ధి చేకూర్చుతామని నమ్మించారు. దాన్ని అవకాశంగా భావించి తమను నమ్మిన వారిని నట్టేట ముంచారు. రూ.ఆరులక్షల వరకు శఠగోపం పెట్టిన మాయగాళ్ల ఉదంతమిది. వైరా మండలంలో తాటిపూడి గ్రామంలో ఈ మోసం జరిగింది. ఈ మోసానికి సంబం ధించి ఆ గ్రామ తాజా, మాజీ సర్పంచ్ బట్టా పెద్దభ ద్రయ్య ఆధ్వర్యంలో పలువురు బాధితులు వైరా పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపల గూడెం మండలంలోని ఊటుకూరుకు చెందిన ఒక పురుషుడు, ఇద్దరు మహిళలు రెండునెలల కిందట తాటిపూడికి వచ్చారు. ఒక రైతు ఇంటివద్ద స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. పేదలు, అమాయకులను సమీకరించు కుని వారిని ప్రలోభాలకు గురిచేశారు. తమ దగ్గరకు వచ్చిన వారికి మొదట కొద్దిమొత్తంలో నగదు ఇతరత్రా బహుమానాలు ఇచ్చారు. విందు, వినోదాలు ఏర్పాటు చేశారు. ఇక ఆతర్వాత ఆముగ్గురు తమ మోసానికి తెర దీశారు. ప్రార్థన చేసిన వారిని పేదలు, అమాయకులు నమ్మి, వారి ప్రలోభాలకు లోనయ్యారు. వారి చేతిలో నష్టపోయిన వారు 200మందికిపైగానే ఉన్నారు. బాధితు లంతా వితంతువులు, దివ్యాంగులు. ఈముగ్గురు మోసకా రులు వితంతువులు, దివ్యాంగులపైనే దృష్టి సారించారు. రూ.500, రూ.3వేలు, రూ.5వేలు, రూ.10వేలు, రూ.30వేల చొప్పున వసూలు చేశారు. రూ.500 చెల్లించిన వారికి రూ.వెయ్యి, రూ.3వేలు చెల్లించిన వారికి రూ.4నుంచి 5వేలు, రూ.10వేలు చెల్లించిన వారికి రూ.50వేలు, రూ.30వేలు చెల్లించిన వారికి రూ.రెండులక్షల చొప్పున పింఛన్ ఇస్తామని, వాహనాలు సమకూర్చుతామని నమ్మించారు. దాంతో అత్యాశకుపోయిన పేదల్లో ఎక్కువ మంది రూ.500చొప్పున, మరికొంతమంది రూ.3వేల చొప్పున, కొద్దిమంది రూ.10వేలు, రూ.30వేల చొప్పున రూ.ఆరులక్షల వరకు వారికి సమర్పించుకున్నారు. వాటిని తీసుకున్న తర్వాత ఒక్కొక్కరుగా తట్టాబుట్టా సర్దుకొని తాటిపూడి నుంచి పలాయనం చిత్తగించారు.

బూడిద కాలుష్యంపై ఉద్యమిద్దాం

గేట్ల ముందు వంటా వార్పు చేద్దాం ● ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సమావేశంలో వక్తలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15: ఎన్టీటీపీఎస్, ఏపీ జెన్‌కో అధికారుల నిర్ల క్ష్యంగా కారణంగా వెలువడుతున్న కాలుష్యం ప్రజారోగ్యంపై దాడి లాంటిదని కాలుష్యాన్ని నియంత్రించే వరకు ఉద్యమిద్దామని పలువురు వక్తలు పిలుపు నిచ్చారు. కాలుష్య నియంత్రణ పోరాటసమితి ఆధ్వర్యంలో గురువారం ఎన్టీటీ పీఎస్ రోడ్డులో విద్యార్థులతో భారీ మానవహారం, ప్రదర్శన నిర్వహించారు. అనం తరం ముత్తవరపు కల్యాణ మండపంలో ఎన్టీటీపీఎస్ కాలుష్య నియంత్రణ పోరాట సమితి సమావేశం నిర్వహించారు. భారీ సంఖ్యలో మేధావులు, యువత, ప్రజలు, న్యాయవాదులు, వైద్యులు, రైతులు సమావేశానికి తరలివచ్చారు. సమా వేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. కాలం చెల్లిన వీటీపీఎస్ పాత చిమ్నీల నుంచి భారీగా బూడిద వెలువడుతోందని, యాష్ పాండ్ నుంచి బూడిద రవాణా చేయడంలోనూ నియమ నిబంధనలు పాటించకపోవడంతో బూడిద రోడ్లపై కారుతోందని వారు పేర్కొన్నారు. కోల్ వినియోగం అనంతరం వచ్చే బూడిదలో పాదరసం, సీసం, సల్ఫర్, యురేనియం వంటి ప్రమాదకర కేన్సర్ కారక కాలుష్య పదార్థాలు వెలువడుతున్నాయన్నారు. వీటీపీఎస్ ఏర్పడిన 30 ఏళ్లలో కేవలం మూడంటే మూడు మెడికల్ క్యాంప్‌లకు యాజమాన్యం ఖర్చు చేసింది కేవలం రూ.3.30 లక్షలన్నారు. 1973 ఒకసారి, 2009లో మరోసారి మాత్రమే పబ్లిక్ హియరింగ్ నిర్వహించారన్నారు. తర్వాత ప్రజలను పట్టించు కున్న పాపాన పోలేదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు 200 మంది వస్తే రెండు మూడు రెట్లు పోలీసులు ఉంటున్నారని పోలీసులతో ఉద్యమాలను అణచి వేయలేరని హెచ్చరించారు.

రూ.18 కోట్ల సీఎస్ఆర్ నిధులు విడుదల చేయాలి

కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలంతో పాటు కాలుష్య ప్రభా విత ప్రాంతాలైన 10 గ్రామాలకు రూ.18 కోట్ల సీఎస్ఆర్ ఫండ్స్ తక్షణం విడుదల చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఎన్టీటీపీఎస్ చుట్టుపక్కల ప్రాంతాల వారు పవర్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని 2008లో జీవో వచ్చినా పవర్ బిల్లులు కట్టించు కుంటున్నారన్నారు. మొక్కలు నాటి గ్రీనరీ ఏర్పాటు చేయడంలో యాజ మాన్యం పూర్తిగా వైఫల్యం చెందిదన్నారు. కాలుష్యం నియంత్రించేంత వరకు పోరాటం ఆపబోమన్నారు. అవసరమైతే రెండు గేట్ల ఎదుటే వంటావార్పు ఏర్పాటు చేసుకుని ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

ప్రజల ఉసురు పోసుకుంటున్నారు



15 ఏళ్లుగా ఎన్టీటీపీఎస్ కాలుష్యంపై పోరాటం చేస్తున్నా. కాలుష్యం కాటుకు మత్స్యకారుల జీవనోపాధి కోల్పో వాల్సి వచ్చింది. వారి పొట్ట కొట్టారు. ప్రజల ఉసురు పోసుకుం టున్నారు. కాలుష్యం నివారణకు గ్రీనరీ ఏర్పాటు చేయాలి. గ్రీనరీ ఏర్పాటు చేసేందుకు ఎన్టీటీపీ ఎస్ చుట్టూ ఉన్న 200 ఎకరాల భూమి స్వచ్ఛం దంగా ఇచ్చేందుకు రైతులు ముందుకు వస్తారు. సరైన ధర ఇస్తే రైతుల్ని నేను ఒప్పిస్తా. భావి తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు కాలుష్యంపై పోరాటం చేద్దాం.

-జాస్తి గోపాలకృష్ణ, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, గుంటుపల్లి

నాయకులే కాంట్రాక్టర్లు.. అందుకే ప్రజలకు ఈ దుస్థితి



నాయకులే కాంట్రా క్టర్లు, కాంట్రా క్టర్లే నాయకులు. అందుకే ఈప్రాంత ప్రజలకు ఈ దుస్థితి. కాలుష్యంపై పోరాటం చేసేందుకు వి జయవాడలో ధర్నా చౌక్ ఉన్నట్లే ఇబ్రహీం పట్నంలోనూ ఒక ధర్నా చౌక్ ఉండాలి. ఏ, బీ, సీ కాలనీల్లో వారి నివాస ప్రాంతాల్లో మొక్కలు నాటుకుని చుట్టు పక్కల ప్రాంతాల్లో మొక్కలు నాటినట్లు యాజమాన్యం చూపించుకుంటోంది. ప్రజల ప్రాణాలతో చెల గాటమాడుతోంది. నాణ్య మైన బొగ్గు సరఫరా చేయాలి. యాష్‌పాండ్‌లో స్ప్రింక్లర్లు పెట్టాలి.

-సురేష్‌బాబు, ఇబ్రహీంపట్నం

ఎన్టీటీపీఎస్‌ను ముట్టడిస్తాం



2018 నుంచి కాలుష్యంపై పోరాడు తున్నా. ముగ్గురు సీఈలకు కాలుష్యం నివారించాలని వినతి పత్రాలు ఇచ్చాం. ఫలితం లేదు. తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలి అన్నీ బూడిద మయం. ఢిల్లీకి రెండింతలు కాలుష్యం ఎన్టీటీపీఎస్ పరిసరాల్లో ఆవరించి ఉంది. రూ.కోటితో రోడ్లు క్లీనింగ్ మిషన్ ఇస్తామని యాజమాన్యం ఇచ్చిన హామీ నెరవే రలేదు. ఎన్టీటీపీఎస్‌ను ముట్టడి చేస్తాం. కాలనీల్లో చెట్ల మధ్య ఉండటం కాదు. పెళ్లాం, పిల్లలతో అధికారులు బయటకు వచ్చి చూస్తే కాలుష్యం ఎంత ఉందో తెలుస్తుంది.

- పోలిశెట్టి తేజ, జనసేన నాయకుడు, ఇబ్రహీంపట్నం



పోరాట ఘట్టాలు ప్రత్యేకాకర్షణగా

ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఏప్రిల్ 5న విడుదల కానుంది. 'దేవర'గా ఎన్టీఆర్ యాక్షన్ ఓ రేంజ్‌లో ఉండబోతోందని సమాచారం. కొరటాల శివ సరికొత్త తరహాలో యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారట. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ కేన్నీ బేట్స్ నేతృత్వంలో తెరకెక్కిన పోరాట ఘట్టాలు సినిమాకు ప్రత్యేకాకర్షణగా నిలువనున్నాయి. సముద్రంలో నీటి అడుగున తెరకెక్కిన ఫైట్స్ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా ఉండబోతున్నాయని తెలుస్తోంది. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. యువ సుధ ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బేనర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

అందాల రాశికి అందలం



అందం, అభినయం కలగలిసిన ముద్దుగుమ్మగా ప్రేక్షకలోకాన్ని ఆకట్టుకున్నారు టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో రష్మిక చోటు దక్కించుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉన్న 30 మంది ప్రతిభావంతుల జాబితాలో రష్మిక అగ్రస్థానం దక్కించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా రష్మిక ఈ విషయాన్ని అభిమానులతో పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆమె ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'రెయిన్ బో' 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి.

బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు బన్నీ



'పుష్ప' చిత్రంతో ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకొని సత్తా చాటారు అల్లు అర్జున్. ఇప్పుడు ఆయన మరో అరుదైన గౌరవాన్ని పొందారు. ప్రతిష్ఠాత్మక బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమా తరఫున ప్రాతినిథ్యం వహించే అవకాశం అల్లు అర్జున్‌కు దక్కింది. 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో గురువారం బన్నీ జర్మనీ వెళ్లారు. 'పుష్ప' సినిమాను ఈ చిత్రోత్సవాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది.

జీ2లో ఓజీ విలన్



బాలీవుడ్‌లో రొమాంటిక్ హీరోగా తనదైన ముద్ర వేసిన ఇమ్రాన్ హష్మీ కొన్నాళ్లుగా రూట్ మార్చి స్టైలిష్ విలన్ పాత్రలతో మెప్పిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఓజీ' చిత్రంలో ఇమ్రాన్ హష్మీ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా మరో టాలీవుడ్ చిత్రంలో ఆయన విలన్‌గా కనిపించనున్నారు. అడివిశేష్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'గూఢచారి 2' (జీ2)లో ఆయన విలన్‌గా నటించనున్నారు. ఈ విషయాన్ని గురువారం అడివిశేష్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. 'గూఢచారి ప్రపంచంలోకి గొప్ప నటుడికి స్వాగతం' అంటూ ఇమ్రాన్ హష్మీ ఫొటోను అడివిశేష్ షేర్ చేయగా వైరల్ అయింది. 'గూఢచారి 2'లో భాగమవుతున్నందుకు ఆనందంగా ఉందని ఇమ్రాన్ పేర్కొన్నారు.

రాజధాని ఫైల్స్‌కు తాత్కాలిక బ్రేక్

- రికార్డులు పరిశీలించాలి.. వాటిని మా ముందు ఉంచండి
- సీబీఎఫ్‌సీ, రివైజింగ్ కమిటీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా



రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు హైకోర్టు గురువారం ప్రకటించింది. నిబంధనల ప్రకారం తగిన కారణాలు పేర్కొని సినిమా విడుదలకు రివైజ్ కమిటీ సర్టిఫికెట్ ఇచ్చిందా.. లేదా అనేది పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. సినిమాకు సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీల వద్ద ఉన్న రికార్డులను ఈ నెల 16లోగా కోర్టు పరిశీలనకు ఉంచాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ), రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను ఆదేశించింది. సినిమా విడుదలైతే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్న పిటిషనర్ వాదనను పరిగణలోకి తీసుకొని సినిమా ప్రదర్శనపై శుక్రవారం వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. రికార్డులు కోర్టు ముందు ఉంచేందుకు వీలుగా విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా రాజధాని ఫైల్స్ సినిమాను తీశారని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధృవపత్రాన్ని రద్దు చేయాలని కోరతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీకి నిర్ణయాన్ని వాయిదా వేసింది. గురువారం సినిమా ప్రదర్శనను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

థియేటర్లలో ప్రదర్శన నిలుపుదల

రాజధాని అమరావతి రైతుల ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన 'రాజధాని ఫైల్స్' చిత్రానికి బ్రేకులు పడ్డాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ చిత్ర ప్రదర్శనను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు థియేటర్ యాజమానులను ఆదేశించారు. గురువారం రిలీజైన ఈ చిత్రాన్ని ఉమ్మడి కృష్ణాలో 26 థియేటర్లతో పాటు కొన్ని మల్టీప్లెక్స్‌ల్లోనూ విడుదల చేశారు. ఉదయం ఆట మొదలయ్యే సరికి రెవెన్యూ అధికారులు థియేటర్లకు వచ్చి.. ప్రదర్శనలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు వెళ్లే సరికి కొన్ని థియేటర్లలో ప్రదర్శనలు మొదలయ్యాయి. ఆయా థియేటర్లలో మాత్రం మేనేజర్లు కోర్టు తీర్పు కాపీని ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆ ఉత్తర్వులను టికెట్ కౌంటర్ల వద్ద అతికించారు. మ్యాట్నీ నుంచి పూర్తిగా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రెండ్‌సెట్‌లో ప్రదర్శనను మధ్యలోనే ఆపేయడంతో ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. అధికారులు వారికి కోర్టు ఆదేశాలను చూపించడంతో ఆందోళన విరమించారు. కాగా, ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్ (వి మాక్స్)లో ఈ సినిమా గురువారం 11 గంటలకు ప్రారంభం కాగా రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి ప్రేక్షకులను పంపించి వేశారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

హర్షను హీరోగా ఆదరించండి


చిరంజీవి

సుందరం మాస్టర్ చిత్రం ట్రైలర్ చాలా బావుంది. హర్ష కోసమే ఈ పాత్ర పుట్టినట్లుంది. తన ప్రతిభను నమ్ముకొని హర్ష ఓ స్థాయికి వచ్చాడు. ఇప్పుడు హీరోగా ఎదిగాడు. హాస్యంతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. ఇలాంటి వినూత్న ప్రయోగాలను ప్రేక్షకులు ఆదరించాలి. 'సుందరం మాస్టర్' చిత్రానికి పెద్ద విజయాన్ని అందించాలి' అని చిరంజీవి ప్రేక్షకులను కోరారు. హర్ష చెముడు, దివ్యశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సుందరం



మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్ కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుతం అమెరికా విహార యాత్రలో ఉన్న చిరంజీవి ఆన్‌లైన్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ "సుందరం మాస్టర్ చిత్రం చాలా కొత్త పాయింట్‌తో రాబోతోంది. మనలో ఒకడిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. అందరినీ ఆలోచింపజేసే చిత్రమిది. కామెడీతో పాటు అద్భుతమైన డ్రామా ఉంది' అన్నారు. మైనా అనే అద్భుతమైన పాత్రను సృజించి, నటిగా నాకు అవకాశం ఇచ్చినందుకు మా దర్శకుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని దివ్యశ్రీ పాద చెప్పారు. దర్శకుడు కల్యాణ్ సంతోష్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం చాలా పరిశోధన చేశాను. నా జీవితంలో తారసపడిన కొందరు వ్యక్తుల స్ఫూర్తితో కథ రాసుకున్నాను. ఈ సినిమాకు డబ్బు కంటే సమయాన్ని ఎక్కువ పెట్టుబడిగా పెట్టాం' అని తెలిపారు. సుధీర్ కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాణంలో రవితేజ సహకారం మరువలేనిది. సినిమా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. కొత్తగా ఉండాలని బాబా సెహగల్ గారితో ఈ చిత్రంలో ఓ పాట పాడించామని సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల తెలిపారు.

పాన్ ఇండియా ఎంటర్టైనర్ ప్రారంభం



తమిళ హీరో శివకార్తికేయన్ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా ఎంటర్టైనర్ షూటింగ్ బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషల్లో తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో కన్నడ నటి రుక్మిణి వసంత్ కథానాయిక. శ్రీలక్ష్మి మూవీస్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో శివ కార్తికేయన్‌ను మురుగదాస్ సరికొత్తగా చూపించబోతున్నారు. గురువారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది. అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సుదీప్ ఎలామన్.

భైరవకోన బావుందంటున్నారు

సందీప్ కిషన్




"ఊరుపేరు భైరవకోన' చిత్రానికి వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. 'సినిమా హిట్. చాలా బావుంది' అంటున్నారు. నా నటనను మెచ్చుకోవడం చాలా ఆనందాన్నిచ్చింది" అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. కావ్యథాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలు. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. సందీప్ కిషన్ మాట్లాడుతూ 'పిల్లలు, పెద్దలు కలసి చూసేలా ఒక ఫాంటసీ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను తీశాం. కుటుంబ ప్రేక్షకులంతా చూసే సినిమా ఇది. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నాం' అన్నారు. అనిల్ సుంకర మాట్లాడుతూ "ఊరుపేరు భైరవకోన' ప్రీమియర్స్‌కు ఇలాంటి స్పందన వస్తుందని ముందే ఊహించాం. టీం అంతా చాలా కష్టపడ్డారు. ప్రీమియర్స్ ఈ రేంజ్‌లో సక్సెస్ అవ్వడం, సినిమా అద్భుతంగా ఉందని ప్రేక్షకులు చెప్పడం సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ 'ప్రీమియర్ షోస్ అన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రేక్షకులను మెప్పించినందుకు ఆనందంగా ఉంద'న్నారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'రెండున్నరేళ్లు కష్టపడి ఈ సినిమా చేశాం. కంటెంట్‌ను నమ్మి వంద ప్రీమియర్ షోస్ వేశాం. రూ. కోటి పైన వసూళ్లు రావడం ఈ సినిమా క్రేజ్‌కు నిదర్శనం' అని పేర్కొన్నారు. ఇది నా కెరీర్‌లో ప్రత్యేక చిత్రమని కావ్యథాపర్ తెలిపారు. ప్రేక్షకుల స్పందన అద్భుతంగా ఉంది, ప్రతిసీన్‌ను అమితంగా ఆస్వాదిస్తున్నారు అని వర్ష బొల్లమ్మ చెప్పారు. 'ఊరు పేరు భైరవ కోన' సినిమా విడుదలపై స్టే ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌లో స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.

సమంత టేక్ 20



అగ్రకథానాయికగా కెరీర్ జోరు మీదున్న సమయంలో మయోసైటిస్ వ్యాధి బారినపడి సినిమాలకు దూరమయ్యారు సమంత. ప్రస్తుతం దాన్నుంచి కోలుకుంటున్నారు. త్వరలోనే సినిమా షూటింగ్స్‌లో పాల్గొనున్నట్లు ఇటీవలే ప్రకటించారు. మయోసైటిస్ వల్ల తను ఎదుర్కొన్న ఇబ్బందులు, దాన్ని అధిగమించేందుకు అనుసరించిన పద్ధతులపై అభిమానులకు అవగాహన కల్పించేందుకు సమంత సిద్ధమవుతున్నారు. దానికి సంబంధించిన పాడ్‌కాస్ట్‌ను 'టేక్ 20' పేరుతో ఈనెల 19న విడుదల చేయబోతున్నారు. గురువారం ప్రోమోను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్‌చేశారు. 'టేక్ 20 అనే పాడ్‌కాస్ట్‌ను ప్రారంభించాను. ఇందులో ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను మాత్రమే మీతో పంచుకుంటాను. మన జీవితాలను మరింత మెరుగ్గా మార్చుకుందాం. మీరూ మాతో జాయిన్ అవ్వండి' అని సమంత నెటిజన్లను కోరారు.



పద్మవ్యూహంలో ప్రేమకథ



ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికాటిక్కో, ఆషురెడ్డి కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'పద్మవ్యూహంలో చక్రధారి' అనే టైటిల్‌ను చిత్రబృందం నిర్ణయించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలో తొలి ప్రేమ ఉంటుంది. అందులో కొందరు సఫలం అయితే మరికొందరు విఫలమవుతారు. అలా తన తొలిప్రేమ జ్ఞాపకాల నుంచి బయటపడి జీవితంలో ముందుకు సాగడానికి ఓ వ్యక్తి అనుభవించిన సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పద్మవ్యూహంలో చక్రధారి' మంచి కంటెంట్‌తో తీసిన సినిమా. రాయలసీమ అనగానే పగ, ప్రతీకారాలు మాత్రమే అనేలా ప్రచారంలో ఉంది. కానీ మా చిత్రంలో ఈ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని చూపించబోతున్నాం' అన్నారు. ఆషురెడ్డి మాట్లాడుతూ 'ఇందులో నా పాత్ర పేరు పద్మ. విభిన్నంగా ఉంటుంద'న్నారు. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య. సినిమాటోగ్రఫీ: జీ అమర్

సంపూ మార్క్‌తో బంగారు గుడ్డు

సంపూర్ణేష్ బాబు కథానాయకుడిగా గోపీనాథ్ నారాయణ మూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి 'బంగారు గుడ్డు' అనే టైటిల్ ఖరారైంది. కేఎం ఇలంచెజియన్, ఎం కోటేశ్వరరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. సంపూర్ణేష్ బాబు కామెడీతో ఆద్యంతం వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిదని ఈ సందర్భంగా నిర్మాతలు పేర్కొన్నారు. రోబోశంకర్, చరణ్‌రాజ్, దువ్వాసి మోహన్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: షమీర్ టాండన్. సినిమాటోగ్రఫీ: అఖిల్ శశిధరన్. ఎడిటర్: మార్టిన్ టైటస్ ఎ





భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టి... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామ లక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి... వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

• వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తిర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా.. రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



• నూతి శివానందం

అవధూత శిఖామణి

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతో పాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

సారాంశం

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984

విశేషం

జ్ఞాన కార్యసాధకుడు

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచీ చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకావ్యశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.



• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

తొలి రోజే మోతెక్కించారు

రోహిత్, జడేజా శతకాలు.. సర్ఫరాజ్ అర్ధసెంచరీ

» భారత్ తొలి ఇన్నింగ్స్ 326/5

» ఇంగ్లండ్‌తో మూడో టెస్టు



సర్ఫరాజ్ (62)

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టును భారత ఘనంగా ఆరంభించింది. తొలి రోజు ఆటలోనే పరుగుల వరద పారిస్తూ కెప్టెన్ రోహిత్ శర్మ (131), రవీంద్ర జడేజా (110 బ్యాటింగ్) శతకాలతో చెలరేగారు. ఇక సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అరంగేట్రం చేసిన సర్ఫరాజ్ ఖాన్ (62) ఒత్తిడిని అధిగమిస్తూ అంచనాలకు మించి రాణించాడు. వన్డే తరహా ఆటతీరుతో చకచకా అర్ధసెంచరీ చేసి జట్టు భారీ స్కోరుకు దోహదపడ్డాడు. ఫలితంగా ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 86 ఓవర్లలో 5 వికెట్లకు 326 పరుగులు చేసింది. క్రీజులో జడేజాతో పాటు కుల్దీప్ (1 బ్యాటింగ్) ఉన్నాడు. పేసర్ ఉడ్‌కు మూడు వికెట్లు దక్కాయి. రెండో రోజు జట్టు 450-500 స్కోరుకు చేరాలంటే జడేజా ఆటతీరు కీలకం కానుంది. అటు కొత్త బంతితో ఇంగ్లండ్ బౌలర్లు ఏమేరకు ప్రభావం చూపగలరో వేచిచూడాల్సిందే.

33/3 నుంచి..

ఫ్లాట్ వికెట్ కావడంతో టాస్ గెలిచిన భారత్ వెంటనే బ్యాటింగ్‌కు దిగింది. అయితే పిచ్‌పై ఉన్న తేమను సద్వినియోగం చేసుకుంటూ ఇంగ్లండ్ బౌలర్లు చెలరేగారు. పేసర్ ఉడ్ తన వరుస ఓవర్లలో జైస్వాల్ (10), గిల్ (0) వికెట్లను తీయడంతో జట్టు షాక్‌కు గురైంది. ఇక రజత్ (5)ను స్పిన్నర్ హార్ట్‌లీ అవుట్ చేయడంతో జట్టు స్కోరు తొమ్మిది ఓవర్లలో 33/3. మరో ఎండ్‌లో ఉడ్ బౌన్సర్లు సంధించినా తెలివిగా వదిలేస్తూ ఓపెనర్ రోహిత్ ఓపిగ్గా క్రీజులో నిలిచాడు. అయితే ఈ దశలో సర్ఫరాజ్‌కు బదులు ఐదో నెంబర్‌లో వెటరన్ జడేజాను పంపారు. ఈ వ్యూహం అద్భుతంగా ఫలించింది. ఈ ఇద్దరూ తమ అనుభవంతో బౌలర్లను ఎదుర్కొంటూ మరో వికెట్ కోల్పోకుండా చూశారు. ఈ క్రమంలో రోహిత్ అర్ధసెంచరీ పూర్తి చేసి 93/3 స్కోరుతో లంచ్ బ్రేక్‌కు వెళ్లారు.

వికెట్ కోల్పోకుండా..

రెండో సెషన్‌లో రోహిత్, జడేజా ఇంగ్లండ్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం చూపడంతో, ఒక్క వికెట్ కోల్పోకుండా జట్టుకు మరో 92 పరుగులు అదనంగా నమోదయ్యాయి. రెండో సెషన్ ముగిసేసరికి రోహిత్ 97 రన్స్ దగ్గర ఉండగా.. అటు జడేజా అర్ధసెంచరీ పూర్తి చేశాడు.

సర్ఫరాజ్ దూకుడు..

ఆఖరి సెషన్‌లో అరంగేట్ర హీరో సర్ఫరాజ్ ఆటే హైలైట్‌గా నిలిచింది. ముందుగా పది ఇన్నింగ్స్‌ల తర్వాత రోహిత్ తన శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే అతడి కోసం లెగ్ సైడ్‌లో ఫీల్డర్లను మోహరించిన స్టోక్స్ కాసేపటికే ఫలితం సాధించాడు. ఉడ్ షార్ట్ బాల్‌ను రోహిత్ పుల్ షాట్ ఆడేందుకు చూసి స్టోక్స్‌కే క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 204 పరుగుల రికార్డు భాగస్వామ్యం ముగిసింది. అనంతరం బరిలోకి దిగిన సర్ఫరాజ్ కసితో బ్యాటింగ్ సాగించాడు. ఐదో బంతికి సింగిల్‌తో తొలి పరుగును సాధించాక జెట్ వేగంతో దూసుకెళ్లాడు. తను క్రీజులోకి వచ్చిన సమయంలో జడేజా 85 రన్స్‌తో ఉన్నాడు. జడ్డూ మరో 14 రన్స్ చేసేలోగానే అతను 66 బంతుల్లోనే 62 పరుగులు సాధించడం విశేషం. ఈ జోరులో సర్ఫరాజ్ 48 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కచ్చితంగా సెంచరీ చేసేలా కనిపించిన సర్ఫరాజ్ దురదృష్టవశాత్తు రనౌట్ కావాల్సి వచ్చింది. దీంతో ఐదో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బంతికే జడేజా శతకాన్ని పూర్తి చేయగా కాసేపటికే తొలి రోజు ఆట ముగిసింది.



ధ్రువ్ జురెల్

క్యాప్ విసిరేసిన రోహిత్

సర్ఫరాజ్ రనౌట్ కెప్టెన్ రోహిత్ శర్మకు తీవ్ర అసహనాన్ని తెప్పించింది. జడ్డూ 99 పరుగుల వద్ద ఉన్నప్పుడు సింగిల్ కోసం కోసం పిలిచి తర్వాత ఆగిపోయాడు. అయితే అతడి సెంచరీ కోసం సర్ఫరాజ్ వేగంగా రన్ తీసేందుకు ముందుకు కదిలినా.. తిరిగి క్రీజులోకి చేరే క్రమంలో ఉడ్ డైరెక్ట్ త్రోకు బలయ్యాడు. ఇదంతా డ్రెస్సింగ్ రూమ్ నుంచి గమనిస్తున్న రోహిత్ పట్టరాని కోపంతో తన క్యాప్‌ను తీసి నేలకేసి కొట్టాడు.

నాదే తప్పు..

సర్ఫరాజ్ ఖాన్ రనౌట్ విషయం తప్పంతా జడేజాదేనని అభిమానులు సోషల్ మీడియాలో తీవ్రంగా తప్పుపట్టారు. అటు జడ్డూ కూడా మ్యాచ్ ముగిశాక తన పొరపాటును అంగీకరిస్తూ ఇన్‌స్టాలో పశ్చాత్తాపం వ్యక్తం చేశాడు. 'అది నేను తప్పుగా తీసుకున్న నిర్ణయం. సర్ఫరాజ్ అలా అవుట్ కావడం బాధించింది. నీవు చాలా బాగా ఆడావు' అని కామెంట్ చేశాడు. మరోవైపు సర్ఫరాజ్ తన అవుట్‌ను తేలిగ్గానే తీసుకున్నాడు. ఆటలో ఇవన్నీ జరుగుతూనే ఉంటాయని, క్రీజులో జడ్డూ తనకు బాగా సహకరించి సూచనలిచ్చాడని గుర్తుచేశాడు.



రోహిత్ శర్మ (131)

జడేజా (110 బ్యాటింగ్)

1 టెస్టుల్లో ఎక్కువ సిక్సర్లు (80) బాదిన తొలి భారత కెప్టెన్‌గా రోహిత్. మొత్తంగా సెహ్వాగ్ (90) తర్వాత రెండో బ్యాటర్. అలాగే అతిపెద్ద వయస్సు (36 ఏళ్ల 291 రోజులు)లో టెస్టు సెంచరీ చేసిన విజయ్ హజారే (36 ఏళ్ల 278 రోజులు)ను అధిగమించాడు.

2 సర్ఫరాజ్ భారత్ తరపున టెస్టు అరంగేట్రంలో వేగంగా (48 బంతుల్లో) అర్ధసెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా హార్దిక్‌తో సంయుక్తంగా నిలిచాడు. యువరాజ్ (42 బంతుల్లో) టాప్‌లో ఉన్నాడు.

3 టెస్టుల్లో 3 వేల రన్స్ (3003) +200 వికెట్లు (280) సాధించిన మూడో భారత క్రికెటర్‌గా జడేజా. కపిల్ (5248+434), అశ్విన్ (3271+499) ముందున్నారు.

స్కోరుబోర్డు: **భారత్ తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) రూట్ (బి) ఉడ్ 10; రోహిత్ (సి) స్టోక్స్ (బి) ఉడ్ 131; గిల్ (సి) ఫోక్స్ (బి) ఉడ్ 0; పటీదార్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 5; జడేజా (బ్యాటింగ్) 110; సర్ఫరాజ్ (రనౌట్-ఉడ్) 62; కుల్దీప్ (బ్యాటింగ్) 1; **ఎక్స్‌ట్రాలు:** 7; **మొత్తం:** 86 ఓవర్లలో 326/5; **వికెట్ల పతనం:** 1-22, 2-24, 3-33, 4-237, 5-314; **బౌలింగ్:** అండర్సన్ 19-5-51-0; ఉడ్ 17-2-69-3; హార్ట్‌లీ 23-3-81-1; రూట్ 13-1-68-0; రెహాన్ 14-0-53-0.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

దేశవాళీ క్రికెట్‌లో రికార్డు స్థాయిలో పరుగులు సాధిస్తూ భారత జట్టులో చోటు కోసం సర్ఫరాజ్ కన్నకలలు మూడో టెస్టు ద్వారా నెరవేరాయి. తనతోపాటు వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కూడా అరంగేట్రం చేశాడు. దిగ్గజ స్పిన్నర్ కుంబ్లే చేతుల మీదుగా సర్ఫరాజ్ టెస్టు క్యాప్‌ను అందుకున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత తన కుమారుడికి దక్కిన ఈ అవకాశంతో సర్ఫరాజ్ తండ్రి కన్నీటిపర్యంతమయ్యాడు. కుమారుడిని ఆలింగనం చేసుకోవడంతో పాటు తనివి తీరా బ్లూ క్యాప్‌ను చూసి ముద్దాడాడు. అక్కడే ఉన్న సర్ఫరాజ్ భార్య రొమానా సైతం కంటతడి పెట్టుకుంది. ధ్రువ్‌కు మాజీ కీపర్ దినేశ్ కార్తీక్ క్యాప్‌ను అందించాడు.



నాన్నతో సర్ఫరాజ్

సర్ఫరాజ్ జెర్సీ కథ

సర్ఫరాజ్ అరంగేట్ర టెస్టులో 97 నెంబర్ జెర్సీతో బరిలోకి దిగాడు. అయితే ఈ సంఖ్య వెనుక ఓ స్టోరీ ఉంది. అతడి తండ్రి పేరు నౌషద్ ఖాన్. అలాగే ఆయన పేరులోని నౌ (హిందీలో 9), సాత్ (7) కలిపితే 97 నెంబర్‌ను స్ఫురించేలా ఉంటుంది. అందుకే తన క్రికెట్ కెరీర్ కోసం కోచ్‌గా మారి జీవితాన్నే త్యాగం చేసిన తండ్రికి గౌరవంగా ఆ సంఖ్యనే ఎప్పుడూ ధరిస్తుంటాడు. సర్ఫరాజ్ పుట్టిన ఏడాది కూడా 1997. మరోవైపు అండర్-19 వరల్డ్‌కప్‌లో తన సోదరుడు ముషీర్ ఖాన్ కూడా ఇదే నెంబర్‌తో ఆడడం విశేషం.

నాన్న కలను నెరవేర్చా..

'భారత జట్టుకు ఆడాలని నా తండ్రి కన్న కలలు ఫలించలేదు. ఆయన తరపున నేను జట్టుకు ఆడాలనుకుని చివరకు సాధించాను. మా సోదరుల కెరీర్ కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. చివరకు ఆయన ముందే నేను అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాను' - సర్ఫరాజ్

న్యూజిలాండ్ లక్ష్యం 267

హామిల్టన్: దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ బెడింగమ్ (110) శతకంతో.. న్యూజిలాండ్‌తో రెండో టెస్ట్ ఆసక్తికరంగా సాగుతోంది. గురువారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన సౌతాఫ్రికా 235 రన్స్‌వద్ద ఆలౌటైంది. 31 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి మొత్తం 267 పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. విలియమ్ ఒ రౌర్కీ 5 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో కివీస్ మూడో రోజు ఆట ఆఖరుకు 40/1 స్కోరు చేసింది. కివీస్ విజయానికి ఇంకా 227 పరుగుల దూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 242 పరుగులు చేయగా.. కివీస్ 211 రన్స్‌కు ఆలౌటైంది.

చైనా చేతిలో భారత్ ఓటమి

» ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

షా ఆలమ్ (మలేసియా): డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి గైర్హాజరీలో.. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టుకు చుక్కెదురైంది. గురువారం గ్రూప్-ఎలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-3తో చైనా చేతిలో ఓడింది. తొలుత సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్ గెలుపొందారు. కానీ, డబుల్స్‌లో ధ్రువ్ కపిల-అర్జున్ జంట, సూరజ్-పృథ్వీ జోడీ ఓడడంతో స్కోరు 2-2తో సమమైంది. అయితే నిర్ణాయక మ్యాచ్‌లో చిరాగ్ సేన్ పరాజయం పాలయ్యాడు. భారత్ ఇప్పటికే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నందున డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్, సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్‌కు విశ్రాంతినిచ్చారు.

రౌఫ్ సెంట్రల్ కాంట్రాక్ట్ రద్దు

లాహోర్: క్రమశిక్షణను ఉల్లంఘించి ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ నుంచి తప్పుకోవడంతో స్టార్‌ప్లేయర్ హరీస్ రౌఫ్ సెంట్రల్ కాంట్రాక్ట్‌ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు రద్దు చేసింది. ఫిట్‌గా ఉన్నా కూడా ఆసీస్‌తో టెస్టులు ఆడేందుకు రౌఫ్ ఆసక్తి ప్రదర్శించలేదు. కానీ, అదే సమయంలో బిగ్‌బాష్ లీగ్‌లో కనిపించడంతో పీసీబీ కన్నెర్ర చేసింది.

భారత రెజ్లింగ్‌పై నిషేధాన్ని కొనసాగించండి!

» యూడబ్ల్యూడబ్ల్యూకు బజ్‌రంగ్ లేఖ



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ)పై విధించిన నిషేధాన్ని కొనసాగించాలని ఒలింపిక్ పతక విజేత బజ్‌రంగ్ పూనియా.. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ)ను కోరా డు. సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఉన్న భారత సమాఖ్యపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయడం అంటే.. అథ్లెట్లపై మరోసారి బెదిరింపులు, వేధింపులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమేనన్నాడు. సమాఖ్యపై రెజ్లర్లు విశ్వాసం కోల్పోయారని పూనియా ఆరోపించాడు. మళ్లీ విధించాలని సస్పెన్షన్ కోరుతూ ఓ లేఖ రాశాడు. లెటర్‌ను నెట్‌లో పోస్టు చేసిన పూనియా.. క్రీడా మంత్రికి కూడా ఓ ప్రతిని పంపాడు. భారత రెజ్లర్లకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశాడు.

రాహుల్ ద్రవిడే కోచ్

» బోర్డు కార్యదర్శి జైషా




న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్‌లో జరిగే టీ20 వరల్డ్‌కప్ వరకు భారత జట్టు కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కొనసాగనున్నాడు. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జైషా ధ్రువీకరించాడు. గతేడాది వన్డే వరల్డ్‌కప్‌తోనే ద్రవిడ్ ఒప్పందం ముగిసిపోయింది. అయితే దక్షిణాఫ్రికా పర్యటన వరకు కొనసాగాలని బోర్డు కోరింది. ఆ తర్వాత వెంటనే ఇంగ్లండ్‌తో సిరీస్ ఆరంభం కాగా, చివరకు గురువారం అతడితో జైషా మాట్లాడాడు. అయితే ద్రవిడ్‌లాంటి సీనియర్ల కాంట్రాక్ట్‌పై తొందరెందుకు? టీ20 వరల్డ్‌కప్ వరకు అతనే ఉంటాడని జైషా బదులిచ్చాడు.

బిజినెస్

ఫోర్బ్స్ ఇండియా అండర్ 30 జాబితాలో

హైదరాబాద్ స్టార్టప్ నెక్స్ట్‌వేవ్

కంపెనీ వ్యవస్థాపకులు శశాంక్, అనుపమ్‌లకు చోటు



వైస్ ప్రెసిడెంట్ సీతాలక్ష్మీ నారాయణన్, రేజర్‌పే స్ట్రాటజీ హెడ్ విష్ణు ఆచార్య తదితరులు ఉన్నారు.

హైదరాబాద్: దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే శక్తి కలిగిన స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 పేరుతో ఒక జాబితా రూపొందించింది. 2024 సంవత్సరానికి గాను రూపొందించిన ఈ జాబితాలో మొత్తం 19 కేటగిరీల నుంచి 38 మందిని ఎంపిక చేసింది. ఇందులో కంపెనీ వ్యవస్థాపకులు, సహ వ్యవస్థాపకులు, ఇతర కీలక పదవుల్లోని వారు కూడా ఉన్నారు. ఈ జాబితాలో ఉన్న వారంతా 30 ఏళ్ల లోపు వయసు కలిగినవారే. ఫోర్బ్స్ ఇండియా రూపొందించిన ఈ జాబితాలో హైదరాబాద్ ఎడ్‌టెక్ స్టార్టప్ కంపెనీ నెక్స్ట్‌వేవ్ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్ల కూడా ఉన్నారు. వీరితో పాటు జెప్టో సహ వ్యవస్థాపకులు అదిత్ పాలిచా, కైవల్య వోహ్రా, ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ వైస్ ప్రెసిడెంట్ సీతాలక్ష్మీ నారాయణన్, రేజర్‌పే స్ట్రాటజీ హెడ్ విష్ణు ఆచార్య తదితరులు ఉన్నారు.

ఐటీ పరిశ్రమకు అవసరమైన అధునాతన నైపుణ్యాల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చే 'నెక్స్ట్‌వేవ్' స్టార్టప్ సంస్థ ఒక్కటే హైదరాబాద్ నుంచి ఈ జాబితాలో చోటు సంపాదించింది. ఈ సంస్థను స్థాపించిన శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదర్ల ఇద్దరూ తెలుగువారే కావడం మరో విశేషం. వీరిలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన శశాంక్ రెడ్డి గుజ్జుల ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్, ఏలూరుకు చెందిన అనుపమ్ పెదర్ల ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ పూర్తి చేశారు.

ఐటీలో అడ్వాన్స్‌డ్ కోర్సులు

నెక్స్ట్‌వేవ్ అందించే అధునాతన ఐటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు దేశ, విదేశాల్లోని దాదాపు 1,700 ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ పొందారు. వచ్చే రెండేళ్లలో 10,000 కంపెనీలకు చేరువై తమ ఆన్‌లైన్ కోర్సులు నేర్చుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నెక్స్ట్‌వేవ్ లక్ష్యంగా పెట్టుకుంది. 'ఇది మేము వ్యక్తిగతంగా సాధించిన గుర్తింపు కాదు. గొప్ప కలలు కని, వాటికోసం స్థిరంగా ప్రతిరోజు నేర్చుకుంటున్న నెక్స్ట్‌వేవ్ విద్యార్థులకు, ఎంతోమంది యువత చక్కటి ఉద్యోగాలు సాధించేలా నిరంతర కృషి చేస్తున్న నెక్స్ట్‌వేవ్ బృందానికి దక్కిన గుర్తింపు' అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, హెడ్ ఆఫ్ స్టూడెంట్స్ ఎక్స్‌పీరియన్స్ శశాంక్ రెడ్డి అన్నారు. ఫోర్బ్స్ నుంచి లభించిన ఈ గుర్తింపు వేల మంది యువత జీవితాల్లో నెక్స్ట్‌వేవ్ తీసుకువస్తున్న మార్పుకి నిదర్శనం' అని నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనుపమ్ పెదార్ల చెప్పారు.

ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్‌కీ చోటు



డ్రోన్ల తయారీలో దూసుకుపోతున్న ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ స్టార్టప్ కంపెనీకి ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో చోటు లభించింది. ఐఐటీ కాన్పూర్ ఇంక్యుబేటర్‌లో పురుడుపోసుకున్న ఈ స్టార్టప్ వ్యవస్థాపకుడు రామకృష్ణ మెండు గుంటూరుకు చెందిన తెలుగు వారే. ఈ స్టార్టప్‌కు ఏపీ యస్ పెయింట్స్ ప్రమోటర్లలో ఒకరైన జలజ్ దానీ రూ.13.5 కోట్లు సీడ్ క్యాపిటల్‌గా సమకూర్చారు. డీఆర్‌డీఓ, హెచ్‌ఏఎల్, యూపీ పోలీస్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌తో సహా అనేక ప్రఖ్యాత సంస్థలకు ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ తన సేవలు అందిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే జెన్ టెక్నాలజీస్ కూడా ఈ సంస్థ సేవలు అందుకుంటోంది. పీఎల్ఐ పథకం కింద డ్రోన్లు, వాటి విడి భాగాలు తయారు చేసేందుకూ ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర పౌర విమానయాన శాఖ ఎండ్యూర్‌ఎయిర్ సిస్టమ్స్ ప్రతిపాదనను షార్ట్‌లిస్ట్ చేసింది.

మాంద్యం గుప్పిట్లో బ్రిటన్, జపాన్

» నాలుగో స్థానానికి పడిపోయిన జపాన్

లండన్/టోక్యో: జపాన్, బ్రిటన్ ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో చిక్కుకున్నాయి. 2023 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ మైనస్ 0.1%, జపాన్ ఆర్థిక వ్యవస్థ మైనస్ 2.9% కుంగిపోయాయి. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలోనూ ఈ రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు వరుసగా మైనస్ 0.4%, మైనస్ 0.3% వృద్ధి రేటు నమోదు చేశాయి. ఏ దేశ జీడీపీ అయినా వరుసగా రెండు త్రైమాసికాలు మైనస్ వృద్ధి రేటు నమోదు చేస్తే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉన్నట్లుగా పరిగణిస్తారు. ఈ లెక్కన బ్రిటన్, జపాన్ ఆర్థిక వ్యవస్థలు ప్రస్తుతం మాంద్యంలో కూరుకుపోయాయి. మాంద్యం దెబ్బకు జపాన్ ఆర్థిక వ్యవస్థ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం తొలి 3 స్థానాల్లో అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి.

మళ్లీ 72,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: మార్కెట్ ఇప్పటివరకు సాధించిన లాభాలను కన్సాలిడేట్ చేసుకుంటున్న తరుణంలో కొన్ని షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతు కారణంగా మూడో రోజున కూడా ఈక్విటీ సూచీలు లాభాల్లో ముగిశాయి. మరోసారి సెన్సెక్స్ 72,000 పైన, నిఫ్టీ 22,000 ఎగువన ముగిశాయి. గురువారం సెన్సెక్స్ 227.55 పాయింట్ల లాభంతో 72,050.38 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 70.70 పాయింట్ల లాభంతో 21,910.75 వద్ద క్లోజైంది. రోజంతా సూచీలు పాజిటివ్ మొగ్గుతో పరిమిత పరిధిలోనే ట్రేడయ్యాయి. మహీంద్రా అండ్ మహీంద్రా 6.51 శాతం లాభంతో సెన్సెక్స్ షేర్లలో అగ్రగామిగా నిలిచింది.

ఎన్ఎండీసీ 52 వారాల గరిష్ఠం: ప్రభుత్వ రంగంలోని ఎన్ఎండీసీ షేరు గురువారం ఇంట్రాడేలో 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. కంపెనీ ఆర్థిక ఫలితాలు ఇచ్చిన ఉత్తేజంలో ఈ షేరు బీఎస్ఈలో 4.86 శాతం వృద్ధితో రూ.246.95 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 4.69 శాతం వృద్ధితో రూ.246.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు బీఎస్ఈలో రూ.252.65, ఎన్ఎస్ఈలో రూ.252.40ని తాకింది. ఈ రెండూ 52 వారాల గరిష్ఠ స్థాయిలే.

వచ్చే వారంలో జునిపర్ హోటల్స్ ఇష్యూ : హయత్ బ్రాండ్‌తో హోటళ్లను నిర్వహిస్తున్న జునిపర్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూ వచ్చే బుధవారం (తేదీ 21) ప్రారంభమై శుక్రవారం (తేదీ 23) ముగియనుంది. ఈ షేరు ధర శ్రేణిని రూ.342-360గా ప్రకటించారు. ఇష్యూ ద్వారా రూ.1,800 కోట్లు సమీకరణ లక్ష్యంగా కంపెనీ పెట్టుకుంది. ఒక్కో ఇన్వెస్టర్ కనీసం 40 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,070 ▼	56,900 ▼	76,000 ▲
ముంబై	61,508 ▼	56,341 ▼	70,203 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ		విజయవాడ	539
హైదరాబాద్	548	విశాఖపట్నం	555
16వ తేదీ		వరంగల్	550
చిత్తూరు	603	దజను గుడ్లు రూ.72	
గోదావరి	539		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

హైదరాబాద్	124	గోదావరి	129
వరంగల్	124	విజయవాడ	129
కరీంనగర్	124	గుంటూరు	129
మహబూబ్‌నగర్	124	ఒంగోలు	129
కర్నూలు	124	చిత్తూరు	130
విశాఖపట్నం	122		

విభోర్ స్టీల్ ఐపీఓ సూపర్ హిట్

» 299 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్

న్యూఢిల్లీ: గురువారం ముగిసిన విభోర్ స్టీల్ ట్యూబ్స్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) సూపర్ డూపర్ హిట్టయింది. కంపెనీ ఈ ఐపీఓ ద్వారా 35,92,445 షేర్లను అమ్మకానికి పెట్టగా ఇన్వెస్టర్ల నుంచి 107,36,25,300 షేర్లకు (298.86 రెట్లు) బిడ్స్ వచ్చాయి. దేశ ఐపీఓ చరిత్రలో అత్యధికంగా ఓవర్ సబ్‌స్క్రైబ్ అయిన ఐపీఓ ఇదేనని భావిస్తున్నారు. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.72.17 కోట్లు సమీకరించాలని భావించగా.. 28 లక్షల మంది ఇన్వెస్టర్ల నుంచి రూ.16,211 కోట్ల విలువైన షేర్లకు బిడ్స్ వచ్చాయి. నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (ఎన్ఐఐ)లకు కేటాయించిన షేర్లయితే 721.33 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. ఉద్యోగులకు కేటాయించిన షేర్లు 201.48 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రిటైల్ మదుపరులకు కేటాయించిన షేర్లు 188.17 రెట్లు, క్యూఐబీలకు కేటాయించిన షేర్లు 178.73 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రూ.141-151 ప్రైస్ బ్యాండ్‌లో కంపెనీ ఈ షేర్లు జారీ చేసింది. ప్రస్తుతం గ్రే మార్కెట్లో విభోర్ స్టీల్ ట్యూబ్స్ షేరు 80 శాతం ప్రీమియంతో ట్రేడవుతోంది.

ఎగుమతులు 3 నెలల గరిష్ఠం

జనవరిలో 3.14 లక్షల కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం జనవరిలో కాస్తంత పుంజుకుంది. రెడ్ సీ సంక్షోభం, ఇతరత్రా ప్రపంచ అస్థిరతల నేపథ్యంలో కూడా ఈ రంగం 3.12 శాతం వృద్ధితో 3,692 కోట్ల డాలర్ల (రూ.3.14 లక్షల కోట్లు) విలువ గల వస్తూత్పత్తులు ఎగుమతి చేయగలిగింది. దిగుమతులు కూడా 3 శాతం వృద్ధితో 5,441 కోట్లకు (రూ.4.62 లక్షల కోట్లు) చేరాయి. దీంతో వాణిజ్య లోటు 9 నెలల కనిష్ఠ స్థాయి 1,749 కోట్ల డాలర్లకు (రూ.1.49 లక్షల కోట్లు) తగ్గింది. గత ఏడాది ఏప్రిల్‌లో నమోదైన 1,524 కోట్ల డాలర్ల (రూ.1.30 లక్షల కోట్లు) తర్వాత వాణిజ్య లోటు ఇంత తక్కువగా ఉండడం ఇదే ప్రథమం. వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరిలో 30 రంగాల్లో 18 రంగాలు ఎగుమతుల్లో సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. వాటిలో ఇనుప ఖనిజం, సుగంధ ద్రవ్యాలు, ఆయిల్ మీల్స్, నూనె గింజలు, కార్పెట్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, టీ, ఫార్మాస్యూటికల్స్ పెట్రోలియం ఉత్పత్తులు, కాఫీ, ఇంజనీరింగ్ వస్తువులు, రసాయనాల రంగాలున్నాయి.

ముఖ్యాంశాలు...

- సేవల రంగం ఎగుమతులు గత ఏడాది జనవరిలో 2,800 కోట్ల డాలర్లుండగా ఈ జనవరిలో 328 కోట్ల డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్-జనవరి నెలల మధ్య 10 నెలల కాలంలో ఈ రంగం ఎగుమతులు 26,750 కోట్ల డాలర్ల నుంచి 28,445 కోట్ల డాలర్లకు పెరిగాయి.
- 2014 నాటికి ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటా 19,496 కోట్ల డాలర్ల విలువతో 8 శాతం ఉండగా 2022 నాటికి 26,109 కోట్ల డాలర్ల విలువతో 10.35 శాతానికి పెరిగింది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో ఎగుమతులు 4.89 శాతం క్షీణతతో 35,392 కోట్ల డాలర్లకు తగ్గగా దిగుమతులు కూడా 6.71 శాతం క్షీణించి 56,112 కోట్ల డాలర్లకు తగ్గాయి. 10 నెలల వాణిజ్య లోటు 2072 కోట్ల డాలర్లుగా నమోదైంది.

బంగారం, క్రూడ్ దిగుమతుల్లో వృద్ధి

క్రూడాయిల్, బంగారం దిగుమతులు జనవరి నెలలో పెరిగాయి. బంగారం దిగుమతులు 174 శాతం వృద్ధితో 190 కోట్ల డాలర్లకు (రూ.16,150 కోట్లు) చేరగా క్రూడాయిల్ ఎగుమతులు 4.33 శాతం వృద్ధితో 1,656 కోట్ల డాలర్లుగా (రూ.1.41 లక్షల కోట్లు) నమోదయ్యాయి. అయితే ఏప్రిల్-జనవరి నెలల మధ్య కాలంలో బంగారం దిగుమతులు 301.7 శాతం పెరిగి 3,800 కోట్ల డాలర్లుగా (రూ.3.32 లక్షల కోట్లు) నమోదు కాగా క్రూడాయిల్ దిగుమతి మాత్రం 15.91 శాతం తగ్గి 14,675 కోట్ల డాలర్లకు (రూ.121.47 లక్షల కోట్లు) పరిమితమైంది.

సిస్కోలో 4,000 మంది ఔట్

వాషింగ్టన్: అమెరికాలోని టెక్ కంపెనీల్లో కొలువుల కోత కొనసాగుతోంది. తాజాగా టెలికాం పరికరాల తయారీ కంపెనీ సిస్కో సిస్టమ్స్ 4,000 మందికిపైగా ఉద్యోగులను ఇంటికి పంపాలని నిర్ణయించింది. కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో ఇది దాదాపు ఐదు శాతానికి సమానం. ఒక్క అమెరికాలోనే కాకుండా ఇతర దేశాల్లోని సిస్కో అనుబంధ సంస్థల్లోనూ ఈ కొలువుల కోత ఉంటుందని కంపెనీ తెలిపింది.

డేటా ఎక్స్‌క్లూజివిటీకి ఒప్పుకోం

ఈఎఫ్‌టీఏ డిమాండ్‌ను తోసిపుచ్చిన భారత్

న్యూఢిల్లీ: ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా "డేటా ఎక్స్‌క్లూజివిటీ" నిబంధనలను చేర్చాలన్న యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం (ఈఎఫ్‌టీఏ) డిమాండ్‌ను భారత్ తిరస్కరించింది. దేశీయ ఔషధ పరిశ్రమ ప్రయోజనాలు పరిరక్షించడమే లక్ష్యంగా తాము ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. జెనరిక్ పరిశ్రమకు వ్యతిరేకమైన చర్యలేవీ తాము తీసుకునే ప్రసక్తి లేదని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భర్త్వాల్ అన్నారు. డేటా ఎక్స్‌క్లూజివిటీ వల్ల ఇన్నోవేటర్ కంపెనీల సాంకేతిక డేటాకు రక్షణ కలుగుతుంది. ఫార్మా రంగంలో అయితే ఔషధ కంపెనీలు అత్యంత వ్యయప్రయాసల కోర్చి ప్రపంచ స్థాయిలో క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం ద్వారా భారీ డేటాను సృష్టిస్తాయి. దీనిపై "డేటా ఎక్స్‌క్లూజివిటీ" కల్పించడం వల్ల ఇన్నోవేటర్ కంపెనీలు, పోటీదారులు తక్కువ ధరలకు తయారు చేసిన ఉత్పత్తులపై లైసెన్సు పొందకుండా నిరోధించే ఆస్కారం ఉన్నందున దాన్ని భారత్ తిరస్కరించింది.

నువామా వెల్త్ లాభం 176 కోట్లు

నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ (గతంలో ఎడల్‌వీజ్ సెక్యూరిటీస్).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.176 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.90 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా రెండింతలు వృద్ధి చెందింది. ఫీజు ఆధారిత వ్యాపారంలో మంచి వృద్ధి కనబరచటం ఇందుకు కారణంగా ఉందని కంపెనీ పేర్కొంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.558 కోట్లుగా ఉంది.

- దేశంలో తొలి ఏఐ ఆధారిత హోమ్ అప్లయెన్సెస్ కంపెనీ అప్లయెన్స్‌ఏఐ.. ఖోస్లా వెంచర్స్ నుంచి రూ.34 కోట్ల నిధులను సమీకరించింది. ఇందులో భాగంగా కంపెనీ విలువను రూ.143 కోట్లుగా లెక్కగట్టారు. ఈ నిధులను కార్యకలాపాల విస్తరణకు ఉపయోగించనుంది.
- టీ-హబ్‌తో ఆల్గోభారత్ తన భాగస్వామ్యాన్ని విస్తరించింది. ఇందులో భాగంగా ఆల్గోగ్రాండ్ స్టార్టప్ ల్యాబ్ ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను ఆహ్వానించనుంది. సుమారు 20 వెబ్ 3 స్టార్టప్స్‌ను ఎంపిక చేసి వారికి ప్రీ-సీడ్ ఫండింగ్ అందించనుంది.

అలకవీడిన ముద్దరబోయిన!.. బాబుతో భేటీ

నూజివీడు, ఫిబ్రవరి 15: ఏలూరు జిల్లా నూజివీడు టీడీపీ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబును కలిశారు. నూజివీడు టీడీపీ టికెట్‌ను మాజీ మంత్రి, వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న కొలుసు పార్థసారథికి కేటాయించడం దాదాపు ఖాయమైంది. దీంతో ముద్దరబోయిన వర్గం కినుక వహించింది. ఆయన వైసీపీలోకి వెళతారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. చంద్రబాబు నుంచి పిలుపు రావడంతో ముద్దరబోయిన వెళ్లి కలిశారు. 'కొన్ని ప్రత్యేక పరిస్థితుల వల్ల మీ స్థానంలో పార్థసారథికి టికెట్ ఇవ్వాల్సి వచ్చింది. మీ రాజకీయ భవిష్యత్తుకు నాది గ్యారెంటీ. బీసీ నాయకుడిగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం పని చేయండి. పార్టీ అధికారంలోకి వచ్చాక మీకు కీలక పదవి ఇస్తాం'.. అని చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు సమాచారం.

వైసీపీ నుంచి చైతన్య, గరటయ్య సస్పెన్షన్

అద్దంకి, ఫిబ్రవరి 15: అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, శాప్‌నెట్ చైర్మన్, వైసీపీ అద్దంకి మాజీ ఇన్‌చార్జి కృష్ణచైతన్యలను పార్టీ నుంచి వైసీపీ సస్పెండ్ చేసింది. వారిద్దరూ గురువారం సాయంత్రం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. ఇది తెలిసి వైసీపీ అధిష్ఠానం ఉలిక్కిపడింది. కొద్దిసేపటికే వారిని సస్పెండ్ చేసినట్లు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

పుంగనూరులో టీడీపీ నేతలపై మరిన్ని రౌడీషీట్లు

పుంగనూరు, ఫిబ్రవరి 15: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీలో క్రియాశీలంగా ఉన్న 22 మందిపై రౌడీషీట్లను తెరుస్తూ బదిలీపై వెళ్లిన పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఇటీవల 41 మంది టీడీపీ శ్రేణులపై రౌడీషీట్లు తెరవగా.. తాజాగా మరో 22మందిపైనా తెరచిన విషయాన్ని టీడీపీ నేతలు బయట పెట్టారు. దీంతో ఈ సంఖ్య 63కి చేరింది. పోలింగ్ రోజున బైండోవర్ చేసేలా పోలీసులు రౌడీషీట్లు తెరవడంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నామని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు.

ఇసుక దోపిడీకి అధికారుల సహకారం: నక్కా

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార పార్టీ ఇష్టారాజ్యంగా సాగిస్తున్న ఇసుక దోపిడీకి కొందరు కలెక్టర్లు, మైనింగ్ అధికారులు సహకరిస్తున్నారని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ పాలనలో ఇసుకను వైసీపీ నేతలు అడ్డగోలుగా దోచేస్తున్నారు. కోర్టుల్లో, ఎన్జీటీ ఎదుట ప్రభుత్వ న్యాయవాది వాదించిన దానికి భిన్నంగా కేంద్ర పర్యావరణ శాఖ ఇసుక తవ్వకాలపై ఇచ్చిన నివేదికపై సీఎం జగన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి ఏం సమాధానం చెప్తారు? టీడీపీ ప్రభుత్వం రాగానే తప్పు చేసిన కలెక్టర్లపై చర్యలు తీసుకుంటుంది. మైనింగ్ దోపిడీకి బాధ్యుడైన వెంకటరెడ్డిని కఠినంగా శిక్షిస్తుంది' అని ఆనందబాబు అన్నారు.

కేంద్ర కమిటీ నిర్ణయం మేరకే పొత్తులు: పురందేశ్వరి

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 15: 'త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎవరితో పొత్తులో ఉంటుందన్న విషయం కేంద్ర కమిటీ నిర్ణయిస్తుంది. వాటి సంగతి ఎలా ఉన్నా క్షేత్రస్థాయిలో పార్టీని ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాం. బలమైన శక్తిగా రాష్ట్రంలో మా పార్టీ ఎదుగుతోంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం నెల్లూరులో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట జిల్లాలకు సంబంధించిన క్లస్టర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'రాష్ట్రంలో అరాచక, నిరంకుశ, అవినీతి పాలన సాగుతోంది. ఉపాధి హామీ, పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై కేంద్రం నియమించిన కమిటీ విడుదల చేసిన నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించినట్లు నిర్ధారించింది. ఇక రాష్ట్రంలో దొంగ ఓట్ల విషయాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 22 నుంచి ప్రజాపోరును నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నాం' అని పురందేశ్వరి చెప్పారు.

డబ్బు, కులం పేరుతో ఎన్నికలు: సురవరం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో డబ్బు, కులానికే ప్రధాన పార్టీలు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నాయని సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కర్నూలులో సీపీఐ అధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సురవరంతో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పీ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ.. బీజేపీ ఏ పార్టీతో స్నేహం చేసినా ఆ పార్టీలు ధ్వంసం అవుతాయన్నారు. బీజేపీ మరోసారి కులాలు, మతాల పేరుతో ఎన్నికలకు వెళ్తోందన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సురవరం పిలుపునిచ్చారు.

సెక్స్ రాకెట్ నడిపిన కేశినేని నాని!: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 15: 'సెక్స్ రాకెట్ నడిపే నీవు చంద్రబాబును తూలనాడతావా?' అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)పై టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. కేశినేని నాని 1997లో విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీలలో హోటళ్లు తీసుకుని సెక్స్ రాకెట్ నడిపారని విమర్శించారు. ఇప్పుడు కూడా లీజుకు తీసుకున్న హోటల్‌లో ఏం జరుగుతోందో త్వరలో మొత్తం బయట పెడతానని గురువారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో బుద్దా వెంకన్న హెచ్చరించారు. పండుగలు, పబ్బాలప్పుడు బస్సు టికెట్లను బ్లాకులో అమ్ముకున్నాడని విమర్శించారు. పార్టీ అతడిని మెడపెట్టి గెంటేసిన మాట వాస్తవమేనని చెప్పారు.

ఉత్తుత్తి జీవోలతో జగన్ మోసపు సినిమా!: పట్టాభిరాం

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఉత్తుత్తి జీవోలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మోసపు సినిమా చూపిస్తున్నారని టీడీపీ ధ్వజమెత్తింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం గురువారం ఇక్కడ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌పై సీబీఐ గతంలో 420 సెక్షన్ కింద కేసు పెట్టింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన ఆ అలవాట్లు మానుకోలేదని రుజువవుతోంది. బ్యాంకులను బురిడీ కొట్టించడానికి ఏకంగా తప్పుడు జీవోలు జారీ చేశారు. రాజధాని అమరావతిలో జగన్ పుణ్యమా అని మధ్యలో నిలిచిపోయిన భవనాల్లో ఇప్పుడు అధికారులు నివాసం ఉంటున్నట్లు... వారి కోసం ప్రభుత్వం అద్దె కూడా చెల్లిస్తున్నట్లు జీవోలు జారీ చేశారు. ప్రభుత్వమే ఇంత ఘోరంగా పచ్చి మోసంతో జీవోలు ఇవ్వడం చరిత్రలో లేదని విమర్శించారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ప్రభుత్వం, అందులోని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన బ్యాంకులకు విజ్ఞప్తి చేశారు.

సభా హక్కులకూ దిక్కులేదు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీఎండీసీలోని కీలక అధికారిణిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో ఆయన నిర్లక్ష్యం వహించారని ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఆయన తీరును ప్రశ్నిస్తూ తాజాగా శ్రీముఖం పంపినట్లు తెలిసింది. అందులో తీవ్రమైన అంశాలను ప్రస్తావించినట్లు తెలిసింది. ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఏపీఎండీసీ హెచ్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ కళావతిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. జనవరి 10వ తేదీన ఏపీఎండీసీకి వెళ్లినప్పుడు ఆమె తనను తీవ్రంగా అవమానించారని, కనీసం ప్రొటోకాల్ మర్యాద కూడా పాటించకుండా తన పట్ల అగౌరవంగా ప్రవర్తించారని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఆ మరుసటి రోజు స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఫిర్యాదు చేశారు. ఉదయభాను ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకోవాలని, ఏపీఎండీసీ అధికారిణి నుంచి వివరణ తీసుకోవాలని అసెంబ్లీ కార్యదర్శి గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందించిన ద్వివేది.. కళావతి నుంచి వివరణ తీసుకుని జనవరి 20వ తేదీలోగా స్పీకర్ కార్యదర్శికి నివేదించాలని వెంకటరెడ్డిని ఆదేశించారు. కానీ సకాలంలో ఈ ఆదేశం అమలు కాలేదు. సర్వీసు నిబంధనల ప్రకారం ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి వివరణ కోరుతూ తొలుత షోకాజ్ నోటీసు ఇవ్వాలి. తప్పు జరిగిందని నిర్ధారణ అయితే క్షమాపణ కోరుతూ వివరణ ఇప్పించాలి. సంబంధిత అధికారికి చార్జ్‌మెమో ఇవ్వాలి. అయితే ఇవేవీ లేకుండా చాలా సాదాసీదాగా ఓ వివరణ ఇప్పించినట్లు తెలిసింది. విప్ పట్ల ఎలాంటి అగౌరవం, అమర్యాదగా ప్రవర్తించలేదనే అంశాన్ని అందులో ప్రస్తావించినట్లు తెలిసింది. దీనిపై అసెంబ్లీ కార్యదర్శి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ గనుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి మరో లేఖ రాసినట్లు తెలిసింది. "సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అంటే ఆషామాషీ అనుకుంటున్నారా? ఇది తీవ్రమైన విషయం. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా? ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అంటే లెక్కలేకుండా వ్యవహరించి, ఇప్పుడు అసలు ఏ తప్పూ జరగలేదని చెప్పడం దేనికి సంకేతం?" అని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన ద్వివేది తాజాగా వెంకటరెడ్డికి ఘాటుగా శ్రీముఖం పంపించినట్లు సమాచారం. 'సభాహక్కుల ఉల్లంఘన నోటీసు, ఇతర అంశాల్లో స్పందించిన తీరు బాగోలేదు. నోటీసుపై సత్వరమే స్పందించాలని కోరినా సరిగా వ్యవహరించలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిణికి షోకాజ్ నోటీసు ఎందుకు జారీ చేయలేదు? సాదాసీదాగా వివరణ తీసుకొని పంపిస్తే సరిపోతుందా?' అని ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పుడు ఈ వ్యవహారం ఏపీఎండీసీలో హాట్‌టాపిక్‌గా మారింది.



చంద్రబాబు నివాసం వద్ద ప్లకార్డులతో చింతలపూడి నియోజకవర్గ దళితుల సందడి

బాబు ఇంటికి బారులు

టీడీపీలో చేరేందుకు భారీగా తరలివస్తున్న నేతలు.. ఉండవల్లి కరకట్ట మార్గంలో వాహనాల రద్దీ

విజ్ఞప్తులతో వచ్చిన పలు నియోజకవర్గాల ఆశావహులు

చింతలపూడి స్థానంపై దళిత నేతల వినతి


చింతలపూడి రిజర్వుడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎంపికపై విజ్ఞప్తి చేసేందుకు పెద్ద సంఖ్యలో దళిత నేతలు చంద్రబాబు వద్దకు వచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు రిజర్వుడు నియోజకవర్గాల్లో కొవ్వూరు, గోపాలపురంలకు మాదిగ సామాజిక వర్గం నుంచి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నందున చింతలపూడి సీటును మాల వర్గానికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు సీట్లు ఒకే సామాజిక వర్గానికి ఇస్తే, రాజకీయంగా సరైన సంకేతాలు వెళ్లవని, సమతూకం పాటించాలని కోరగా, పరిశీలిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. రజక సంఘాల నేతలు కూడా చంద్రబాబును కలిసి తమ సమస్యలపై విజ్ఞప్తి చేశారు.

అమరావతి(ఆంధ్రజ్యోతి), తాడేపల్లి, ఫిబ్రవరి 15: వైసీపీని వీడి టీడీపీలో చేరడానికి వచ్చిన వారితో మాజీ సీఎం చంద్రబాబు నివాసం కిటకిటలాడింది. గురువారం ఇక్కడ పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోయాయి. చంద్రబాబు అనుకూల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొనడంతో ఆశావహులు భారీ బలగాలతో బాబు నివాసానికి వస్తున్నారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అట్లా చిన వెంకట రెడ్డి, సంతమాగులూరు ఎంపీపీ ఏసుబర్ల యలమంద భారీ ర్యాలీతో వచ్చి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరినీ అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తీసుకొచ్చారు. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గానికి చెందిన వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సూరా శ్రీనివాసుల రెడ్డి, బుచ్చిరెడ్డిపాలెం జడ్పీటీసీ సభ్యురాలు సూరా దీప, కౌన్సిలర్ అందె దీప, కర్నూలు నియోజకవర్గానికి చెందిన సీనియర్ మైనారిటీ నాయకుడు మహ్మద్ ఖానీ, వాసవీ పైపుల కంపెనీ అధినేత సత్రశాల జగన్నాథ్ గుప్తా, అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీపీ పుల్ల విజయా రెడ్డి, ఆవుల మనోహర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన కాటన్ బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు డాక్టర్ నీలకంఠారెడ్డితోపాటు వివిధ నియోజకవర్గాల నుంచి మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, సీనియర్ నేతలు భారీగా తరలివచ్చి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వారి వెంట ఆయా నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు అఖిలప్రియ, కందికుంట వెంకట ప్రసాద్, పోలంరెడ్డి దినేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



చంద్రబాబు నివాసం ఉన్న రోడ్డులో బారులుతీరిన వాహనాలు

జగన్ కుర్చీ గల్లంతే



- జాగ్రత్తగా ఉండు.. జగన్‌రెడ్డీ..
- ఎన్నికలంటే చొక్కాలు, కుర్చీలు మడతపెట్టడం కాదు: చంద్రబాబు

అమరావతి/ విజయవాడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): "రాబోయే ఎన్నికలకు వైసీపీ నేతలు, కార్యకర్తలు చొక్కాలు మడతపెట్టే సమయం వచ్చిందని సీఎం జగన్ అంటున్నాడు. నువ్వు, వైసీపీ వాళ్లు చొక్కాలు మడతపెడితే.. టీడీపీ కార్యకర్తలు, జనసైనికులు కుర్చీలు మడతపెడతారు. అందరం కుర్చీలు మడతపెడితే జగన్‌రెడ్డీ! నీకు కుర్చీ లేకుండా పోతుంది. ఖబడ్దార్.. జాగ్రత్తగా ఉండు. మంచికి కూడా హద్దులుంటాయ్.. పిచ్చికూతలు కూస్తే.. తగిన విధంగా సమాధానం చెప్పే ధైర్యం ప్రజలకు ఉంది" అని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. ఎన్నికలంటే చొక్కాలు, కుర్చీలు మడతపెట్టి కొట్టుకోవడం కాదని, ద్వంద్వయుద్ధమని హితవు పలికారు. సీనియర్ పాత్రికేయుడు ఆలపాటి సురేష్‌కుమార్ రాసిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం రాత్రి విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగింది. విశాలాంధ్ర సంపాదకుడు ఆర్వీ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు.. పుస్తకం తొలి కాపీని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. "జగన్ ప్రభుత్వంలో నేను, పవన్ సహా అందరూ బాధితులే. ఈ నియంత పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. మన బిడ్డల భవిష్యత్తు నాశనమైంది. ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తు విధ్వంసమైపోయింది. రాష్ట్రానికి ఉన్న బ్రాండ్ దెబ్బతింటే.. దానిని మళ్లీ సంపాదించుకోవడం చాలా కష్టం. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి రాజధానిని ధ్వంసం చేసి.. గత ఐదేళ్లుగా మూడు రాజధానులన్నారు. ఇప్పుడు నాలుగో రాజధాని (హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా) అంటున్నారు. పైగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి రాజధాని నగరం కావాలంటున్నారు. వీళ్లకు సిగ్గు ఎగ్గు ఉన్నాయా? ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నారో చూడండి. ఈ అరాచకానికి ఏం పేరు పెట్టాలో కూడా తెలియడం లేదు. జగన్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలను తరిమేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్. అమర్‌రాజా పరిశ్రమను తెలంగాణకు పారిపోయేలా చేశాడు. ఆ సంస్థ యజమాని, ఎంపీ గల్లా జయదేవ్ రాజకీయాల నుంచే దూరంగా వెళ్లిపోయారు. రాష్ట్రాన్ని, 5కోట్ల ప్రజల సంకల్పాన్ని కాపాడాలనే గట్టి సంకల్పంతో నేను, పవన్ ముందుకెళ్తున్నాం. అన్న క్యాంటీన్‌లు పెట్టి పేదలకు భోజనం పెడితే జగన్ భరించలేకపోయాడు. మాస్క్ అడిగినందుకు దళితుడైన డాక్టర్ సుధాకర్‌ను వేధించి, పిచ్చోడ్ని చేసి చివరకు పొట్టన పెట్టుకున్నారు. వైసీపీ నేతల వేధింపు కారణంగా నంద్యాలలో అబ్దుల్ సలీం కుటుంబ సభ్యులతో సహా బలవంతంగా చనిపోయారు. తన అక్కని వేధిస్తున్నారని ఫిర్యాదు చేసినందుకు అమర్నాథ్ గౌడ్ అనే బాలుడిని నడిరోడ్డులో పెట్రోలు పోసి కాల్చి చంపేశారు. గుంటూరులో శంకర్ విలాస్ రంగనాయకమ్మను వేధించి హైదరాబాద్‌కు పంపేశారు. చివరికి జగన్ సొంత చెల్లెలు, కన్న తల్లిని సోషల్ మీడియాలో ఏం చేస్తున్నారో చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరికైనా రక్షణ ఉందా? జగన్‌కు సంపాదనే ధ్యేయం. దానికి అడ్డం వస్తే పవనా.. చంద్రబాబా ఎవరైనా లెక్కలేదు. ఆయన బాటలోనే మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. చెడును నివారించడానికి ప్రజలందరూ నడుం బిగించాలి. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా చైతన్యవంతం కావాలి. ఈ ప్రభుత్వంపై తిరగబడతారా? బానిసలుగా ఉండిపోతారా? అనేది ప్రజలే తేల్చుకోవాలి. ఇక 54 రోజులే సమయం ఉంది. జగన్ లాంటి వ్యక్తులను రాజకీయాల నుంచి శాశ్వతంగా తరిమికొట్టాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను కళ్లకు కడుతూ 'విధ్వంసం' పేరుతో పుస్తకం రాసిన ఆలపాటి సురేష్‌ను ఆయన అభినందించారు. విప్లవాలు, పోరాటాలపై పుస్తకాలు రావడం చూశామని, పరిపాలనపై 'విధ్వంసం' పేరుతో పుస్తకం రావడం తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో మొదటిసారి చూస్తున్నానని చెప్పారు. 5కోట్ల ప్రజల మనసుల్లో ఉన్న మాటలకు రచయిత అక్షరరూపం ఇచ్చారని కొనియాడారు. ఈ పుస్తకం ప్రతి ఇంటికి, రచ్చబండ వద్దకు వెళ్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

> అలిపిరి ఘటనలో క్లెమోర్ మైన్లు పేలినప్పుడు కూడా నా కళ్లలో నీళ్లు రాలేదు. అసెంబ్లీలో జరిగిన అవమాన భారాన్ని భరించ లేక కన్నీళ్లు పెట్టుకున్నాను.
>
> పవన్ మీటింగ్ కోసం స్థలం ఇచ్చారనే కారణంతో ఇప్పటం గ్రామంలో రోడ్డు వెడల్పు పేరుతో గ్రామస్థుల ఇళ్లను కూల్చివేశారు. ఇలాంటి పనులు చేసి సమర్థించుకునే మనస్తత్వం ఎవరికైనా ఉంటుందా?
>
> నేను బాధపడుతూ ఉండాలనే ప్రజావేదికను కూల్చివేసిన శిథిలాలను ఇప్పటికీ తొలగించకుండా అలాగే ఉంచేశారు. ముఖ్యమంత్రిని ప్రజలందరూ సైకో అని పిలుస్తున్నారంటే.. అందులో ఎంత యథార్థం ఉందో అర్థమవుతుంది.
>
> మద్యం, ఇసుక, మైనింగ్.. రాష్ట్రంలో ఏది దొరికితే దానిని మొత్తం దోచేస్తున్నారు. ప్రజలకు ఏదైనా సమస్య వస్తే ప్రభుత్వం వద్దకు వెళ్తారు. ప్రభుత్వమే సమస్య అయితే ఎవరి వద్దకు వెళ్లాలి?
>
> \- చంద్రబాబు

క్లాస్‌వార్‌పై బలమైన పాఠం చెబుతాం

- వలంటీర్ల గురించి తప్పుగా మాట్లాడలేదు : పవన్
- 33వేల మంది ఆడపిల్లలు అదృశ్యమవడం నిజమైంది
- 'విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో జనసేనాని

విజయవాడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): క్లాస్‌వార్ గురించి సీఎం జగన్‌కు భవిష్యత్తులో చాలా బలమైన పాఠం చెబుతామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ విషయాన్ని జగన్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. భవిష్యత్తులో జగన్‌ను కాలరాస్తామని స్పష్టం చేశారు. పాత్రికేయుడు ఆలపాటి సురేష్‌కుమార్ రాసిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. ఒకే కంపెనీకి ఇసుక రీచ్‌లను ధారాదత్తం చేసిన వ్యక్తి క్లాస్‌వార్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వలంటీర్ల గురించి తాను తప్పుగా మాట్లాడలేదని.. వారంతా తప్పులు చేశారని అనలేదని, కొందరు చేసిన పనులను ప్రస్తావించానని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వలంటీర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 33వేల మంది ఆడపిల్లలు అదృశ్యమయ్యారని తాను చెబితే మొదట్లో ఎవరూ నమ్మలేదన్నారు. కేంద్రం హోంశాఖ చెప్పిన తర్వాత తన మాటలను విశ్వసించారని, ఇప్పుడు ఇదే నిజాన్ని సీఎం జగన్ చెప్పారని తెలిపారు. కూల్చివేతలతో మొదలైన ప్రభుత్వం కూలిపోతుందన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనివ్వనన్న మాటకు ప్రత్యక్ష నిదర్శనమే 'విధ్వంసం' పుస్తకమన్నారు.

జగన్‌ను 100 ఏళ్ల జైల్లో పెట్టాలి: సీపీఐ రామకృష్ణ

రాష్ట్రంలో రూ.వేల కోట్ల లిక్కర్ కుంభకోణం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చేసిన ఫిర్యాదు ఏమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ఆమె నేరుగా కేంద్ర హోంమంత్రికి ఈ ఫిర్యాదు చేశారన్నారు. ఢిల్లీలో రూ.100కోట్ల స్కాం జరిగిందని అక్కడి మంత్రి మనీష్ సిసోదియాను ఏడాదిగా జైలులో పెడితే, వేల కోట్ల స్కాం చేసిన జగన్‌ను 100 ఏళ్ల జైల్లో పెట్టాలన్నారు. సురేష్‌కుమార్ రాసిన పుస్తకాన్ని పదవి పోయిన తర్వాత జగన్ చదివితే తాను ఇన్ని పాపాలు చేశానా అని పశ్చాత్తాపపడతారని చెప్పారు. కాగా, ఈ సభలో 'మనం- మన రాజధాని- మన రాష్ట్ర భవిష్యత్తు' లోగోను చంద్రబాబు ఆవిష్కరించారు. దీన్ని రూపొందించిన మహిళను అభినందించారు.

చంద్రబాబు సభపై పోలీసుల రుబాబు..!

- రేపు బాపట్ల జిల్లా ఇంకొల్లులో 'రా..కదలిరా' సభ
- భగ్నం చేసేందుకు వైసీపీ కుట్ర
- సభా ప్రాంగణం వద్ద పోలీసుల హడావుడి



ఇంకొల్లు సభా ప్రాంగణంలో టీడీపీ నేతలతో చర్చిస్తున్న పోలీసులు

బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): దాదాపు 18 ఎకరాల దేవదాయశాఖ విభాగానికి సంబంధించిన పొలం ఓ రైతు కౌలు అగ్రిమెంట్‌లో ఉంది.. మరో ఏడాది పాటు లీజుకు అనుమతి కూడా ఉంది... అంటే అప్పటి వరకు ఆ భూమిపై సర్వ హక్కులూ ఆయనవే..! ఆ పొలాన్నే శనివారం బాపట్ల జిల్లా ఇంకొల్లులో టీడీపీ అధినేత చంద్రబాబు పాల్గొనే 'రా... కదలిరా' సభ కోసం సదరు రైతు స్వచ్ఛందంగా ఇచ్చారు. జిల్లా పోలీస్, ఆర్ అండ్ బీ విభాగాలకు ఇతర అనుమతుల కోసం ఇప్పటికే టీడీపీ నేతలు దరఖాస్తు చేసి ఉన్నారు. ఎక్కడా నిబంధనల అతిక్రమణ జరగలేదు. ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. అంతే... ఏదో ఒక విధంగా ఏర్పాట్లకు అడ్డు తగలాలని తాడేపల్లి పెద్దల నుంచి బుధవారమే ఖాకీలకు ఆదేశాలందాయి. వెంటనే రంగప్రవేశం చేసిన ఖాకీలు సభకోసం సిద్ధం చేస్తున్న స్థలానికి సంబంధించి ఎలాంటి అనుమతులూ లేవంటూ రుబాబు మొదలుపెట్టారు. బుధవారం రాత్రి మొదలైన ఈ హైడ్రామాను గురువారం ఉదయం కూడా కొనసాగించారు. స్థలం దేవదాయ శాఖ పరిధిలోకి వస్తుందని, అనుమతి లేదని వారే ఫిర్యాదు చేశారంటూ.. రాత్రిపూట సభా ప్రాంగణానికి వచ్చిన ఖాకీలు ఏర్పాట్లు ఆపేయాలనే హుకుం జారీచేశారు. టీడీపీ శ్రేణులను ఇంకొల్లు స్టేషన్‌కు వచ్చి సీఐతో మాట్లాడుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. అక్కడకు వెళ్లిన టీడీపీ నేతలకు పోలీస్ అధికారులెవరూ అందుబాటులో లేకపోవడంతో వారు వెనుదిరిగారు. గురువారం ఉదయం కూడా పది మంది పోలీసులు సభస్థలి వద్దకు వచ్చి అనుమతుల పేరిట హడావిడి చేశారు.

కుట్రకాక మరేమిటీ...!

దేవదాయశాఖకు చెందిన దాదాపు 18 ఎకరాల భూమిని ఇంకొల్లుకు చెందిన ఓ రైతు కౌలుకు సాగు చేసుకుంటున్నారు. లీజు అనుమతులు మరో ఏడాది పాటు సదరు రైతు పేరిటే ఉన్నాయి. అతనే స్వచ్ఛందంగా చంద్రబాబు సభ నిర్వహించుకోవడానికి టీడీపీ నేతలకు అంగీకారం తెలుపుతూ రాతపూర్వకంగా రాసిచ్చారు. సాంకేతికంగా ఆ భూమి దేవదాయశాఖదే అయినా కౌలు అగ్రిమెంట్ ఉన్నందున అది ముగిసే వరకూ సర్వహక్కులు ఆ భూమిపై రైతుకే ఉంటాయి. కానీ ఆ భూమి కేవలం సాగుకే రైతుకు లీజుకు ఇచ్చారట. సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి కాదని దేవదాయశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసిందట. ఆ కాపీ చూపమంటే చూపరు. ఆ భూమి దేవదాయశాఖది అయినప్పుడు అసలు పోలీసులకేం పని అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇది పక్కాగా సివిల్ అంశం. పోలీసులు ఎందుకింత అత్యుత్సాహం చూపిస్తున్నారంటే కేవలం పాలకపార్టీ మెప్పు కోసమే తప్ప మరోటి కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లా పోలీసులతో పాటు ఆర్ అండ్ బీ విభాగానికి అనుమతుల కోసం టీడీపీ నేతలు మూడు రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా వాటి మీద ఎలాంటి జవాబు సదరు విభాగాలు ఇవ్వకపోవడం వెనక పాలకపార్టీ ఒత్తిళ్లే కీలకంగా పనిచేస్తున్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. కాగా.. ఇంకొల్లులో 5 ఎకరాల ఆర్టీసీ భూమిని పార్కింగ్‌కు వాడుకునేందుకు ఆర్టీసీ అధికారులను టీడీపీ నేతలు అనుమతి కోరారు. రెండు రోజులు అంతా శుభ్రం చేసే వరకు మిన్నకున్న ఆర్టీసీ అధికారులు.. గురువారం రంగంలోకి దిగారు. ఒంగోలు నుంచి డీఈ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సుబ్బారావు తమ సిబ్బందితో ఇంకొల్లులో మకాం వేశారు. సాయంత్రానికి లోపలికి ప్రవేశించే దారి వద్ద ఫెన్సింగ్ రాళ్లు తెచ్చిపెట్టారు. శుక్రవారం తీగ తెచ్చి ఫెన్సింగ్ వేసి దారులు మూసేందుకు సిద్ధమయ్యారు.

వ్యవస్థల దుర్వినియోగానికి పరాకాష్ఠ...

'రా... కదలిరా' సభను భగ్నం చేయాలనే కుట్రకు వైసీపీ తెరలేపిందని, విచ్చలవిడిగా వ్యవస్థల దుర్వినియోగానికి పాల్పడుతోందని బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని పోలీసులకు హితవు చెప్పారు. అధికార పార్టీ ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు సభను విజయవంతం చేసి తీరుతామని ఎమ్మెల్యేలు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.



శ్రీసత్యసాయి జిల్లా దిన్నెహట్టిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

వైసీపీని ఇంటికి సాగనంపండి


- ప్రజలకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పిలుపు
- శ్రీసత్యసాయి జిల్లాలో 'నిజం గెలవాలి' యాత్ర
- రెండు కుటుంబాలకు పరామర్శ

పుట్టపర్తి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో ఇంటికి సాగనంపాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రజలకు పిలుపునిచ్చారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా ఆమె గురువారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం, మడకశిర నియోజకవర్గాలలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. హిందూపురంలో టీడీపీ కార్యకర్త అంజనప్ప, గుడిబండ మండలం దిన్నెహట్టిలో ముత్తప్ప కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అనంతరం దిన్నెహట్టి గ్రామంలో ప్రజలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలవాలని వైసీపీ కుట్రలు చేస్తోందని, ఓటరు జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతోందని భువనేశ్వరి చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క పరిశ్రమ రాలేదని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. చంద్రబాబును అక్రమంగా 53 రోజులు జైల్లో పెట్టారని, కానీ, అంతిమంగా నిజమే గెలిచిందని చెప్పారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఒక్కటే మార్గమన్నారు. అనంతపురం జిల్లా శింగనమలకు చెందిన టీడీపీ కార్యకర్త హేమంత్ యాదవ్, శోభా యాదవ్ దంపతులు తమ బిడ్డకు నామకరణం చేయాలని ఈ సందర్భంగా భువనేశ్వరిని కోరారు. ఆమె ఆ పసిబిడ్డను చేతుల్లోకి తీసుకుని కుశల్ కృష్ణ అని నామకరణం చేశారు. అనంతరం ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు.

ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మె తప్పదు

- 27న 'చలో విజయవాడ'కు వేలాదిగా తరలివస్తాం: బండి శ్రీనివాసరావు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు


ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీజేఏసీ చేపట్టిన ఉద్యమ కార్యాచరణ రెండో రోజుకు చేరుకుంది. ఈమేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన సమయంలో కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో నిరసనలు తెలిపారు. తాలుకా, మండల, జిల్లా కేంద్రాల్లోనూ నిరసనలు తెలిపారు. కర్నూలు జిల్లా ఏపీజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 27న లక్ష మందితో 'చలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. విశాఖపట్నంలో ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. ఏపీ జేఏసీ విశాఖ జిల్లా చైర్మన్ కె.ఈశ్వరరావు, కన్వీనర్ ఆర్.రవిశంకర్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు సిద్ధం

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి.. ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్న ఏపీసీపీఎస్‌ఈఏ... 'ఓట్ ఫర్ ఓపీఎస్' అంటూ ఈ నెల 18న చలో విజయవాడకు పిలుపు నిచ్చింది. ఏపీసీపీఎస్‌ఈఏ పిలుపుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు చలో విజయవాడకు సన్నద్ధం అవుతున్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ ఫర్ ఓపీఎస్' పోస్టర్లను ఆవిష్కరించారు. కృష్ణా జిల్లా ఉంగుటూరులో ఏపీసీపీఎస్‌ఈఏ ప్రధాన కార్యదర్శి సీఎం దాస్ పోస్టరును ఆవిష్కరించారు.

ఇండోసోల్‌కు రాయితీతో రాష్ట్రంపై 23 వేల కోట్ల భారం

- ఆ కంపెనీ పుట్టుకే అవినీతిమయం: ఎంపీ బాలశౌరి



అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజల నడ్డివిరుస్తోందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి ధ్వజమెత్తారు. గురువారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. 'శ్రీ షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు అనుబంధంగా ఉన్న ఇండోసోల్ కంపెనీకి విద్యుత్తు రాయితీ ఇవ్వడం వల్ల ఒక ఏడాదికే రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు రూ.23 వేల కోట్ల భారం పడింది. ఇప్పటికే పేదలు వినియోగించుకునే విద్యుత్ చార్జీలను ఏడు సార్లు ఈ ప్రభుత్వం పెంచింది. ఈ క్రమంలో బడాబాబులు నడిపే కంపెనీలకు రాయితీపై విద్యుత్తును ఎందుకు సరఫరా చేస్తుందో తెలియజేయాలి. ఇండోసోల్ కంపెనీ మొత్తం పెట్టుబడి రూ.లక్ష మాత్రమే. కానీ ఈ కంపెనీకి ఇస్తున్న విద్యుత్ రాయితీ విలువ మాత్రం రూ.23 వేల కోట్లు. ఇండోసోల్ కంపెనీని 2022లోనే స్థాపించారు. మూలధనం కేవలం రూ.లక్ష ఉన్న కంపెనీకి ప్రభుత్వం ఇన్ని సదుపాయాలు కల్పిస్తోంది అంటే ఈ కంపెనీ పుట్టుకే అవినీతి మయం. ప్రకాశం జిల్లాలో ఎంతో ఖరీదైన 11 క్వార్ట్జ్ గనులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం ఆశ్చర్యం కలిగించింది. అదేవిధంగా ఈ కంపెనీకి రామాయపట్నంలో ఇప్పటికే దాదాపు 5,000 ఎకరాలు కేటాయించింది. మరో 3,000 ఎకరాల భూమిని తక్కువ ధరలకు ధారాదత్తం చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి ఇవ్వని విద్యుత్ రాయితీలు, బడాబాబులు నడిపే ఇండోసోల్ వంటి కంపెనీలకు ఇవ్వడం మోసం చేయడం కాదా' అని బాలశౌరి అన్నారు.



విజయవాడలోని స్వర్ణ ప్యాలెస్‌లో ఖాళీ కుర్చీలు

ఖాళీ 'యాత్ర'

▸▸ **థియేటర్లలో ఖాళీగా దర్శనమిస్తున్న సీట్లు**

▸▸ **అయినా ప్రదర్శనలు కొనసాగించాలని ఒత్తిళ్లు**

విజయవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ బయోపిక్‌గా రూపొందించిన 'యాత్ర 2' చిత్రం ప్రదర్శిస్తున్న థియేటర్లలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. థియేటర్లలో ప్రేక్షకులు వరుసకు ఒకరు చొప్పున కూడా లేకున్నా సినిమాను తప్పక ప్రదర్శించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అధికార వైసీపీకి చెందిన కొందరు పెద్దల ఒత్తిడితో ఈ పరిస్థితి దాపురించిందని ఎగ్జిబిటర్లు వాపోతున్నారు. 'యాత్ర 2'న ఈనెల 8న విడుదల చేశారు. తొలిరోజున వైసీపీ ప్రజాప్రతినిధులకు ఉచిత ప్రదర్శన వేయించారు. తర్వాత కొంత మంది ద్వితీయ శ్రేణి నేతలు తమ అనుచరులకు చిత్రాన్ని ఉచితంగా చూపించారు. ఇప్పుడు థియేటర్ల వద్ద ఉచితంగా టికెట్ ఇస్తేనే వెళ్లే పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం 31 థియేటర్లలో, విజయవాడలో 14 స్క్రీన్లు, థియేటర్లలో ప్రదర్శిస్తున్నారు. కలెక్షన్లతో సంబంధం లేకుండా చిత్రాన్ని ప్రదర్శించాలని ప్రభుత్వంలోని కొంతమంది పెద్దలు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మీద ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. ఈ కారణంగా ప్రదర్శనకు రూ.2-3వేల వరకు కలెక్షన్ మాత్రమే ఉంటోంది. కనీసం అద్దె అయినా వస్తుందా అని ఆరా తీస్తే ఆ విషయం డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ చూసుకుంటారని సమాధానం వస్తోంది.

సదుద్దేశంతోనే పిల్ వేశాం

▸▸ **సీఎం హోదా జగన్ దుర్వినియోగం: రఘురామ తరపు న్యాయవాది**

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్, ఆయన ఆప్తులకు అనుచిత లబ్ధి చేకూర్చేలా వైసీపీ ప్రభుత్వం రూపొందించిన వివిధ పాలసీలు, తీసుకున్న నిర్ణయాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్ విచారణార్హతపై గురువారం హైకోర్టులో ప్రాథమిక వాదనలు ప్రారంభమయ్యాయి. ఎంపీ తరఫున సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ... విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సదుద్దేశంతోనే ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశామని, ఇందులో ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు. వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్న కంపెనీలు, వ్యక్తులతో సీఎంకు ఉన్న సంబంధాలనువివరించారు. సీఎం హోదాను దుర్వినియోగం చేస్తూ జగన్ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిర్ణయాల్లో పారదర్శకత లేదన్నారు. నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకోకుండా ఐఏఎస్ అధికారులు సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ పిల్ విచారణార్హతపై ముందుగా తమ వాదనలు వినాలని అభ్యర్థించారు. తాము లేవనెత్తిన అభ్యంతరాలపై పిటిషనర్ వాదనలు వినిపిస్తే సరిపోతుందన్నారు. వ్యక్తిగత కారణాలతో ముఖ్యమంత్రిపై విషం చిమ్మేందుకే పిటిషన్ వేశారన్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌ను అనుసరించి పిటిషనర్‌ను లోకసభ సభ్యత్వానికి అనర్హుడిగా ప్రకటించాలని వైసీపీ వేసిన పిటిషన్ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని డిక్లరేషన్‌లో పేర్కొనలేదన్నారు. ఈ దశలో ధర్మాసనం కలగజేసుకుంటూ విచారణను కొనసాగించడానికి కోర్టుకు సమర్పించిన వీడియోల్లో ఉన్న వివరాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయడింది. విచారణను మార్చి 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం గురువారం ఆదేశాలిచ్చింది.

మీరే యుద్ధం చేయాలి

▸▸ **'వలంటీర్లకు వందనం'లో జగన్**





ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తుండగానే ఖాళీ అయిన గ్యాలరీలు

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వలంటీర్ల వ్యవస్థను ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే తీసుకొచ్చినట్లు సీఎం జగన్ పరోక్షంగా అంగీకరించారు. జన్మభూమి కమిటీల కారణంగా టీడీపీ అధికారం కోల్పోతే వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతీ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నామని చెప్పడానికి గర్వపడుతున్నానని పేర్కొన్నారు. వలంటీర్లని తన పార్టీ కార్యకర్తల మాదిరిగా భావిస్తూ హితబోధ చేశారు. రాబోయే రెండు నెలలు వలంటీర్లు చేసే యుద్ధం పైనే తన ప్రభుత్వ సౌధం నిలబడుతుందన్నారు. ప్రతీ వలంటీర్ తన క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందినవారిని ఎన్నికల్లో తన పార్టీకి ప్రచారం చేసేలా చూడాలని సూచించారు. వలంటీర్లు వైసీపీకి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని కోరారు. గురువారం సాయంత్రం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామ, వార్డు వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలు ప్రదానం చేశారు. ఇది ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంగా కాగా సీఎం జగన్ మాత్రం రాజకీయ ప్రసంగానికే ప్రాధాన్యం ఇచ్చి, తన సొంత వైసీపీ కార్యక్రమంలా నిర్వహించారు. ఒకవిధంగా ఎన్నికల ప్రచార కార్యక్రమంలా దీనిని ఉపయోగించుకొన్నారు. తన జెండాని అజెండాగా తీసుకొని త్రికరణ శుద్ధితో పని చేస్తున్నందుకు బహుమతిగా ఈ పురస్కారాలు ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2.60లక్షల మంది వలంటీర్ల సైన్యం ఉందని, ఆ సైన్యాన్ని చూస్తే ప్రతిపక్షాలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయని చెప్పారు. టీడీపీని అధికారం నుంచి దించడానికి జన్మభూమి కమిటీలే కారణమైతే, తాను ఏర్పాటుచేసిన వలంటీర్ల సైన్యం.. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థతో అనుసంధానమై ప్రతీ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయానికి కారణమవుతోందని తెలిపారు. 2024 ఎన్నికల్లో కూడా తన ప్రభుత్వ జైత్రయాత్రకు వలంటీర్లు దారులు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలు, మీడియాపై పాత పాటే

తాను ఒక్కడినే ఒకవైపు, చంద్రబాబు, మీడియా, దత్తపుత్రుడు, ప్రత్యక్షంగా సహకరించే ఒక జాతీయ పార్టీ, పరోక్షంగా సహకరించే మరో జాతీయ పార్టీ ఒకవైపు అంటూ సీఎం జగన్ పాత పాటే అందుకొన్నారు. వాళ్ల పోరాటం చేస్తున్నది తన ఒక్కడి మీద అనుకొంటున్నారని, అయితే తనకు 2.60లక్షల మంది వలంటీర్ల సైన్యం ఉందన్న విషయాన్ని మరిచిపోతున్నారని చెప్పారు. ప్రతిపక్షాలకు ఉన్నట్లుగా తనకు పేపర్లు, టీవీ చానెళ్లు లేవని అబద్ధమాడారు. చంద్రబాబుని చంద్రముఖితో పోలుస్తూ... టీడీపీకి ఓటు వేయడం అంటే ఐదేళ్ల క్రితం వదిలించుకొన్న దానిని తిరిగి ఇంట్లోకి తెచ్చుకోవడమేనన్నారు. సంక్షేమం కోసం ఏటా తాను రూ.70వేల కోట్లు విడుదల చేస్తున్నానని, అందులో రూ.52వేల కోట్ల పథకాలను ఎవరూ తాకలేరన్నారు. ఇప్పుడు చంద్రబాబు చెబుతున్న ఆరు పథకాలకు రూ.70వేల కోట్లు అవసరమని, ఆ విధంగా చూసుకొంటే రూ.1.20 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు హైదరాబాద్‌లో కూర్చుని కాలు బయట పెట్టకుండా ఇతర రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందిన పథకాలను కిచిడీ చేసి మేనిఫెస్టోగా విడుదల చేస్తున్నారని జగన్ విమర్శించారు. కాగా, రాజధానిలో భూమి లేని పేదలకు ఇస్తున్న పెన్షన్‌ను రెట్టింపు చేయమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత విజ్ఞప్తి చేయగా అందుకు సీఎం జగన్ వచ్చేనెల నుంచే మార్పు చూస్తారని ప్రకటించారు. ఫిరంగిపురంలోని కార్మెల్ మాత కొండపైకి రూ.39కోట్లతో ఘాట్‌రోడ్డు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం జగన్ సభ అంటే ఆర్టీసీ ప్రయాణికులకు మొన్నటి వరకు ప్రయాణ కష్టాలు ఉండేవి. ఇప్పుడు వారి జేబుకు చిల్లు కూడా పెడుతున్నారు. సభ పేరుతో బస్సులు దారి మళ్లించి అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. ఫిరంగిపురంలో సీఎం సభ కారణంగా నరసరావుపేట, వినుకొండ సర్వీసులను దారి మళ్లించారు. పెరిగిన దూరం భారాన్ని ప్రయాణికుల నుంచి ముక్కుపిండి వసూలు చేశారు. జగన్ సభను విజయవంతం చేసేందుకు కాలేజీలు, స్కూళ్ల యాజమాన్యాల నుంచి ప్రైవేటు వాహనాలు సమీకరించి వాటిల్లో లబ్ధిదారులను తరలించారు. వాటికి ఇంధనం కొట్టించే బాధ్యతను ఆయా నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ తహసీల్దార్లకు అప్పగించారు.

గంటల తరబడి ట్రాఫిక్ జామ్

తెనాలి రూరల్: సీఎం సభకు జనాన్ని తరలించే క్రమంలో ప్రయాణికులకు నరకం చూపించారు. వేమూరు నియోజవర్గం నుంచి వలంటీర్లను సభా ప్రాంగణానికి తరలించే క్రమంలో తెనాలి మండలం అంగలకుదురు-సంగంజాగర్లమూడి మధ్యలో వారికి విందు ఏర్పాటు చేశారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై వలంటీర్లు వచ్చిన వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



సీఎం జగన్ మీటింగ్‌కు రాకముందే వెళ్ళిపోతున్న జనాలు

సీఎం ప్రసంగం ప్రారంభం.. జనం పరార్

పేరుకు వలంటీర్ల కార్యక్రమం అయినప్పటికీ గుంటూరు జిల్లా నలుమూలల నుంచి ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు పెట్టి జనాన్ని సీఎం సభకు తరలించారు. ఉదయం 9గంటలకే వారిని తీసుకొచ్చి ఎండలో కూర్చోబెట్టారు. జగన్ హెలికాప్టర్ దిగి బస్సులో ప్రాంగణానికి వెళ్లేటప్పుడు అభివాదం చేయాలని చెప్పారు. ఎండ వేడిమికి తట్టుకోలేక చాలామంది పక్కన ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ఫిరంగిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో తలదాచుకొన్నారు. పొన్నూరు నుంచి తీసుకొచ్చిన మహిళలకు భోజనం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావడంతో అప్పటికే గంటల తరబడి నిరీక్షించిన ప్రజలు సీఎం ప్రసంగం ప్రారంభం కాగానే బ్యారికేడ్లు తోసుకొంటూ బయటకు వెళ్లిపోయారు. దీంతో సభా ప్రాంగణం వెలవెలబోయింది.



సంఘటనా స్థలంలో గాయాలతో పాశం రాజు, గాజుల అంజయ్య

బైక్‌తో ఢీకొట్టి.. వెంటాడి.. వేటాడి!

▸▸ **టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి.. ముగ్గురు కార్యకర్తలకు గాయాలు**

దుర్గి, ఫిబ్రవరి 15: వైసీపీ కార్యకర్తల దాడిలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు గాయపడిన సంఘటన పల్నాడు జిల్లా దుర్గి శివారులో గురువారం జరిగింది. గత ఎన్నికల అనంతరం జంగమహేశ్వరపురంలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో టీడీపీ కార్యకర్తలు గుమ్మా శ్రీను, గాజుల అంజయ్య, పాశం రాజు గ్రామం వదిలి వెళ్లిపోయారు. వీరు గురువారం కారంపూడి సమీపంలోని మంత్రాలమ్మ గుడి వద్ద తమ బంధువుల శుభకార్యానికి హాజరై, తిరిగి బైకుపై వెళుతుండగా వైసీపీ కార్యకర్తలు వారిని వెంబడించారు. దుర్గి శివారులోని ముటుకూరు రోడ్డు వద్దకు రాగానే బైక్‌ను ఆటోతో ఢీకొట్టారు. వారు కిందపడిపోగానే కర్రలు, రాడ్లతో దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలు పొలాలవైపు పరుగులు పెట్టగా.. వారిని తరుముతూ వెళ్లి దాడి చేశారు. కారంపూడి సీఐ చిన మల్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని గాయాలతో ఉన్న గాజుల అంజయ్య పాశం రాజులను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు, గుమ్మా శ్రీనును స్థానిక పీహెచ్‌సీకి తరలించారు.

హైస్కూలు ఆక్రమించి.. పెళ్లి వేదికగా మార్చేసి..

▸▸ **వైసీపీ నేత బరితెగింపు.. క్లాసులకు ఇబ్బందులు.. నేడు పాఠశాలకే సెలవు**



జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌లు

గుంటూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కారంపూడిలోని జడ్పీ హైస్కూల్‌ను ఓ వైసీపీ నేత పెళ్లి వేడుకకు వేదికగా మార్చేశారు. వైసీపీకి చెందిన మార్కెట్ యార్డు డైరెక్టర్ కుటుంబానికి చెందిన వారి వివాహం రెండు రోజుల కిందట జరిగింది. రిసెప్షన్ వేడుకను శుక్రవారం హైస్కూల్ ప్రాంగణంలో జరపతలపెట్టారు. ఈమేరకు రెండు రోజుల నుంచి ప్రాంగణంలో భారీఎత్తున సెట్టింగ్‌లు వేస్తున్నారు. దీంతో తరగతుల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఇక శుక్రవారం ఈ వేడుక కోసం పాఠశాలకు సెలవు ప్రకటించేశారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. హెచ్‌ఎం అనంత శివను ప్రశ్నిస్తే.. తన అనుమతి లేకుండా భారీ సెట్టింగ్‌లు వేస్తున్నారని, చెప్పినా వినడం లేదని వాపోయారు.

సీఎం సీట్లో అమర్నాథ్.. సీఎంవో చీవాట్లు!

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వెలగపూడి సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చుని మంత్రి గుడివాడ అమర్నాథ్ సమీక్ష జరపడాన్ని సీఎం కార్యాలయం (సీఎంవో) తీవ్రంగా పరిగణించింది. ముఖ్యమంత్రి ఆ కుర్చీలో కూర్చోనప్పటికీ.. ఆ స్థానానికి విలువ ఇవ్వాల్సిందే. కానీ దానిని పాటించకుండా అమర్నాథ్ అదే చైర్‌లో కూర్చుని మంగళవారం ఓ పరిశ్రమకు ఆన్‌లైన్‌లో శంకుస్థాపన చేశారు. దీనిని మర్నాడు టీడీపీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర వేలెత్తిచూపడంతో పెద్ద దుమారమే రేగింది. సీఎం స్థానానికి గౌరవం ఇవ్వని మంత్రి అమర్నాథ్‌ను మందలించడం మాటెలా ఉన్నా.. ఈ ఫొటోలు బయటకు వచ్చినందుకు జీఏడీ అధికారులపై సీఎంవో మండిపడింది. గురువారం వారిని పిలిచి చీవాట్లు పెట్టింది. సాక్షాత్తూ మంత్రే వచ్చి దర్జాగా కూర్చుంటే తామెలా కాదనగలమని వారిచ్చిన వివరణతో సీఎంవో సంతృప్తి చెందలేదు. సీఎం లేని సమయంలో పరాయి వ్యక్తులు వచ్చి ఆయన సీటులో కూర్చోవడం ఇదే తొలిసారి కాదు. గతంలో 'టిక్‌టాక్' చేసే దుర్గారావు కూడా ఖాళీగా కనిపించిందని సీఎం కుర్చీలో కూర్చుని ఫొటోలకు పోజులిచ్చారు. ఈ ఫొటోలు బయటకు వచ్చినా సీఎంవో పట్టించుకోలేదు.

సొంత చెల్లిపైనే అసభ్య దాడి!

▸▸ **పేటీఎం కుక్కలతో జగనే చేయిస్తున్నారు: లోకేశ్**

విజయనగరం/శ్రీకాకుళం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): జగన్ అరాచక, దోపిడీ పాలన, కక్ష సాధింపు చర్యలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎండగడుతున్నారని.. దీనిని జీర్ణించుకోలేకనే ఆయన తన సోషల్ మీడియా పేటీఎం బ్యాచ్ ద్వారా అసభ్యకర దాడి చేయిస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ధ్వజమెత్తారు. పాదయాత్రలో, ఎన్నికల ప్రచారంలో తల్లిని.. చెల్లిని వాడుకుని.. అధికారంలోకి వచ్చాక పట్టించుకోని కారణంగానే షర్మిల జగన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన విజయనగరం జిల్లా రాజాం, చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరులో జరిగిన సభల్లో ప్రసంగించారు. షర్మిల పుట్టుక నుంచి వివాహం వరకు వైసీపీ పేటీఎం బ్యాచ్ సోషల్ మీడియాలో పోస్టింగులు పెడుతుంటే జగన్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. 'పేటీఎం బ్యాచ్ వివరాలు కూడా నేను రెడ్ బుక్‌లో రాస్తున్నాను. రెండు మాసాల్లో వారికి వడ్డీతో కలిపి చెల్లిస్తాం' అని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ గుర్తుకు కరెంట్ షాక్ ఖాయమన్నారు. ఇంకా ఏమన్నారంటే..

> సజ్జల అంటేనే బ్రోకర్. ఆయనకు మంగళగిరి, పొన్నూరుల్లో రెండు చోట్లా ఓట్లు ఉన్నాయి. ఇక సాధారణ పౌరుల పేరుతో ఎన్ని దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలు సృష్టించారో లెక్కేలేదు.
>
> ఎక్కడ చూసినా 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ బోర్డులు కన్పిస్తున్నాయి. ఇది చూస్తే నాకు నవ్వొస్తోంది. సొంత తల్లి, చెల్లికే జగన్‌పై నమ్మకం లేదు. మరి ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? - లోకేశ్

జగన్ 420.. సజ్జల 840...

జగన్ 420 అయితే అతని సలహాదారు సజ్జల 840గా గుర్తింపు పొందారు. జగన్ దొంగ ఓట్లు, నకిలీ ఓట్లను సృష్టిస్తున్నారని మొదటి నుంచీ ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తూనే ఉన్నాం. తిరుపతి ఉప ఎన్నికలో దొంగ ఓట్లతో గెలిచారు. తన అరాచక పాలనను ప్రశ్నించే వారిపై జగన్ తప్పుడు కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో అరాచకాలు ఎక్కువయ్యాయి. మేం భయం లేకుండా ప్రజలతో మమేకం అవుతున్నాం. జగన్ భయంతో పరదాల చాటున బతుకుతున్నారు. రాష్ట్రంలో అతి చెత్త కేబినెట్ ఉంది. ఒకరు అప్పుల అప్పారావు బుగ్గన (రాజేంద్రనాథ్‌రెడ్డి). ఎప్పుడు చూసినా అప్పుల కోసం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఇంకొకరు ఇసుక మాఫియా డాన్ పెద్దిరెడ్డి (రామచంద్రారెడ్డి).. మరొకరు నకిలీ మద్యం డాన్ కాకాణి (గోవర్ధన్ రెడ్డి). చుక్క సాగునీరు అందించలేని అసమర్థ మంత్రి అంబటి రాంబాబు. రైతులు పండించే దిగుబడుల ధాన్యాన్ని కొనుగోలు చేయలేని 'ఎర్రిపప్ప' (కారుమూరి) నాగేశ్వరరావు. గుడ్డు ముందా కోడి ముందా అంటూ గుడ్డుపై వెంట్రుకలు పీకే పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్. కుటుంబ పాలనతో ఉత్తరాంధ్రను దోచుకు తింటూ అవినీతి కేన్సర్ గడ్డ కట్టిన బొత్స సత్యనారాయణ. ఇదీ అసమర్థ కేబినెట్‌లో మంత్రుల పరిస్థితి. బొత్స కుటుంబానికి పట్టిన అవినీతి కేన్సర్ గడ్డకు ప్రజలే రేడియేషన్ చికిత్స చేయాలి. ఓటు ద్వారా బుద్ధి చెప్పి కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి.

న్యాయ విచారణ చేయిస్తాం..

రాష్ట్రంలో అరాచకపాలన, భూ కబ్జాలు, ఇసుక మాఫియా, గనుల మాఫియా, కక్ష సాధింపులు, తప్పుడు కేసులపై.. అధికారంలోకి రాగానే న్యాయ విచారణ చేయిస్తాం. సీనియర్ మంత్రి బొత్స.. అవినీతిలో కూరుకుపోయిన కారణంగానే జగన్ వద్ద మాట్లాడలేక పోతున్నారు. రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా ఇంత లోతు గోతులు.. నడి రోడ్డుపై స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేయాలని జగన్ అనుకుంటున్నారు. ఆ మధ్య రోడ్లపై తిరగాలని జగన్‌కు సజ్జల సలహా ఇచ్చా రు. దీంతో ఆయన సజ్జలను రెండు పీకి.. ఆంధ్రాలో రోడ్లపై తిరిగితే ఆరోగ్యకరం కాదని తెలుసుకదా అన్నారంట! జగనన్న కాలనీల భూ సేకరణలో రూ.7 వేల కోట్లు అవినీతి జరిగింది. మరో 2నెలల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం వస్తుంది. భోగాపురం విమానాశ్రయా న్ని పూర్తిచేస్తాం. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీలలో భాగంగా సూపర్-6 ద్వారా సంక్షేమ పథకాలు చేరువ చేస్తాం.



చీపురుపల్లిలో శంఖారావం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న లోకేశ్



రాయచోటి కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో వైసీపీ రంగు బెలూన్లు

కలెక్టరేట్‌లో వైసీపీ బెలూన్లు

▸▸ **అక్కడే అధికారుల ఎన్నికల సమావేశం**

రాయచోటి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ సభా భవనంలో గురువారం వలంటీర్లకు సేవా పురస్కారాల కార్యక్రమం జరిగింది. అయితే, ఇందుకోసం వైసీపీ రంగు బెలూన్లు ఏర్పాటు చేయడం కలకలం రేపుతోంది. ఆతర్వాత మధ్యాహ్నం ఇక్కడే జిల్లాస్థాయి అధికారుల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనూ వైసీపీ రంగుల బెలూన్లను అలాగే ఉంచేశారు. ఇప్పుడీ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. సాక్షాత్తూ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ పాల్గొన్న కార్యక్రమంలో అధికార పార్టీ బెలూన్లు ఉండడం కలకలం రేపింది. వలంటీర్ల సేవా పురస్కారాల కార్యక్రమం అయినప్పటికీ కలెక్టరేట్‌లో పార్టీ రంగు బెలూన్లు ఏర్పాటు చేయకూడదు. ఒకవేళ ఏర్పాటు చేసినా వలంటీర్ల కార్యక్రమం ముగిసిన తర్వాత ఎన్నికల సన్నాహక సమావేశానికైనా వాటిని తొలగించాల్సిందని పలువురు పేర్కొంటున్నారు.

ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు.. ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరి

▸▸ **సీఈవో మీనా స్పష్టీకరణ.. రాజకీయ పార్టీలతో భేటీ**



అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్-మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కమిటీ నుంచి ముందస్తు ఆమోదం పొందాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ, రాష్ట్ర స్థాయిలో ప్రసారం చేయదలచిన ప్రకటనలకు రాష్ట్ర ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు. గురువారరం అమరావతి సచివాలయంలో.. అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడ్రోజుల ముందు సంబంధిత రిజిస్టర్డ్ రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత రెండ్రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయం తీసుకుంటుందని మీనా తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఈసీ నిబంధనలను పాటించాలని పార్టీలను కోరారు. పెయిడ్ న్యూస్, రాజకీయ ప్రకటనలను తనిఖీచేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఎంసీఎంసీని ఈసీ నియమిస్తుంది. వార్తల ముసుగులో రాజకీయ పార్టీలు అన్ని రకాల మీడియాలో ఇచ్చే ప్రకటనలను ఎంసీఎంసీ స్క్రుటినీ చేస్తుంది.

మా ఫిర్యాదులకు జవాబు రాలేదు: ఆలపాటి

ఓటర్ల జాబితాలపై ఈసీకి అనేక ఫిర్యాదులు చేశామని.. వాటిలో కొన్నింటికి జవాబు రాలేదని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. పార్టీలతో సీఈవో భేటీలో ఈ అంశాన్ని ప్రస్తావించామని చెప్పారు. సమావేశం తర్వాత ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రకటనలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అధికార పక్షం వైసీపీ పాటించడం లేదని.. విపక్షాలను కించపరిచేలానే మాట్లాడుతున్నారని, తమపైనే బురదజల్లుతున్నారని ఆక్షేపించారు. చెప్పారని తెలిపారు.

వలంటీర్లకే వీరతాళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

'ప్రత్యేక' తాయిలాలు అందించారు. సేవా మిత్ర, రత్న, వజ్ర అనే బిరుదులతో... ఏకంగా రూ.392 కోట్ల పారితోషికం అందించారు. 'అందుచేత... మీరు నాకు రుణపడి ఉండాలి' అని తేల్చేశారు. ఇదే రూ.400 కోట్లతో ప్రభుత్వ ఉద్యోగులు, చిరుద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలను పరిష్కరించవచ్చు. కానీ... అవన్నీ పెండింగ్! వలంటీర్లకు మాత్రమే వరాలు!

అంతా ఎన్నికల కోణమే...

రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లున్నారు. వారికి ప్రతి నెలా రూ.5వేల గౌరవ వేతనం, పేపర్ బిల్లు రంచన్‌గా చెల్లిస్తున్నారు. గౌరవ వేతనం రూపంలోనే ఏటా రూ.1530 కోట్లు ఇస్తున్నారు. ఇది కాక ప్రతి ఏటా సేవా మిత్ర, రత్న, వజ్ర పేరుతో ప్రత్యేక పారితోషికం చెల్లిస్తున్నారు. ఈ ఏడాది సేవా మిత్రకు రూ.10 వేల నుంచి రూ. 15 వేలు, సేవా రత్నకు రూ.20 వేల నుంచి రూ. 30 వేలు, సేవ వజ్ర పురస్కారానికి రూ.30 వేల నుంచి రూ. 45 వేలకు పెంచారు. ఇందుకోసం రూ. 392 కోట్లు తాజాగా విడుదల చేశారు. సర్కారు వారి దృష్టిలో ఉద్యోగులు సవతి పిల్లలైతే, వలంటీర్లు సొంత పిల్లలు!

ఉద్యోగులకేవీ పారితోషికాలు?

ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం రోజు జిల్లాల వారీగా, శాఖలవారీగా అసమాన ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు దాదాపు 100మందికి సీఎం చేతుల మీదుగా అవార్డులు ఇవ్వడం సంప్రదాయం. టీడీపీ హయాంలోనూ, ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇది కొనసాగింది. ఈ అవార్డులకు ఎంపికైన ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్‌తో పాటు రూ.20,000 నగదు పురస్కారాన్ని అందించేవారు. ఈ సర్టిఫికెట్ బయట శాఖల్లో ఉద్యోగం చేయడానికి, ఐఏఎస్ కన్వర్షన్ జాబితాలో అదనపు పాయింట్లు తెచ్చుకోవడానికి ఉపయోగపడేవి. కానీ, వైసీపీ అధికారంలోకొచ్చాక ఒక్క ఏడాది కూడా రాష్ట్రస్థాయిలో ఉద్యోగులకు అవార్డులు ఇవ్వలేదు. వలంటీర్లను ప్రసన్నం చేసుకునేందుకు మాత్రం ఖజానా నుంచి వందల కోట్లు గుమ్మరిస్తోంది. సాధారణ ఉద్యోగులు రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్ 16(1) ప్రకారం నియమితులైన వారు. వీరి ఉద్యోగాలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుంది. వలంటీర్లను కేవలం ఎన్నికల అవసరాలకే ఉపయోగించుకున్నట్లు వైసీపీ పెద్దలే అంగీకరిస్తున్నారు. అందుకే... ఉద్యోగులకంటే వలంటీర్లకే పెద్దపీట వేస్తున్నారు.

వీటికి దిక్కులేదు కానీ...

వలంటీర్లను రూ.392 కోట్లతో ప్రత్యేకంగా సన్మానించిన సర్కారు... ఇతర ఉద్యోగుల విషయంలో ఎలా వ్యవహరిస్తోందంటే..

- రెగ్యులర్ ఉద్యోగులు ఏళ్ల తరబడి జమ చేసుకుంటున్న జీవిత బీమా క్లెయిమ్‌లు రూ.300 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ క్లెయిమ్‌లు పరిష్కరించి డబ్బులివ్వాలని ఉద్యోగులు కాళ్లరిగేలా ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారు.
- ప్రతి ఉద్యోగి వేతనం నుంచి మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం కట్ చేస్తున్నారు. కానీ, ఆస్పత్రులకు చెల్లించడంలేదు. వారికి వైద్యసేవలందడం లేదు. మెడికల్ క్లెయిమ్‌ల బిల్లులు క్లియర్ కాక చెదలు పడుతున్నాయి. ఈ మొత్తం ఖర్చు రూ.300 కోట్లలోపే ఉంటుంది. అయినా చెల్లింపుల్లేవు.
- సరెండర్ లీవు బిల్లులు మూడేళ్లుగా గ్రీన్‌చానల్‌లోనే ఉన్నాయి ఈ బిల్లులు కూడా రూ.300 కోట్లలోపే ఉంటాయి. ఇవేవీ చెల్లించలేదు.
- జీపీఎఫ్ క్లెయిమ్స్ విలువ కూడా రూ.300 కోట్లలోపే ఉంటుంది. ఇవి ఉద్యోగుల జీతం నుంచి కట్ చేసిన డబ్బే. కానీ, ఉద్యోగులకు అందడం లేదు.
- ఆశావర్కర్లు, ఎస్ఎస్ఏ, పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు అడుగుతున్న వేతన పెంపు విడివిడిగా చూస్తే రూ.400 కోట్లలోపే ఉంటుంది. కానీ, వీరెవరూ ఎన్నికల్లో పనికిరారనేది జగన్ సర్కార్ అభిప్రాయం. అందుకే, వీరి మొర ఆలకించడంలేదు.

వస్తారా.. చస్తారా!

రాకుంటే గంజాయి కేసులో ఇరికిస్తా నా కొ..!

▸▸ **సీఎం కార్యక్రమానికి రావాలంటూ వలంటీర్లపై ఒత్తిడి**


గుంటూరు సిటీ, ఫిబ్రవరి 15: 'ఎంట్రా ఓవర్ యాక్షన్ చేస్తున్నావ్. బస్సొచ్చి ఎంతసేపయ్యింది. నువ్వేమన్నా కలెక్టర్‌వా.. గంటలు గంటలు బస్సు ఆగటానికి... మర్యాదగా వచ్చి బస్సెక్కు.. పిచ్చి పిచ్చి వేషాలు వేశావంటే ఉన్న ఉద్యోగం ఊడుతుంది.. రాకపోతే.. గంజాయి కేస్‌లో పెట్టిస్తా నా కొడకా' అంటూ వలంటీర్‌పై అధికార పార్టీ నేత బూతుపురాణమిది!. గురువారం గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో సీఎం జగన్ పాల్గొన్న కార్యక్రమానికి వలంటీర్లు తప్పనిసరిగా రావాలంటూ అధికార పార్టీ నేతలు నానా రకాలుగా ఒత్తిడి చేశారు. ఉన్నతాధికారులు వలంటీర్లను తీసుకువచ్చే బాధ్యతను సచివాలయ కార్యదర్శికి అప్పగించారు. మొదట నయాన, భయాన చెప్పి చూసినా వలంటీర్లు వెళ్లేందుకు ససేమిరా అనడంతో వైసీపీ నేతలు బూతులు తిడుతూ బెదిరింపులకు దిగారు. 'మీటింగ్‌కు రాకపోతే ఉద్యోగం పోతుంది.. అంతటితో ఆగం.. ఇంకా చాలా జరుగుతాయి' అంటూ బెదిరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, వేమూరు, పొన్నూరు, గుంటూరు-2, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, గురజాల తదితర నియోజకవర్గాలలోని ఎక్కువ మంది వలంటీర్లు సీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకే ఆయా నియోజకవర్గ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లాయి. ఉదయం 11 గంటలు దాటినా చాలా మంది వలంటీర్లు బస్సులు ఎక్కక పోవడంతో స్థానిక వైసీపీ నేతలు బూతు పురాణం లంకించుకున్నారు. కాగా, పేరుకు వలంటీర్లకు వందన కార్యక్రమం అయినప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సచివాలయాలన్నీ మూత పడ్డాయి. ఉద్యోగులందరూ బస్సుల్లో మీటింగ్‌కు రావాలని ఆదేశించటంతో కార్యాలయాలకు తాళాలు పడ్డాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

అన్న అడుగేస్తే మాస్..!

- ట్రస్టుబోర్డు చైర్మన్ సేవలో తరిస్తున్న ఉద్యోగులు
- ఆలయంలో ప్రైవేట్ సైన్యందే హల్‌చల్
- సగటున రోజుకు వెయ్యిమందికి దర్శనాలు
- ఒక్కో బృందం నుంచి రూ.500 నుంచి రూ.1000 వసూలు!

వన్‌టౌన్, ఫిబ్రవరి 15: దుర్గగుడిలో ముందెన్నడూ లేనట్టు వైసీపీకి చెందిన నామినేటెడ్ ట్రస్ట్ బోర్డు చైర్మన్, సిబ్బంది రాజ్యమేలుతున్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు తన ప్రైవేట్ సైన్యం తోపాటు ఉద్యోగులను వినియోగించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ ఎరుగని రీతిలో దందా నడుస్తోంది. వచ్చే ఎన్నికల తరువాత ఫలితాలను బట్టి ట్రస్ట్‌బోర్డు కొనసాగుతుందా.. లేదా అన్నది చెప్పలేం కానీ తమకిచ్చిన రెండేళ్ల కాలంలో ఈ నెల 7 నాటికి ఏడాది పూర్తి చేసుకుంది. మరో ఏడాది పాటు గడువు ఉన్నా తామే శాశ్వతమన్న రీతిలో హవా నడుపుతున్నారు. చైర్మన్ ఆలయ ప్రాంగణంలోకి వస్తున్నారంటే అక్కడి సిబ్బంది హడావుడి అంతా ఇంతా కాదు. ఓ పెద్ద వీవీఐపీ వస్తున్నట్టు రాజమార్గం ఏర్పాటు చేస్తుంటారు. ఇదిలా ఉండగా చైర్మన్ రాంబాబు దేవస్థానం ఉద్యోగులను షిఫ్ట్‌కు ఇద్దరి చొప్పున వినియోగించుకుంటున్నారు. ఆరే కాక మరో ఇద్దరు సెక్యూరిటీలు షిఫ్ట్‌ల ప్రకారం పనిచేస్తుంటారు. ఉద్యోగుల్లో సీసీ రామ్‌జీ, అటెండర్లు వీరబాబు, గంగాధర్‌తో పాటు ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరే కాక ప్రైవేట్ వ్యక్తులు భవానీ, విజయ్, దుర్గాప్రసాద్ మరో ముగ్గురిని నియమించుకున్నారు. వీరందరి పని చైర్మన్ వస్తుంటే హడావుడి చేయడమే. ఆయన ఇంటి వద్ద బయలుదేరుతున్నారనగానే లిఫ్ట్‌లు ఆపివేయడం, గంటలపాటు భక్తజనాన్ని పక్కకు జరగమనడం వంటి హడావుడి చేస్తుంటారు. వీరబాబు హడావుడి మరో రేంజ్‌లో ఉంటుంది. వీరబాబు పక్కనుంటే భక్తులకు అమ్మవారు తప్ప చుక్కలే కనిపిస్తాయి. గర్భగుడిలో అడ్డంగా నిలుచుని చైర్మన్ అడుగులకు మడుగులొత్తడంలో దిట్టనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక ప్రైవేట్ సైన్యం, దుర్గగుడి ఉద్యోగులంతా కలిసి ఓ పెద్ద దందా చేస్తున్నారు. ఎవరైనా దర్శనానికి వస్తే వారికి అంతరాలయ దర్శనంతో పాటు ఆశీర్వచనం ఇప్పించేందుకు ఒక్కో బృందం నుంచి రూ.500 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ డబ్బుల్లో చైర్మన్‌కు వాటా ఉందనే ఆరోపణలున్నాయి. సాక్షాత్తు చైర్మనే అమ్మవారి ఆదాయానికి గండి కొట్టి పక్కదోవలో బృందాలకు దర్శనాలు కల్పించి డబ్బులు దండుకోవడంపై విమర్శలు లెక్కకు మిక్కిలిగా వస్తున్నాయి.





ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నేతలు బాబూరావు, ఉమామహేశ్వరరావు

సమ్మె ఒప్పందం ప్రకారం జీవోలివ్వాలి

- సీఐటీయూ నేతలు బాబూరావు, ఉమామహేశ్వరరావు

చిట్టినగర్, ఫిబ్రవరి 15: సమ్మె ఒప్పందం ప్రకారం జీవోలివ్వాలని, సమ్మె కాలం పని దినాలను స్వచ్ఛసెలవులుగా రికవరీ చేయాలని, ప్రతి పండుగకు పూర్తి సెలవు ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులకు జీతాలు వెంటనే ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ జీతాలివ్వాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నేతలు సీహెచ్ బాబూరావు, కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ 17 రోజులు సమ్మె చేశారని, సమ్మెకాలం ఒప్పందంలో భాగంగా ప్రభుత్వం పలు హామీలిచ్చిందన్నారు. వాటిని నేటికీ అమలు చేయలేదన్నారు. సమ్మె ఒప్పంద ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతలు డీ.కాశీనాద్, టీ.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మి, ఎం.బుజ్జమ్మ, కృష్ణవేణి, టీ.చిన్నా, దుర్గ, సేలం దాస్ పాల్గొన్నారు.

రైతులపై హేయమైన చర్యలు ఆపండి

- నేటి గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలి
- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 15: ఢిల్లీలో శంభు బోర్డర్ వద్ద రైతులకు సాగిస్తున్న హేయమైన దాడులను తక్షణమే నిలుపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, వాటి సాధన కోసం శాంతియుతంగా ఛలో ఢిల్లీ కార్యక్రమానికి తరలివస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం సాయుధ పోలీసు బలగాలతో లాఠీచార్జ్ చేయడం, రబ్బరు బులెట్లు పేల్చడం, వాటర్ క్యాన్లు ప్రయోగించడం, డ్రోన్ ద్వారా టియ్యర్‌గ్యాస్ సెల్స్ ప్రయోగించడాన్ని సమితి తీవ్రంగా ఖండించింది. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచివేయాలనే ఆలోచన విరమించుకుని రైతు సంఘాలతో చర్చించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు జరగనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతు సంఘాల నేతలు జి.ఈశ్వరయ్య, వై.కేశవరావు, పి.జమలయ్య, యం.వెంకటరెడ్డి, డి.హరినాథ్, వి.కృష్ణయ్య, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

జగన్‌ను అడుగుదాం ఆంధ్ర

- బహిరంగ సభను విజయవంతం చేద్దాం:మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపు

పెనమలూరు, ఫిబ్రవరి 15: ఈనెల ఉయ్యూరు గండిగుంటలో జగన్‌ను అడుగుదాం ఆంధ్ర పేరుతో నిర్వహించనున్న భారీ బహిరంగసభకు యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో పార్టీ యువనేతలతో కలిసి అడుగుదాం ఆంధ్ర పోస్టరును బోడె ఆవిష్కరించి మాట్లాడారు. కృష్ణాజిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని యువత అంతా సభకు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. జగన్ ఐదేళ్ల ఏలుబడిలో యువతకు ప్రధాన ఉద్యోగ వనరులైన కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవి కాస్తా అటు హైదరాబాద్‌కో, ఇటు బెంగళూరుకో తరలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఒక్క డీఎస్సీ వేయకుండా ఎన్నికల వేళ కంటితుడుపు చర్యగా తక్కువ పోస్టులతో డీఎస్సీ ప్రకటించి నాటకానికి తెరలేపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో యువత పాత్ర, యువత భవిష్యత్తుకు చంద్రబాబు అవసరం, పరిశ్రమలను ఎలా రాష్ట్రానికి రప్పించాలి, మత్తు పదార్థాల వినియోగాన్ని ఎలా తగ్గించాలనే అంశాలే ఎజెండాగా నిర్వహించే భారీ బహిరంగ సభకు ఎంపీ రామ్మోహన్ నాయుడు హాజరు కానున్నాడన్నారు. అనుమోలు ప్రభాకరరావు, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి బోడె మనోజ్, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, వెనిగళ్ల కుటుంబరావు, కోడె హరీష్, పలియాల రమేష్, సజ్జా మధు, జాతంగి మల్లయ్య, తాతినేని సుధీర్, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.



పోరంకిలో అడుగుదాం ఆంధ్రా పోస్టరును ఆవిష్కరిస్తున్న బోడె ప్రసాద్ తదితరులు

ద్విచక్రవాహనాల దొంగ అరెస్ట్

- రూ.3.40 లక్షల విలువైన ఐదు వాహనాల స్వాధీనం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 15: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న దొంగను వీరవల్లి పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వీరవల్లి ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం వీరవల్లి, కృష్ణలంక పోలీస్‌స్టేషన్ల పరిధిలో బైక్‌లను చోరీ చేస్తున్న వ్యక్తిని బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని అతని వద్దనుండి రూ.3.40 లక్షల విలువైన 5బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నరసింహమూర్తి పర్యవేక్షణలో వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎ.సీతారాంపురం వద్ద జాతీయ రహదారిపై వాహనతనిఖీ నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన షేక్ అబ్దుల్ వలీ అలియాస్ బాజీబాషా అనుమానాస్పదంగా వ్యవహరించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. వీరవల్లి పరిధిలో 4, కృష్ణలంక పరిధిలో 1 ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు తెలిసింది. దీనితో మధ్యవర్తుల సమక్షంలో చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి వివరించారు.

అవివాహితపై అత్యాచారం కేసులో

నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

ఉంగుటూరు, ఫిబ్రవరి 15: అవివాహిత యువతిపై అత్యాచారం చేసిన కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ విజయవాడ సెషన్స్ కోర్టు జడ్జి ఐశైలజాదేవి గురువారం తీర్పు ఇచ్చారు. మండలంలోని ఇందుపల్లి గ్రామంలో నివాసముంటున్న రాధిక(26)అనే అవివాహిత యువతికి పుట్టుకతోనే మూగ, చెవుడు వుంది. పదేళ్లక్రితం తల్లిదండ్రులు చనిపోవడంతో పిన్ని అనగాని సామ్రాజ్యం ఆమె బాగోగులు చూసుకునేది. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన అనగాని అంజిబాబు రాధికపై కన్నేశాడు. ఒంటరిగా వున్న సమయంలో సైగలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే అంజిబాబు అమాయకుడని, రాధికయే తన సైగలతో తనవద్దకు రప్పించుకుంటూ, నెపం అంజిబాబుపై వేసి ఊర్లో పరువుతీస్తుందని కక్ష కట్టిన అంజిబాబు తల్లిదండ్రులు అనగాని శ్రీనివాసు, పద్మావతి, సోదరుడు నాగబాబు ఆమెపై భౌతిక దాడులకు తెగబడటమేగాక చంపుతామని బెదిరించారు. దీంతో రాధిక పిన్ని సామ్రాజ్యం 2017 జూన్ 11న ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేసింది. అప్పటి ఎస్సై ఏ.సుబ్రహ్మణ్యం అంజిబాబు అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదుచేశారు. సీఐ కే.శ్రీధర్ కేసు దర్యాప్తుచేసి ముద్దాయిలను అరెస్ట్‌చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మహిళా సెషన్స్ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రగిరి విష్ణువర్ధన్ 14మంది సాక్షులను విచారించారు. నేరం రుజువు కావటంతో ఏ1 ముద్దాయిగా వున్న అనగాని అంజిబాబుకు పదేళ్ల జైలు, రూ.2500లు జరిమానా విధించారు. అనగాని శ్రీనివాసు, పద్మావతి, నాగబాబులకు ఒక్కొక్కరికి 6వేలరూపాయల జరిమానా విధించారు.

బాలింతకు పంపిణీ చేసిన బియ్యం ఇవి!

▸▸ అంగన్‌వాడీ కేంద్రంలో ముక్కిన బియ్యం

ముక్కిపోయిన ఈ బియ్యాన్ని చూశారా...ఆహారంగా తీసుకోమని ఓ బాలింతకు పంపిణీ చేసినవి ఇలా తయారయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం పోషకాహారం అందిస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్-4లో లక్ష్మి అనే బాలింతకు గత నెలలో 3 కిలోల బియ్యం అందజేశారు. ఆమె వాటిని తెచ్చుకుని, ఇంట్లో నిల్వ చేసుకుంది. తాజాగా ఆ బియ్యాన్ని చూడగా.. పూర్తిగా ముక్కిపోయి ఉన్నాయి. వాటిని పడేశానని ఆమె తెలిపారు. –రొద్దం



ఐఏఎస్ ఇంట్లో నగదు చోరీ?

- వాచ్‌మన్, మరోవ్యక్తి హస్తంపై అనుమానం
- పోలీసుల అదుపులో నిందితులు
- బయటకు పొక్కనివ్వకుండా దర్యాప్తు

పెనమలూరు, ఫిబ్రవరి 15: సీనియర్ ఐఏఎస్, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి కే హర్షవర్ధన్ కానూరు శ్రీనివాసనగర్ నివాసంలో రూ.5లక్షల నగదు చోరీ జరిగినట్టు తెలిసింది. ఇంటి వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి, అతడి స్నేహితుడు, మరో వ్యక్తి హస్తం ఉందని అనుమానిస్తూ హర్షవర్ధన్ కుటుంబసభ్యులు పెనమలూరు పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. వారం క్రితం ఇంట్లో రూ.5 లక్షలను ఉంచి బుధవారం తిరిగి చూడగా మాయమైనట్టు గ్రహించిన కుటుంబసభ్యులు దీన్ని హర్షవర్ధన్‌కు తెలుపగా ఆయన అప్రమత్తమై పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం. వాచ్‌మన్‌తో ఉన్న మరో వ్యక్తి నేరాన్ని ఒప్పుకోగా వాచ్‌మన్ మాత్రం తనకేపాపం తెలియదని చెప్పడంతో అతను పోలీసుల అదుపులోనే ఉన్నట్టు తెలిసింది. ఉన్నతాధికారి విషయం కావడంతో పోలీసులు దర్యాప్తు లీకవకుండా చూస్తున్నారు.

గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలి

- రంగన్నగూడెంలో సన్నాహక సమావేశం

హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 15: వ్యవసాయం నుంచి రైతులను బయటకు గెంటివేసి కార్పొరేట్లకు ధారాదత్తం చేసేలా కేంద్ర ప్రభుత్వం చేసిన చీకటి చట్టాలకు నిరసనగా గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సాగునీటి సమాఖ్య రాష్ట్ర నాయకుడు ఆళ్ల గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. రంగన్నగూడెంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో రైతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ బంద్‌ను రాజకీయాలకతీతంగా ప్రజలందరూ మద్దతు పలకాలన్నారు. టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, రైతు సంఘాల నేతలు కాట్రు పాపారావు, వేణుబాబు, కోట మురళీకృష్ణ, కనకవల్లి శేషగిరిరావు, కొలుసు గంగాజలం, ఆలపాటి రవికిషోర్, మొవ్వా కృష్ణారావు, లీలాకృష్ణ, కసుకుర్తి వెంకట నరసింహారావు, గురవయ్య పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను బలోపేతం చేయాలి

- కేంద్రాన్ని డిమాండ్ చేసిన పెన్షనర్లు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 15: బీఎస్ఎన్ఎల్‌కు అవసరమైన 4జీ అందించడం, దానికి రావాల్సిన బకాయిలు చెల్లించడం, అవసరమైన సామగ్రి ఇవ్వడం ద్వారా బీఎస్ఎన్ఎల్‌ను బలోపేతం చేయాలని బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి. అశోక్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో సంఘ ఏఐబీడీపీఏ జిల్లా మహాసభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ, లీజుకివ్వడంతో ప్రజాసంక్షేమం దెబ్బతింటుందన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.మాధవరావు అధ్యక్షత వహించారు. ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్‌పీ బోస్, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. రమాదేవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎంవీ సుధాకర్, పెన్షనర్ల యూనియన్ నేతలు రమేష్‌బాబు, రామారావు, ప్రజా సంఘాల నేతలు ఎస్ కృష్ణ, బాలాజీ, వి.రవికుమార్ పాల్గొన్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా ఆర్.మాధవరావు, కార్యదర్శిగా ఎన్ఎస్ రమేష్‌బాబు సహా నూతన కార్యవర్గం ఎన్నికైంది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

రైల్వేస్టేషన్: రైల్వేయార్డ్ ట్రిప్‌షెడ్ సమీపంలో గుర్తు తెలియని (30-35) వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసులు, నగర పోలీసులు సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇతడి శరీరం రెండు ముక్కలుగా పడి ఉంది. స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శేషయ్య వీధిలో మరో వ్యక్తి మృతి

వన్‌టౌన్ శేషయ్య వీధిలో జటాయి ప్లంబింగ్, శానిటరీ షాపు ఎదుట ఒక వ్యక్తి చనిపోయినట్టు ఫిర్యాదు రావడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి సుమారు 55-60 ఏళ్ల వయస్సు ఉంటుంది. శరీరంపై కాషాయ రంగు లుంగీ, షర్టు ఉంది. అతడి సంచిలో కొన్ని ట్యాబ్లెట్లు, ఆధార్ కార్డు ఉంది. అందులో నగర శివారు ప్రసాదంపాడుకు చెందిన పోతుల శంకర్ అని ఉంది. వన్‌టౌన్ ఎస్ఐ శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

విద్యాధరపురం: కామకోటి నగర్‌కు చెందిన ఓ యువతి (23) అదృశ్యమైనట్టు గురువారం భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విద్యాధరపురం కామకోటి నగర్‌లో యువతి కుటుంబసభ్యులతో ఉంటుంది. బీటెక్‌లో ఆర్కిటెక్చర్ చదివి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. 4 నెలల క్రితం ఉద్యోగం మానేసి ఇంటివద్దే ఉంటుంది. ఇటీవల ఆమె గుడూరు మేఘసాయినాథ్ అనే యువకుడితో ఫోన్‌లో తరచూ మాట్లాడుతుండడంతో తల్లితండ్రులు మందలించారు. ఈక్రమంలో ఆమె గురువారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో తల్లితండ్రులు బంధువులు, స్నేహితుల వద్ద వెదికారు. ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ యువతి సెల్‌ఫోన్, ఆమెకు సంబంధించిన వస్తువులు ఇంటిలోనే ఉన్నట్టు మేఘసాయినాథ్‌పై అనుమానం ఉన్నట్టు తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రూపాబాయమ్మ ట్రస్ట్‌కు కొత్తబోర్డు

వన్‌టౌన్: వన్‌టౌన్‌లోని శ్రీరామ్‌నగర్ రూపాబాయమ్మ ట్రస్ట్‌కు నూతన ట్రస్ట్‌బోర్డును నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రజొన్న విజయలక్ష్మి, గుండు లక్ష్మి, ముత్తా వెంకటరమణమ్మ, కొక్కిలిగడ్డ శివపార్వతి, సోమిశెట్టి సుబ్బారావు, కందుబోతు గురుమూర్తి, గట్టు మహేంద్రరెడ్డితో ఏడుగురు కమిటీని నియమించారు. కాగా ఈ కమిటీ నియామకంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఒత్తిడి ఉందని తెలుస్తోంది. త్వరలో ఎన్నికల కోడ్ వస్తుందన్న కారణంగా హడావుడిగా ట్రస్ట్‌బోర్డును ఏర్పాటు చేశారన్న విమర్శలున్నాయి.

మార్చి 27న భారీ బహిరంగ సభ

ధర్నాచౌక్: రాజ్యాధికారం, బీసీ రిజర్వేషన్ల సాధనే ప్రధాన లక్ష్యంగా కాపు యువసేన, కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 27న నగరంలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు కాపునాడు జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేష్‌నాయుడు తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానీ మోదీ, సీఎం జగన్, టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను సభకు ఆహ్వానిస్తామన్నారు. కాపునాడు నేతలు రావి శ్రీనివాస్, కొమ్మిశెట్టి అర్జునరావు, బోడపాటి పెదబాబు, పేట సీతారావమ్మ, పంచాది రంగారావు, బొట్టు రమేష్‌బాబు, కాకిలేటి హరినాథ్, బోధిహీన్, దుర్గజ, రంగమణి, విజయ, వెలిశెట్టి మాధవి పాల్గొన్నారు.

18న జిల్లా పురుషుల, సబ్ జూనియర్స్ కబడ్డీ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్స్‌లో ఈ నెల 18న మధ్యాహ్నం 2 గంటలకు ఉమ్మడి కృష్ణాజిల్లా పురుషుల, సబ్‌జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రవి ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే పురుషుల బరువు 85 కేజీల లోపు, సబ్ జూనియర్స్ బాలబాలికల బరువు 55 కేజీల్లోపు ఉండాలని, సబ్‌జూనియర్స్ బాల,బాలికల ఎంపికలకు వచ్చేవారు 2 008 మార్చి 19న తర్వాత పుట్టినవారే అర్హులన్నారు. క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌తో రావాలన్నారు.

రేపు కేఆర్‌యూ జిమ్నాస్టిక్స్ పోటీలు

నగరంలోని మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 9 గంటలకు కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల జిమ్నాస్టిక్స్ పురుషుల, మహిళా చాంపియన్‌షిప్‌ను నిర్వహిస్తున్నట్టు టోర్నీ చైర్‌పర్సన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.చినబాబు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు, టీమ్ మేనేజర్లు, పీడీలు అర్హతా పత్రాలు, ఐడీకార్డులతో ఆ రోజు ఉదయం 9 గంటలకల్లా రిపోర్టు చేయాలన్నారు. అదేరోజు టీమ్‌ను ఎంపిక చేస్తామన్నారు.

నేడు కాపు ప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశం

ధర్నాచౌక్: ఐక్యత, సమైక్యత నినాదంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుని రాష్ట్రంలోని 25 శాతమున్న కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా కాపు జేఏసీ కృషి చేస్తుందని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ తెలిపారు. రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కాపుల సత్తా చాటుతామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కాపు, మున్నూరుకాపు, బలిజ, తెలగ, తూర్పుకాపు, ఒంటరితో రాష్ట్రస్థాయి కాపు ప్రతినిధుల సమావేశం స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్‌హాల్‌లో ఈ నెల 16న నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాపు జేఏసీ ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించదన్నారు. కాపు ఉద్యోగులపై వేధింపులను అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముత్యాల రామదాసు, రంగిశెట్టి మంగబాబు, మంచాల సుధాకర్ నాయుడు, సుంకర సాంబశివరావు, పాలంకి రామారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు నిరసన: రెడ్డమ్మ

పెనమలూరు: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేవరకు శాంతియుత పద్ధతుల్లో నిరసనలు తెలుపుతామని అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే రెడ్డమ్మ తెలిపారు. జేఏసీ పిలుపు మేరకు కానూరు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ చర్యలకు నిరసనగా రెండో రోజు ధర్నాలో ఆయన మాట్లాడారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఇనయతుల్లా, ఎం వెంకటేశ్వరరావు, హెచ్ ఎం విజయలక్ష్మి, పూర్ణచంద్రరావు, అబ్రహాం, శ్రీనివాస్, రాంబాబు, ప్రసాద్, లలిత, అరుణ, బేబీ పద్మజ, శమంతకమణి, పరిమళ, ధనలక్ష్మి, జయలక్ష్మి పాల్గొన్నారు.

జెస్సీరాజ్, ఆదర్శ్‌కు గవర్నర్ అభినందన



విజయవాడ స్పోర్ట్సు, ఫిబ్రవరి 15: జాతీయ స్కేటింగ్ పోటీల్లో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తెస్తున్న అక్కా తమ్ముళ్లు జెస్సీరాజ్, జోయల్ ఆదర్శ్ క్రీడా నైపుణ్యం అభినందనీయమని గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ ఆర్టిస్టిక్ సోలో స్కేటింగ్ పోటీల్లో వీరిద్దరూ రాణించి పతకాలు సాధించారు. నగరంలోని గవర్నర్ బంగ్లాలో గురువారం సాయంత్రం జెస్సీరాజ్, జోయల్ మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిసి తమ మెడల్స్‌ను చూపించారు. రాష్ట్ర, జాతీయ పతకాలను సాధిస్తున్న స్ఫూర్తితో మరిన్ని పతకాలను సాధించాలని నజీర్ ఆకాంక్షించారు.



క్రీడాకారులకు అభినందలు తెలుపుతున్న భాగ్యలక్ష్మి

హ్యాండ్‌బాల్‌లో ఎస్ఆర్ఆర్‌కు తృతీయ స్థానం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ తరపున డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ క్రీడాకారులను సత్కరించారు.

నేటి రవాణా సమ్మెను విజయవంతం చేయాలి

- షేక్ ఆసిఫ్ పాషా పిలుపు

ఆటోనగర్ (పెనమలూరు), ఫిబ్రవరి 15: రవాణా రంగానికి ఉరితాడు లాంటి కేంద్ర ప్రభుత్వ చట్టం భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 106 (1,2)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్, ఇతర రవాణా కార్మిక సంఘాలు, రైతు సంఘాలు సంయుక్తంగా నేడు తలపెట్టిన భారతబంద్‌ను విజయవంతం చేయాలని న్యూ హెచ్ఎంసీ మినీ ట్రక్ ఓనర్సు వర్కర్సు వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ పాషా పిలుపునిచ్చారు. గురువారం ఆటోనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని కేంద్రప్రభుత్వ విధానాలపై మాట్లాడారు. నేటి సమ్మెకు ది ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్సు అసోసియేషన్ మద్దతు ప్రకటిస్తోందన్నారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా కార్యదర్శి కేఎస్ రాజు, ఏలూరు జిల్లా రాష్ట్ర బోర్డు సభ్యుడు సాంబశివరావు, రెస్క్యూ టీం ఉస్మాన్, రికవరీ టీం సుబ్బారెడ్డి, బోర్డు సభ్యుడు నాగూర్‌బాషా, ఆకుల దుర్గారావు, శివ, నాగ, షేక్ అమీర్, దేవరాజు, గట్టు శివకొండలరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

చరణ్ మృతికి వెలంపల్లి ఒత్తిడే కారణం!


- ఆలిండియా కాపు ఫెడరేషన్ కార్యదర్శి రామారావు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 15: వైసీపీ నేత కైకాల చరణ్ మృతికి వెలంపల్లి శ్రీనివాస్ రాజకీయ ఒత్తిడే కారణమని ఆలిండియా కాపు ఫెడరేషన్ కార్యదర్శి ఏటీ రామారావు ఆరోపించారు. ఫెడరేషన్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చరణ్ మృతి వెనుక వాస్తవాలు బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను చరణ్ మృతదేహం వద్దకు పంపించి గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశారని విమర్శించారు. తమ నేత బొండా ఉమామహేశ్వరరావుకు కాపు సామాజికవర్గం మద్దతుందని కాపులు తనకు మద్దతు తెలిపేలా పని చేయాలని చరణ్‌పై వెలంపల్లి ఒత్తిడి తెచ్చాడన్నారు. గతంలో కాపు నేతలు సి.రామచంద్రయ్య, ఆకుల శ్రీనివాస్‌ను ఇబ్బందులు పెట్టారని గుర్తు చేశారు. చరణ్ మృతిపై పోలీసులు నిజనిర్ధారణ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కాపుల ద్రోహి వెలంపల్లి అని, కాపుల పట్ల చులకన భావంతో ఉన్నారని ఆయన్ను తక్షణమే వైసీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



సంగీత, జ్ఞానప్రదాయినికి వీణావాద్య నీరజనాలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 15: శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో గురువారం అష్టమ వార్షిక అఖండ కచ్ఛపీ మహోత్సవం సందర్భంగా సంగీత జ్ఞానప్రదాయినికి వీణా వాయిద్య నీరాజనాలు అర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు 12 గంటలపాటు నిర్విరామంగా వీణా సంగీత కచేరి నిర్వహించారు. స్థానిక సంగీత కళాశాల వేదికపై తెలుగు రాష్ట్రాల్లోని వైణిక విద్యాంసులు దాదాపు 50 మంది వీణావాద్యంతో అమ్మవారికి నీరాజనాలు అర్పించారు. ముఖ్యఅతిథిగా స్టార్ ఆసుపత్రి చీఫ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ రాఘవేంద్రబాబు హాజరయ్యారు. సంగీత విద్వాంసులు గోవిందరాజన్, మోదుమూడి సుధాకర్, సుబ్బరాయ ఫల్గుణ్, సీవీ రావు పాల్గొన్నారు.



సిద్ధార్థ్‌రాయ్ చిత్ర యూనిట్ సందడి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 15: సిద్ధార్థ్‌రాయ్ చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. ఈనెల 23న సినిమా విడుదల సందర్భంగా జేడీ ఫ్యాషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చిత్ర యూనిట్ సమావేశమైంది. ఈ చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని హీరో దీపక్ సరోజ్ అన్నారు. హీరోయిన్లు తన్వీనేగి, కల్యాణి పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ మల్టీ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పుట్టగుంట

లయనిజంతో నిస్వార్థమైన సేవ

- పుట్టగుంట సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15: లయనిజంతో ప్రజలకు నిస్వార్థమైన సేవలందించే అవకాశం ఉందని అలాంటి వారికి లయనిజం మంచి వేదికని పుట్టగుంట సతీష్‌కుమార్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. దాతలు అందించిన రూ.40లక్షల విరాళాలతో స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌ను ఇటీవల ఆధునీకరించారు. ఈపనులకు పుట్టగుంట రూ.8లక్షల విరాళాన్ని ఇచ్చారు. గురువారం ఆధునీకరించిన సెంటర్‌లో ఏసీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. జనరేటర్‌ను మాజీ లయన్స్ గవర్నర్ వీరమాచనేని రామబ్రహ్మం, ప్రత్యేక గదిని సీనియర్ లయన్స్ నేత మేడికొండ బుచ్చిబాపయ్య ప్రారంభించారు. లయన్స్ చారిటీ ట్రస్ట్ చైర్మన్ నందిగం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో పుట్టగుంట మాట్లాడారు. అనంతరం పుట్టగుంటను లయన్స్ సభ్యులు శాలువ, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ కార్యదర్శి గూడవల్లి రత్నశేఖర్, నేతులు నందూరు సత్యవెంకటేశ్వరశర్మ, కనికంటి రంగారావు, యలమంచలి శ్రీరామచంద్రమూర్తి, కొల్లేపల్లి నారాయణరావు, చలసాని శ్రీనివాసరావు, బోయపాటి పూర్ణచంద్రరావు, మొవ్వా రామారావు పాల్గొన్నారు.

సస్పెండ్ చేసి ఉంటే.. పార్టీ సభ్యుడు కాదనేవారు

▸▸ ఏజీ శ్రీరామ్ వాదన విడ్డూరం: రఘురామ కృష్ణంరాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి తనను సస్పెండ్ చేసి ఉంటే గనుక.. పార్టీ సభ్యుడు కాదని, సాధారణ ఎంపీ అనేవారని నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు చెప్పారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గురువారం ఢిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ ఆయాచిత లబ్ధి పొందడమే కాకుండా, వందిమాగధులకు లబ్ధి చేకూర్చారని తాను దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం కోర్టులో విచారణకు వచ్చిందన్నారు. రఘురామ కృష్ణంరాజు వైసీపీ ఎంపీ అనేది పచ్చి అబద్ధమని అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తనపై అనర్హత వేటు కోసం 2020లోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపిన ఏజీ.. ఆ విషయాన్ని పిల్‌లో ప్రస్తావించకపోవడం సమంజసం కాదన్నారు. అదే పాయింట్‌పై పిల్‌ను కొట్టివేయాలని వ్యాఖ్యానించారు.

స్పీకర్ షోకాజ్‌కు స్పందించని ఎమ్మెల్యేలు

▸▸ మరింత గడువు కోరుతూ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పార్టీ కట్టుబాట్లను అతిక్రమించారంటూ వచ్చిన అభియోగాలపై వ్యక్తిగతంగా సంజాయిషీ ఇవ్వాలంటూ స్పీకర్ తమ్మినేని సీతారాం జారీచేసిన షోకాజ్ నోటీసులకు వైసీపీలో చేరిన టీడీపీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, బలరాం, వాసుపల్లి గణేశ్, మద్దాలి గిరి.. టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖరరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి స్పందించలేదు. తమకు మరింత గడువు కావాలని ఈ ఏడుగురూ గురువారం తమ న్యాయవాదుల ద్వారా సభాపతికి లేఖలు అందజేశారు.

రాజ్యసభకు నాలుగో నామినేషన్

▸▸ ఎమ్మెల్యేలు బలపరచనందున స్క్రూటినీలో తిరస్కరణ ఖాయం!

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసీపీ నుంచి గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి నామినేషన్లు వేశారు. స్వతంత్ర అభ్యర్థిగా నెల్లూరు జిల్లాకు చెందిన పెమ్మసాని ప్రభాకర నాయుడు కూడా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ఎమ్మెల్యేలు సంతకాలు చేయనందున.. పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని అధికారులు చెబుతున్నారు.

నెల్లూరు టిడ్కోలో దిద్దుబాటు చర్యలు

▸▸ ఇళ్ల తాళాలు, పత్రాలు ఇస్తామని ఏడీసీ ప్రకటన

నెల్లూరు సిటీ, ఫిబ్రవరి 15: నెల్లూరులో టిడ్కో లబ్ధిదారులు తిరుగుబాటు చేయడంతో కార్పొరేషన్ అధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ఈ ఘటనపై గురువారం అదనపు కమిషనర్ శర్మ సంబంధిత అధికారులతో సమీక్షించి, పలు ఆదేశాలు ఇచ్చారు. అక్కచెరువుపాడు, కల్లూరిపల్లి, కొండ్లపూడి, వెంకటేశ్వరపురం, అల్లీపురం, ఇరగాలమ్మ సంఘం వద్ద నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల తాళాలను లబ్ధిదారులకు అందజేస్తామని ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా టిడ్కో గృహ సముదాయాల వద్ద అధికారులు, వలంటీర్లతో శిబిరాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులతో ఫొటోలు తీసి పంపారు.

ఐదేళ్ల గాడిదలు కాశారా!?: కోటంరెడ్డి

అధికారంలో ఉన్న ఐదేళ్లు ఇళ్లు నిర్మించకుండా గాడిదలు కాశారా!? అని వైసీపీ ప్రభుత్వంపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మండిపడ్డారు. గురువారం అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయం వద్ద లబ్ధిదారులు, టీడీపీ కార్యకర్తలతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 43 వేల ఇళ్లు నిర్మించి ఇస్తే వాటిని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇవ్వలేని దుస్థితిలో వైసీపీ సర్కారు పాలన సాగించిందన్నారు.

ఆసరా లబ్ధిదారులకు డిజిటల్ లిటరసీ

అమరావతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక బృందాల్లోని ఆసరా లబ్ధిదారులకు డిజిటల్, ఫైనాన్షియల్, ఫంక్షనల్ లిటరసీ కోసం ప్రత్యేకంగా ఓ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. వయోజన విద్యా విభాగం ద్వారా నాలుగేళ్ల కాలపరిమితితో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం రూ.50కోట్ల నిధుల విడుదలకు పరిపాలనా అనుమతులు మంజూరుచేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది.

వైసీపీకి 50 సీట్లు కూడా రావు: కేఏ పాల్

పెందుర్తి (విశాఖపట్నం), ఫిబ్రవరి 15: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 50 సీట్లు కూడా రావని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన విశాఖ నగర పరిధిలోని పెందుర్తిలో గల ఇండియన్ పెంతకోస్తు చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాను విశాఖ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. దేశాన్ని రక్షించాలంటే మోదీ, ఆయన తొత్తులను చిత్తుగా ఓడించాలన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాల్లో సీఎం కుటుంబ సభ్యులే కీలకం: జంగా గౌతమ్

అనంతపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాల్లో సీఎం కుటుంబ సభ్యులే కీలకంగా ఉన్నారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్‌తో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్ నేతృత్వంలో ఇసుక అక్రమ తవ్వకాలు మొదలయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వమే అవినీతికి తెరలేపిందని మండిపడ్డారు. తన సోదరుడితోపాటు పక్క రాష్ట్రానికి చెందిన కీలక నేత మేనల్లుడికి లబ్ధి చేకూర్చేలా సీఎం జగన్ ఇసుక పాలసీని అమలు చేశారని ఆరోపించారు. రాయలసీమను శాసిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇసుక అక్రమ తవ్వకాల్లో భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు.

జగన్ పాలనలో రైతు వ్యతిరేక విధానాలు: బీ వెంకట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు రైతాంగ ఉద్యమానికి మద్దతు పలికితే.. ఏపీలో మాత్రం జగన్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని ఆలిండియా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీ వెంకట్ ఆరోపించారు. రైతులు విద్యుత్ బిల్లును రద్దు చేయాలని డిమాండు చేస్తుంటే ఏపీలో మాత్రం జగన్ సర్కార్ అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. 'ఏపీలోని పార్టీలు కేంద్రం విధానాలకు మడుగులు ఒత్తుతున్నాయి. మోదీ ప్రభుత్వాని కార్పొరేట్లు నడిపిస్తున్నారు. సాధారణ ప్రజానీకం ఓట్లను కొనుగోలు చేయడానికి రూ.లక్షల కోట్లు నిధులను ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ సిద్ధం చేసింది. వచ్చే పార్లమెంట్ ఎన్నికల ప్రజాకోర్టులో మోదీ ప్రభుత్వాన్ని ఓడిస్తామని అన్నారు.

వైద్య మండలిలో నమోదు కోసం నకిలీ పత్రాలు

▸▸ తెలంగాణ మహిళ అరెస్టు

చెన్నై, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర వైద్య మండలిలో తన పేరు నమోదు చేసుకునేందుకు నకిలీ పత్రాలు సమర్పించిన తెలంగాణకు చెందిన మహిళను నగర పోలీసులు అరెస్టు చేశారు. గురువారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే.. హైదరాబాద్‌కు చెందిన అయిషా తస్నీర్ (40) చెన్నై గిండిలో ఉన్న డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసినట్టుగా ధ్రువపత్రాలు తీసుకుని తమిళనాడు స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో తన పేరును రిజిస్టర్ చేయించుకునేందుకు స్థానిక అరుంబాక్కంలోని కార్యాలయానికి బుధవారం వెళ్లారు. ఆమె సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ కామరాజ్ పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో ఆయన పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు కౌన్సిల్ కార్యాలయంలో తస్నీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

రేపే జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: పీఎస్ఎల్వీ-సీ58 విజయంతో ఈ ఏడాదిని ఘనంగా ఆరంభించిన ఇస్రో.. మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఈ నెల 17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసే 2,275 కిలోల బరువైన ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్14 నింగిలోకి దూసుకెళ్లనుంది. శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 27.30 గంటల పాటు కొనసాగుతుంది.

'ఉపా'పై 8 పిటిషన్ల ఉపసంహరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలైన ఎనిమిది పిటిషన్లను ఉపసంహరించుకునేందుకు గురువారం సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. బెయిల్ మంజూరు, కేసుల కొట్టివేత కోసం తగిన న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని పిటిషనర్ల తరపు న్యాయవాదులు చెప్పడంతో జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌ల ధర్మాసనం అందుకు అంగీకరించింది. ఈ అంశంపై బుధవారం విచారణ జరిపిన ఇదే ధర్మాసనం..'ఉపా' కారణంగా బాధితులైన పిటిషనర్ల వ్యాజ్యాలనే పరిశీలిస్తామని తెలిపింది.



ఉండవల్లి కూడలిలో రాస్తారోకో చేస్తున్న రాజధాని మహిళలు, రైతులు, టీడీపీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) సినిమా హాల్ వద్ద నినాదాలు చేస్తున్న రాజధాని మహిళలు, రైతులు

'రాజధాని ఫైల్స్' నిలుపుదలపై ఆందోళన

▸▸ రాస్తారోకో చేసిన రాజధాని మహిళలు, టీడీపీ శ్రేణులు

తాడేపల్లి, ఫిబ్రవరి 15: అమరావతి రాజధాని నేపథ్యంలో నిర్మితమైన రాజధాని ఫైల్స్ సినిమాను కోర్టు ఆదేశాల మేరకు తాత్కాలికంగా నిలిపివేయడంతో రాజధాని ప్రాంత మహిళలు, రైతులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి కూడలిలోని రామకృష్ణ థియేటర్‌లో రాజధాని ఫైల్స్ సినిమా గురువారం విడుదలైంది. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు ఆ సినిమా ప్రదర్శనను థియేటర్ యాజమాన్యం నిలిపివేసింది. దీంతో సినిమా చూసేందుకు వచ్చిన అనేక మంది రాజధాని మహిళలు, టీడీపీ శ్రేణులు థియేటర్ వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం ఉండవల్లి సెంటర్‌లో రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రైతులకు భయపడ్డ సీఎం జగన్ అంటూ నినాదాలు చేశారు. వైసీపీ నాయకులు రైతులకు భయపడి ఉద్దేశపూర్వకంగానే కోర్టులో పిటిషన్ వేశారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ శ్రేణులు, రైతులు, రైతు కూలీలు, రాజధాని మహిళలు భారీగా పాల్గొన్నారు. దీంతో ఉండవల్లి సెంటర్‌లో పోలీసులు భారీగా మోహరించారు.

జనం సొమ్ముతో జగన్ సేవ!

- ▸▸ సొంత అవసరాలకే ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ
- ▸▸ పేరుకే పథకాలపై వలంటీర్లకు శిక్షణ
- ▸▸ చేసేది రాజకీయ సమాచార సేకరణ
- ▸▸ ఇప్పుడు జగన్‌ను గెలిపించేందుకు 'క్లాసులు'
- ▸▸ నాలుగేళ్లకు సుమారు 275 కోట్లు సమర్పణ
- ▸▸ రామ్ ఇన్ఫోటెక్ సంస్థతో ఒప్పందం
- ▸▸ మధ్యలో యూని కార్పొరేట్ ప్రవేశం
- ▸▸ అదాన్ డిస్టిలరీస్‌తో లింకులు
- ▸▸ తెరవెనుక ఐటీ సలహాదారు రాజశేఖరరెడ్డి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పథకాల పంపిణీకి సంబంధించి వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రభుత్వ యంత్రాంగం ఉంది. ప్రభుత్వంలోనే ఎన్నో శిక్షణా సంస్థలు, వేదికలు ఉన్నాయి. వాటిని కాదని ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ (ఎఫ్ఓఏ) అనే ప్రైవేటు సంస్థకు ఆ పనిని అప్పగించారు. ఇక్కడే అసలు గుట్టు దాగుంది. ప్రభుత్వానికి, వలంటీర్లకు మధ్య సమన్వయం నెలకొల్పుతూ అవసరమైన శిక్షణ ఇవ్వడం ఈ సంస్థ బాధ్యత. అయితే చేసేది మాత్రం.. అధికారులపై పెత్తనం, రాజకీయ సమాచార సేకరణ. అంతేకాదు ప్రజల్ని మభ్యపెట్టి జగన్‌ను మళ్లీ ఎలా ముఖ్యమంత్రి చేయాలి? ప్రతిపక్ష నేతలపై ఎలా బురదజల్లాలి? వంటి అంశాలపై వలంటీర్లకు స్పెషల్ క్లాసులు తీసుకుంటోంది. ఏడాదికి రూ.68.6 కోట్లు చొప్పున నాలుగేళ్లకు సుమారు 275 కోట్ల ప్రభుత్వ సొమ్ముతో జగన్ సర్కారు సొంత పార్టీ కోసం ఎఫ్ఓఏ సేవలు వినియోగించుకుంటోంది. ఇంతకీ ఎఫ్ఓఏ వెనుక ఎవరెవరు ఉన్నారు? ఎవరెవరితో లింకులు ఉన్నాయి? చేస్తున్న పని ఏమిటి? వంటి వివరాల్లోకి వెళితే..

అసలు ఉద్దేశం ఇది..

పరిపాలన వికేంద్రీకరణ అంటూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశాక వారికి శిక్షణ ఇవ్వడం కోసం ఎఫ్ఓఏను ఏర్పాటు చేశారు. ప్రభుత్వానికి, వలంటీర్లకు మధ్య సమన్వయం నెలకొల్పుతూ అవసరమైన సాంకేతిక సహకారం అందించడం ఈ సంస్థ బాధ్యత. ఇందుకుగాను ఏడాదికి 68.6 కోట్ల రూపాయలు ఇస్తారు. నాలుగేళ్లు చెల్లించేలా రామ్ ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ అధికారిక ఉత్తర్వుల్లో కూడా ఆ కంపెనీ పేరుతోనే ఎంఓయూ ఉంటుంది. అయితే మధ్యలో మరో కంపెనీ రామ్ ఇన్ఫోటెక్‌తో జతకలిసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న యూని కార్పొరేట్ సొల్యూషన్స్ అనే సంస్థ తాము మానవ వనరులను సమకూరుస్తామని ముందుకొచ్చింది. మధ్యలో ఎవరెవరు రంగంలోకి దిగారో తెలియదు కానీ ఈ సంస్థ రామ్ ఇన్ఫోటెక్ కన్సార్షియంలో భాగమైపోయింది. సాంకేతిక సహకారాన్ని రామ్ ఇన్ఫోటెక్ అందిస్తుండగా, మానవ వనరులను యూని కార్పొరేట్ సంస్థ సమకూరుస్తోంది. ప్రతీ మండలంలో ఒక ఎఫ్ఓఏ ప్రతినిధి, రెవెన్యూ డివిజన్ కేంద్రంలో మరో ప్రతినిధి ఉంటారు. వీరిని సమన్వయం చేయడానికి జిల్లాకు ఒక ప్రధాన ప్రతినిధి ఉంటారు. మండలాలు, డివిజన్ కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రతినిధులకు నెలకు రూ.15 వేలలోపు చెల్లిస్తున్నారు.

చేసే పనులు ఇవీ..

పేరుకు మాత్రమే ఎఫ్ఓఏకు వలంటీర్లపై పర్యవేక్షణ బాధ్యత ఉంటుంది. చేసేదంతా అధికారులపై పెత్తనం, రాజకీయ సమాచార సేకరణ. అంటే.. నిఘా పెట్టడం, గుట్టుగా సమాచారం సేకరించడం. అది ఇప్పుడు ప్రభుత్వ పెద్దలకు ఉపయోగపడుతుంది. వాస్తవానికి ఈ పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర అధికార యంత్రాంగం, ఇంకా బలమైన నిఘా (ఇంటెలిజెన్స్) వ్యవస్థలు ఉన్నాయి. అయినా ఎఫ్ఓఏ ద్వారా పనికానిచ్చేస్తున్నారు. మండలాలు, డివిజన్‌ల పరిధిలో ఉన్న ప్రతినిధులు బాస్‌లుగా మారారు. జిల్లా కేంద్రంలో పనిచేసే ఏజెన్సీ ప్రధాన ప్రతినిధి సూపర్ బాస్‌గా మారారు. వాస్తవానికి వలంటీర్లు చేసేది ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించడమే. వీరిని నియంత్రించడానికి, పర్యవేక్షించడానికి ప్రభుత్వ యంత్రాంగం ఎలాగూ ఉంటుంది. అనధికారికంగా అధికారపార్టీ నేతలు కూడా వారి పాలిట సూపర్‌బాస్‌లుగా మారారు. వీరిందరినీ కాదని ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీని తెరమీదకు తెచ్చారు. నాలుగేళ్లలో సుమారు 275 కోట్ల సర్కారీ సొమ్ముతో ప్రభుత్వ పెద్దలకు అవసరమైన సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు. ఇదంతా ఐటీ సలహాదారు రాజశేఖరరెడ్డి పర్యవేక్షణలోనే జరుగుతుందన్నది బహిరంగ రహస్యం.

అదాన్ డిస్టిలరీస్‌తో లింకు

ప్రైవేటు ఏజెన్సీ అయిన ఎఫ్ఓఏకు ఇంత పవర్ ఎలా వచ్చిందని ఆరా తీస్తే.. దాని మూలాలు అదాన్ డిస్టిలరీస్‌తో ముడిపడి ఉన్నాయి. అదాన్ డిస్టిలరీస్ సంస్థ సుప్రీం బ్లెండర్ మద్యాన్ని తయారు చేస్తోంది. మద్యం షాపులు నడుపుతున్న ప్రభుత్వం దాన్ని కొంటోంది. తెర వెనుక నడిపిస్తోంది కశిరెడ్డి రాజశేఖరరెడ్డి. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి ఐటీ సలహాదారు. ఆయన అటు అదాన్ డిస్టిలరీస్‌ను, ఇటు యూని కార్పొరేట్‌ను మేనేజ్ చేస్తున్నారు. అటు మద్యం, ఇటు టెండర్ల ద్వారా వస్తున్న ఆదాయం ఎవరి ద్వారా ఎటో వెళ్లిపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రెండింటి చిరునామా అక్కడే

అదాన్ డిస్టిలరీస్‌తో ఐటీ సలహాదారు రాజశేఖరరెడ్డికి, ఎఫ్ఓఏకు లింకులు ముడిపడి ఉన్నట్లు గతంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీకి మానవ వనరులను అందిస్తున్న యూని కార్పొరేట్ సొల్యూషన్స్ అడ్రస్ ఎక్కడా అని ఆరా తీయగా.. దాని కార్యాలయం హైదరాబాద్‌లోని ఖాజాగూడలో ఉంది. ప్లాట్ నంబర్ 26,27, డోర్ నంబర్ 7-66/2/ ప్రశాంతి హిల్స్ ఖాజాగూడా రోడ్, హైదరాబాద్ అని ఉంది. ఇక్కడే మరో ప్రత్యేకత ఉంది. రాష్ట్రంలో మద్యం అమ్మకాల్లో దూసుకుపోతున్న అదాన్ డిస్టిలరీస్ ప్రైవేటు లిమిటెడ్ అడ్రస్ కూడా ఇదే. అదాన్ డిస్టిలరీస్ తయారు చేసే సుప్రీం బ్లెండర్ మద్యాన్ని ఏపీలో అమ్ముతున్నారు. మద్యం అమ్మకాల్లో సరికొత్తదందా జరుగుతోందని, ఇందులో ఐటీ సలహాదారు రాజశేఖరరెడ్డి ఉన్నారన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఫీల్డ్ ఆపరేటింగ్ ఏజెన్సీ మానవ వనరుల మూలాలు కూడా ఇక్కడే ఉండటంతో ఈ దందాలోనూ సలహాదారే ఉన్నారని స్పష్టమవుతోంది. కొసమెరుపు ఏమిటంటే వలంటీర్ల వ్యవస్థతో సమన్వయం కోసం అంటూ టెండర్లు పిలిచినప్పుడు బిడ్ దక్కించుకున్న రామ్ ఇన్ఫోటెక్ ఇప్పుడు ఒక చిన్నపాత్రకు పరిమితమైపోగా, సర్కారీ పెద్దల వ్యూహం మేరకు మధ్యలో వచ్చి చేరిన యూని కార్పొరేట్ సూపర్ పవర్‌గా మారింది. ఇప్పుడు ఈ సంస్థ పూర్తిగా ఎన్నికల ప్రచారానికి దిగింది. తాము ఏ లక్ష్యం కోసం ఈ సంస్థను ఏర్పాటు చేశారో ఆ పని నెరవేర్చడానికి అంటే... ఎన్నికల్లో మళ్లీ జగన్‌ను గెలిపించేందుకు వలంటీర్లను సమాయత్తం చేసే పనిలో పడింది.

బంజారాల ఆరాధ్యుడు సేవాలాల్: బాబు



సేవాలాల్ మహరాజ్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్యుడు సంత్ సేవాలాల్ మహరాజ్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు ఘనంగా నివాళులర్పించారు. సేవాలాల్ జయంతి సందర్భంగా గురువారం ఉండవల్లి నివాసంలో ఆయన చిత్రపటానికి చంద్రబాబు పూలమాల వేసి, నివాళులు అర్పించారు. కాగా, సేవాలాల్ మహరాజ్ ఆశయాలకు జగన్‌రెడ్డి ప్రభుత్వం తూట్లు పొడిస్తోందని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ వ్యాఖ్యానించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సేవాలాల్ 285వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధారునాయక్ మాట్లాడుతూ... ఏజెన్సీలో గిరిజనుల జీబీ మరణాలపై జగన్ సర్కార్‌కు చీమకుట్టినట్లైనా లేదని మండిపడ్డారు.

విజయవాడ పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్

విజయవాడ పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడిగా మరక శ్రీనివాస్ యాదవ్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెంది న శ్రీనివాస్ యాదవ్‌ను పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు అచ్చెన్నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నా హృదయం ఎప్పుడూ మీతోనే!

▸▸ రాయ్‌బరేలీ ప్రజలకు సోనియా భావోద్వేగ సందేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: ప్రత్యక్ష ఎన్నికలకు స్వస్తి పలికి.. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు నామినేషన్ వేసిన కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ(77).. ఇంత కాలం తాను ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన యూపీలోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు గురువారం భావోద్వేగ సందేశం పంపారు. 'నాపై మీకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి నా శాయశక్తులా కృషిచేశాను. ఇప్పుడు అనారోగ్యం, వయోభారం కారణంగా వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేయను. ఈ నిర్ణయంతో ఇక మీకు ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశం నాకు ఉండదు. అయితే నా హృదయం, ఆత్మ ఎప్పుడూ మీతోనే. గతంలో మాదిరిగానే నాకు, నా కుటుంబానికి అండగా ఉంటారని నాకు తెలుసు' అని హిందీ సందేశంలో తెలిపారు. తద్వారా అక్కడ తన కుటుంబం నుంచి బహుశా ప్రియాంకాగాంధీ వాద్రా పోటీచేస్తారన్న సంకేతాలు ఇచ్చారు. 2004 నుంచి వరుసగా నాలుగు ఎన్నికల్లో సోనియా ఇక్కడ నుంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

ముంచుకొస్తున్న మంచు యుగం?

- ▸▸ ప్రపంచంలో కొన్ని చోట్ల అతివృష్టి.. కొన్నిచోట్ల అనావృష్టి
- ▸▸ 2025- 2095 నడుమ జరగొచ్చని గతంలో హెచ్చరిక
- ▸▸ తాజాగా మరోసారి హెచ్చరించిన నెదర్లాండ్స్ శాస్త్రజ్ఞులు

'ద డే ఆఫ్టర్ టుమారో'.. 2004లో వచ్చిన హాలీవుడ్ చిత్రమిది! పర్యావరణ మార్పుల కారణంగా అట్లాంటిక్ మహాసముద్రంలోని ప్రవాహాల్లో మార్పులు ఏర్పడి భూమ్మీద మినీ మంచుయుగం ఏర్పడి ప్రపంచమంతా గడకట్టుకుపోయి, పర్యావరణ ఉత్పాతాలతో అల్లకల్లోలమైపోతుంది! అది సినిమా.. కల్పితం. కానీ.. ఉత్తరార్ధ గోళానికి ఉష్ణశక్తిని చేరవేసే అట్లాంటిక్ మహాసముద్రంలోని గల్ఫ్ ప్రవాహం లయ దెబ్బతిని లయమైపోయే ముప్పు ముంచుకొస్తోందని.. మరికొన్నేళ్లలో అలాంటి మినీ మంచుయుగాన్ని చూసే ప్రమాదం ఉందని.. శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు!! ఈ ప్రపంచం ఇంతందంగా, కులాసాగా కనిపిస్తోందంటే.. ఎండ, వాన, చలి, ఇన్ని రుతువులు వస్తున్నాయి, పోతున్నాయంటే.. మనకు తెలియని, మన కంటికి కనిపించని అద్భుతమైన ప్రక్రియలు వేలాది సంవత్సరాలుగా కొనసాగుతుండడమే కారణం! సామాన్య మానవులకు అంతగా తెలియని అలాంటి అద్భుతాల్లో ఒకటి.. 'గల్ఫ్ స్ట్రీమ్'.

భూమధ్యరేఖ నుంచి, దక్షిణార్ధ గోళం నుంచి వేడిని ఉత్తరార్ధ గోళానికి, ధ్రువాల వద్దకు తీసుకెళ్లి.. ఆ ఉష్ణశక్తిని అక్కడ విడుదల చేసే సహజ కన్వేయర్ బెల్ట్ లాంటి ఉష్ణ ప్రవాహమే ఈ గల్ఫ్ స్ట్రీమ్! ప్రవహించినంతమేరా ఆయాప్రాంతాల్లో చలిని నియంత్రిస్తుంటుంది. పశ్చిమ యూరప్ ప్రాంతాలు చలికాలంలో గడ్డకట్టిపోకుండా ఉండడానికి, అక్కడ ఎండాకాలంలో పంటలు పండడానికి ముఖ్య కారణం ఈ ప్రవాహమే. అయితే.. నానాటికీ పెరుగుతున్న భూతాపం కారణంగా హిమనీ నదాలు కరిగిపోయి ఆ నీరు ఈ ప్రవాహంలో చేరుతుండడం వల్ల ఈ గల్ఫ్ స్ట్రీమ్ దెబ్బతిని ఉష్ణ శక్తిని చేరవేయలేకపోయే ప్రమాదం ఉందని.. శాస్త్రజ్ఞులు 1960ల్లోనే హెచ్చరించారు. 2025 నుంచి 2095 నడుమ ఆ ప్రమాదం ఎప్పుడైనా ముంచుకురావచ్చని గత ఏడాది నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. తాజాగా.. నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్ యూనివర్సిటీ పరిశోధకులు కూడా ఈ విషయమై హెచ్చరిక జారీచేశారు. అయితే, గత పరిశోధకులు చెప్పినట్టు 2025.. 2095.. అంటూ టైమ్ మాత్రం చెప్పలేదు.

పైకి వెళ్లి.. కిందికి..

అట్లాంటిక్ మహాసముద్రంలో ఏర్పడే నాలుగు ఉష్ణ ప్రవాహాల్లో ముఖ్యమైనది గల్ఫ్ స్ట్రీమ్. భూమధ్యరేఖ వద్ద సముద్ర ఉపరితలంపై ఎక్కువ ఉప్పగా, వేడిగా ఉండే నీరు ఈ ప్రవాహం గుండా గల్ఫ్ ఆఫ్ మెక్సికో గుండా అమెరికా తీరం వెంట ప్రయాణించి గ్రీన్‌లాండ్ దిశగా ప్రవహిస్తుంది. ఈ ఉష్ణ ప్రవాహం మీదుగా వీచే గాలుల వల్లే పశ్చిమ యూరోప్‌కు వెచ్చదనం వస్తుంది. అలా గ్రీన్‌లాండ్ సమీపానికి చేరుకునేసరికి అక్కడి మంచు వాతావరణం కారణంగా ఈ ప్రవాహంలోని నీరు చల్లబడుతుంది. కొంత నీరు గడ్డకట్టగా.. మిగిలిన నీటిలో ఉప్పు శాతం పెరిగిపోతుంది. దానివల్ల నీటి సాంద్రత పెరిగి.. ఆ నీరు మళ్లీ కిందికి.. దక్షిణ దిశగా ప్రవహిస్తుంది. కిందికి వెళ్లిన నీరు మళ్లీ ఉప్పునీటితో కలిసి భూమధ్యరేఖ గుండా గల్ఫ్ ఆఫ్ మెక్సికో, అమెరికా తూర్పు తీరం.. ఇలా ప్రవహించి మళ్లీ గ్రీన్‌లాండ్ వద్దకు చేరుకుంటుంది. ఇలా ఒక కన్వేయర్ బెల్ట్ తిరిగినట్టు గల్ఫ్ స్ట్రీమ్ కొన్ని వేల సంవత్సరాలుగా ప్రవహిస్తోంది. కానీ.. భూతాపం వల్ల గ్రీన్‌ల్యాండ్‌లో ఉన్న మంచు ఫలకాలు పెద్ద ఎత్తున కరిగిపోయి ఈ ప్రవాహంలోకి చల్లటి మంచినీరు వచ్చి కలవడం వల్ల దీని లవణీయత తగ్గిపోతోంది. ఫలితంగా కాలక్రమంలో అక్కడికి చేరిన నీరు కిందికి దిగదు. అంటే సహజ కన్వేయర్ బెల్ట్ ఆగిపోయినట్టే. గల్ఫ్ స్ట్రీమ్ గతి తప్పితే ఏం జరుగుతుంది? గతి తప్పి చల్లబడ్డ నీరు పైనే ఉండిపోతే.. ఆ నీరు కిందకి దిగక, కింద నుంచి ఉష్ణ ప్రవాహం పైకి రాకపోవడం వల్ల దానివల్ల ఉష్ణ శక్తిని పొందే ఉత్తర అమెరికా, పశ్చిమ యూరోప్‌లోని పలు ప్రాంతాల్లో, ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గిపోతాయి. ఎంతగానంటే.. దశాబ్దానికి 1 డిగ్రీ మేర.. కొన్ని ప్రాంతాల్లోనైతే దశాబ్దానికి 3 డిగ్రీల మేర వాతావరణం చల్లబడిపోతుంది. ప్రస్తుతం భూతాపం కారణంగా దశాబ్దానికి 0.2 డిగ్రీల మేర ఉష్ణోగ్రత పెరుగుతోంది. అంటే.. పెరిగే ఉష్ణోగ్రత కన్నా తగ్గే శాతమే ఎక్కువ. ఇలా కొన్ని దశాబ్దాల వ్యవధిలో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల మేర పడిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దాని పర్యవసానాలు ప్రపంచం మొత్తంపైనా పడతాయి. కొన్ని ప్రాంతాలను పెనుతుఫానులు అల్లాడిస్తాయి. మరికొన్నిచోట్ల కరువుకాటకాలు సంభవిస్తాయి. తినడానికి తిండి దొరకని పరిస్థితులు ఏర్పడే ముప్పుంది. ఉత్తర అమెరికా తూర్పు తీరంలో సముద్ర మట్టాలు ఆందోళనకరస్థాయిలో పెరుగుతాయి.

- సెంట్రల్ డెస్క్



సభలో ప్రసంగిస్తున్న వైఎస్ విమలారెడ్డి, (ఇన్‌సెట్‌లో) పాస్టర్లకు నగదు పంపిణీ

దైవ సేవకులతో వైసీపీ ప్రచారం!

▸▸ అనంతలో వైఎస్ విమలారెడ్డి సభ, క్రైస్తవులకు డబ్బు పంపిణీ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: దైవ సేవకులను వైసీపీ నాయకులు తమ పార్టీ సేవకులుగా మార్చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేనత్త వైఎస్ విమలారెడ్డి గురువారం అనంతపురంలో దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితోపాటు క్రైస్తవ సంఘాల నాయకులు ఈ సదస్సుకు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా పాస్టర్లను సమీకరించారు. విమలారెడ్డి తొలుత బైబిల్ పఠనం చేశారు. ఆతర్వాత ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. క్రైస్తవులకు ఏదైనా సమస్య వస్తే తనను సంప్రదించాలని, అవసరమైతే ముఖ్యమంత్రి జగన్ వద్దకు తీసుకెళతానని చెప్పారు. సదస్సుకు హాజరైనవారికి భోజనాలు పెట్టి, తెల్లటి కవర్లలో రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు.

భారత్-ఖతార్ సంబంధాలు మరింత బలోపేతం

▸▸ ఖతార్ పాలకుడితో భారత ప్రధాని మోదీ భేటీ



షేక్ తమిమ్ బిన్‌తో మోదీ

దోహా, ఫిబ్రవరి 15: భారత్-ఖతార్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత దృఢపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భూగోళానికి ప్రయోజనం చేకూర్చేలా భవిష్యత్తు రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని చూస్తున్నామని ఆయన తెలిపారు. గురువారం దోహాలో ఖతార్ పాలకుడు షేక్ తమిమ్ బిన్ హమాద్ అల్-థానీతో మోదీ సమావేశమయ్యారు. జైలు శిక్ష పడిన ఎనిమిది మంది భారత నేవీ మాజీ అధికారులను ఖతార్ ఇటీవల విడుదల చేసిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. వీరిని విడుదల చేసినందుకు ఖతార్ పాలకుడికి మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఖతార్ ఎమిర్‌తో తన భేటీ అద్భుతంగా జరిగిందని, తమ సమావేశం సందర్భంగా వివిధ రంగాల్లో సహకారం గురించి చర్చించినట్టు మోదీ పేర్కొన్నారు. భారత్-ఖతార్ మధ్య వివిధ రంగాల్లో సహకారాన్ని మరింత పెంచేందుకు మార్గాలపై చర్చించామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు.

నూతన విధానాలతోనే మత్స్యశాఖ అభివృద్ధి


▸▸ కేంద్ర మంత్రి పర్షోత్తమ్ రూపాల

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖ అభివృద్ధి చెందాలంటే విధానాలు మారాల్సి ఉందని, జాతీయ దృక్పథంతో ముందుకువెళ్లాలని కేంద్ర మత్స్య, పశు సంవర్థక శాఖా మంత్రి పర్షోత్తమ్ రూపాల సూచించారు. నీతి ఆయోగ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గురువారం నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ, పశువుల మేత, చేపల మేతకు సంబంధించిన ఎగుమతి, దిగుమతి విధానంపై పలు సూచనలు చేశారు. రిజర్వాయర్లను, నీటి వనరులను లీజుకు ఇచ్చే విధానం జాతీయ స్థాయిలో తీసుకురావాలన్నారు. మత్స్యకారుల రక్షణ కోసం మార్కెట్ల స్థాయి పెంచాలని, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని, సుస్థిర అభివృద్ధి పద్ధతులు అనుసరించాలన్నారు..

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై దాడులు

▸▸ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీని ప్రకటించిన విజయ్ కుమార్

పెదకాకాని, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని... రాష్ట్రంలో సంపద కేవలం 10 శాతం ఉన్న వర్గాల వారి వద్దనే ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకులు జీవీఎస్ఆర్కే విజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరిగిన సభకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు అధ్యక్షత వహించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో కొత్త మార్పు తీసుకొస్తానని, రాజనీతిజ్ఞుడిగా ఉంటానని ప్రజలకు మాట ఇస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.



ఎర్రచందనం స్మగ్లింగ్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం

▸▸ మాఫియాకు వైసీపీ నేతల దన్ను గవర్నర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఏపీలో ఎర్రచందనం మాఫియా పెట్రేగిపోతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితి గురించి గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. శాంతిభద్రతలను కాపాడి, ఎర్రచందనం మాఫియాకు బలైన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ నేతలు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్‌రావు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి, వినతి పత్రాన్ని అందజేశారు. శేషాచలం అడవుల్లోనే దొరికే అరుదైన ఎర్రచందనాన్ని ప్రభుత్వ పెద్దలే స్మగ్లర్లతో సంబంధాలు పెట్టుకుని, మాఫియాను ప్రోత్సహిస్తోంది. వైసీపీ నేతల ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అడ్డుకున్న అన్నమయ్య జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గణేష్‌ను మాఫియా కారుతో ఢీకొట్టి చంపింది. ఎర్రచందనం స్మగ్లరైన విజయానందరెడ్డిని ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా నియమించింది' అని గవర్నర్ దృష్టికి తీసుకొని వెళ్లింది.

మూడో రోజూ రైతన్న ఆందోళన

▸▸ సింఘూ, టిక్రీ సరిహద్దులు మూసివేత

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన రైతుల ఆందోళనలు మూడోరోజు గురువారం కొనసాగాయి. ఢిల్లీ, హరియాణా మధ్య రెండు కీలక సరిహద్దు పాయింట్లను పోలీసులు మూసివేశారు. హరియాణా నుంచి ఢిల్లీలోకి ప్రవేశించే టిక్రీ, సింఘూ సరిహద్దులను మూసివేయడంతో యూపీలోని ఘాజీపూర్ సరిహద్దు మీదుగా భద్రతా సిబ్బంది పర్యవేక్షణలో రాకపోకలకు అనుమతించారు. శంభు సరిహద్దు వద్ద నిరసన తెలుపుతున్న రైతులను హరియాణా పోలీసులు అడ్డుకున్నప్పటికీ ఢిల్లీలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. పార్లమెంట్, ఇతర సున్నిత ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. టిక్రీ, సింఘూ సరిహద్దుల వద్ద ఢిల్లీ పోలీసులు అనేక అంచెల్లో బారికేడ్లు, సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. పంజాబ్ రైతులను కట్టడి చేయడానికి ఇప్పటికే పెద్దసంఖ్యలో టియర్ గ్యాస్ షెల్స్ నిల్వ చేశామని, అయినప్పటికీ గ్వాలియర్‌లోని టేకన్‌పూర్‌లో ఉన్న బీఎస్ఎఫ్‌కు చెందిన టియర్ స్మోక్ యూనిట్ నుంచి మరో 30వేలకు పైగా బాష్పవాయు గోళాల కోసం ఆర్డర్ పెట్టామని ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గురువారం చండీగఢ్‌లో ముగ్గురు కేంద్రమంత్రులతో సమావేశమైన తర్వాత తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని రైతు నేతలు పేర్కొన్నారు. 'చలో ఢిల్లీ' నిరసనకారులపై హరియాణా పోలీసుల చర్యలను నిరసిస్తూ పంజాబ్‌లో 4 గంటల రైల్ రోకోకు భారతీయ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహన్), బీకేయూ దకుంద(ధనేర్) పిలుపునిచ్చాయి. చాలా చోట్ల రైతులు రైలు పట్టాలపై బైఠాయించి ఆందోళనకు దిగారు. ఢిల్లీ-అమృత్‌సర్ మార్గంలో పలు రైళ్లను గురువారం దారి మళ్లించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 16 ఫిబ్రవరి 2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీహెచ్ ఎంసీటీ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

'హోటల్' కోర్సులో ప్రవేశానికి ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ



సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60, హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 285, స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎం-డా.వైఎస్సార్ ఎన్‌ఐటీహెచ్‌ఎంలో 120, శ్రీశక్తి ఐహెచ్‌ఎం(ప్రైవేట్ కళాశాల)లో 120, మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ లెవెల్ జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) ఎగ్జామినేషన్(లండన్/కేంబ్రిడ్జ్/శ్రీలంక) ఉత్తీర్ణులు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్‌ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎస్‌బీఓఎస్) నుంచి సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు; ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన హెచ్‌ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 2 నుంచి 5 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంబీఏ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఏబీవీఎస్‌ఎంఈ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. క్యాట్ 2023 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి.


అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్(కనీసం 500) ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సీట్ల సంఖ్యకు ఏడురెట్ల మందిని ఎంపిక చేసి గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పంపుతారు. క్యాట్ 2023 స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్స్ స్కోర్‌నకు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ మెరిట్ ప్రకారం తుది జాబితా రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in

టీఎస్ ఈసెట్ నోటిఫికేషన్



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్‌ఈసెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఈసెట్ 2024 విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, మెటలర్జికల్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు బీఫార్మసీ కోర్సుకు అనర్హులు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/కెమికల్/మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఈసెట్ 2024లో అర్హత పొందాలంటే కనీసం 50 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 16
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 24 నుంచి 28 వరకు
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 1 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **టీఎస్ ఈసెట్ 2024 తేదీ:** మే 6
- **వెబ్‌సైట్:** ecet.tsche.ac.in

జాబ్ కార్నర్

ఏపీలో ఎస్ఏ, ఎస్జీటీ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్... వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఖాళీల భర్తీకి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ/డీఎస్సీ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 4,579 ఎస్ఏ/ఎస్జీజీ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఖాళీలు: 4579

ఖాళీలున్న విద్యాసంస్థలు: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్.

పోస్టుల వివరాలు:

1. స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ): **2,299 పోస్టులు**
2. సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ): **2,280 పోస్టులు**

ఉమ్మడి జిల్లాల వారీ ఖాళీలు

1. శ్రీకాకుళం: ఎస్జీటీ-104; ఎస్ఏ-130
2. విజయనగరం: ఎస్జీటీ-103; ఎస్ఏ-97
3. విశాఖపట్నం: ఎస్జీటీ-101; ఎస్ఏ-133
4. తూర్పుగోదావరి: ఎస్జీటీ-108; ఎస్ఏ-182
5. పశ్చిమ గోదావరి: ఎస్జీటీ-102; ఎస్ఏ-145
6. కృష్ణా: ఎస్జీటీ-103; ఎస్ఏ-111
7. గుంటూరు: ఎస్జీటీ-109; ఎస్ఏ-170
8. ప్రకాశం: ఎస్జీటీ-111; ఎస్ఏ-299
9. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు: ఎస్జీటీ-104; ఎస్ఏ-140
10. చిత్తూరు: ఎస్జీటీ-101; ఎస్ఏ-97
11. కడప: ఎస్జీటీ-105; ఎస్ఏ-81
12. అనంతపురం: ఎస్జీటీ-107; ఎస్ఏ-164
13. కర్నూలు: ఎస్జీటీ-1022; ఎస్ఏ-550

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగం/సబ్జెక్టుల్లో ఇంటర్, డీఈడీ/డీఎల్ఈడీ, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారు అర్హులు.

వయోపరిమితి: ఓసీలకు 2024 జూలై 1 నాటికి 44 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిజర్వేషన్ రూల్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.750

ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఫిబ్రవరి 21

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

రాత పరీక్ష షెడ్యూల్: 2024 మార్చి 15 నుంచి 2024 మార్చి 30 వరకు

వెబ్‌సైట్: apdsc.apcfss.in

ఇస్రోలో టెక్నికల్ పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, యూఆర్ రావు శాటిలైట్ సెంటర్(యూఆర్ ఎస్సీ), ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 224

1. సైంటిస్ట్/ఇంజనీర్- ఎస్సీ: **5 పోస్టులు**
2. టెక్నికల్ అసిస్టెంట్: **55 పోస్టులు**
3. సైంటిఫిక్ అసిస్టెంట్: **6 పోస్టులు**
4. లైబ్రరీ అసిస్టెంట్: **1 పోస్టు**
5. టెక్నీషియన్-బి/డ్రాఫ్ట్స్‌మన్-బి: **142 పోస్టులు**
6. ఫైర్‌మన్-ఎ: **3 పోస్టులు**
7. కుక్: **4 పోస్టులు**
8. లైట్ వెహికిల్ డ్రైవర్ 'ఎ' అండ్ హెవీ వెహికిల్ డ్రైవర్ 'ఎ': **8 పోస్టులు**

విభాగాలు: మెకట్రానిక్, మెటీరియల్ సైన్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, టర్నర్, కార్పెంటర్, వెల్డర్ తదితరాలు

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 1

వెబ్‌సైట్: https://www.isro.gov.in/

కోస్ట్ గార్డ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌లు

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కోస్ట్ గార్డ్... వివిధ విభాగాలకు సంబంధించి అసిస్టెంట్ కమాండెంట్-2025 బ్యాచ్‌లో ప్రవేశాలకు అర్హులైన పురుష, మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 70

విభాగాలు

1. జనరల్ డ్యూటీ(జీడీ)
2. టెక్నికల్(మెకానికల్)
3. టెక్నికల్(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)

అర్హత: విభాగాన్ని అనుసరించి పన్నెండో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు రూ.56,100

ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4, స్టేజ్-5 పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 6

వెబ్‌సైట్: joinindiancoastguard.cdac.in/

ఇర్కాన్‌లో ఫైనాన్స్ అసిస్టెంట్‌లు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే కన్‌స్ట్రక్షన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 11

అర్హత: బీకాం/ఎంకాం/సీఏ(ఇంటర్)/సీఎంఏ(ఇంటర్) ఉత్తీర్ణతతో పాటు అకౌంటింగ్, ఫైనాన్స్, ట్యాక్సేషన్, ఫైలింగ్ ఆఫ్ రిటర్న్ తదితర విభాగాల్లో నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు రూ.45,000

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తులు పంపాల్సిన చిరునామా: జేజీఎం/హెచ్‌ఆర్‌ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేత్, ఢిల్లీ.

వెబ్‌సైట్: www.ircon.org/

లిటిల్స్



తెలివైన రైతు

ఒక ఊరిలో గుణ అనే రైతు ఉండేవాడు. తెలివితేటలకు కొదువలేదు. పొలంలో కష్టపడుతూ డబ్బులు సంపాదించేవాడు. ఆ రైతు గురించి రాజ్యంలోని రాజు విన్నాడు. అతని గురించి తెలుసుకోవాలని మంత్రి చెప్పాడు. రెండు నెలల తర్వాత ఆ రాజు ఊరిలో వెళ్తుండగా ఆ తెలివైన రైతు ఇల్లొచ్చిందని మంత్రి చెప్పారు. వెంటనే రాజావారు రథం నుంచి దిగి ఆ రైతు ఇంట్లోకి వచ్చాడు. రైతు కుటుంబంతో మాట్లాడిన తర్వాత రైతుతో ఒంటరిగా మాట్లాడాలని చెప్పాడు. రైతు సంతోషించాడు. 'మీరు ఎంత ధనం రోజుకు సంపాదిస్తారు?' అని అడిగారు. 'రూపాయి' అన్నాడు రైతు. ఖర్చు చేస్తావా? అని అడిగాడు రాజు. 'నాలుగోవంతు తింటాను. నాలుగో వంతు బాకీ తీరుస్తా. నాలుగోవంతు అప్పు తీరుస్తా. నాలుగో వంతు విసిరేస్తాను' అన్నాడు రైతు. అరే విచిత్రంగా ఉందే.. ఏదీ వివరించు సరిగ్గా అన్నాడు రాజు.



ఆ రైతు ఇలా అన్నాడు.. 'నాలుగో వంతు నా తిండికోసం, నా భార్యాపిల్లల కోసం ఖర్చు చేస్తాను. అంటే వారి భవిష్యత్తుకోసం. దీనర్థం నేను బాకీ ఉన్నట్లే కదా. మిగతా నాలుగో వంతు అప్పు తీర్చటం అంటే నా తల్లిదండ్రులకు ఇస్తా. విసిరేయటం అంటే దానం చేస్తాను' అన్నాడు. 'అయితే ఇవేమీ ఎవరికీ చెప్పకు. నా మొహం వంద సార్లు చూసిన తర్వాతనే ఇతరులకు చెప్పు. అంత వరకు చెప్పొద్దు' అన్నాడు. ధనం ఇచ్చి వాగ్దానం చేయించుకున్నాడు రాజు.


ఆ తర్వాత రాజు ఆ పొడుపు కథను అందరికీ చెప్పాడు. ఎవరూ తన సభలో సమాధానం చెప్పలేకపోయారు. దీంతో రాజు గర్వపడ్డాడు. మంత్రులు, కవులు చెప్పలేకపోయారు. ఈ సమస్య ఏంటీ ఎవరు చెప్పారనే విషయం మంత్రి తెలుసుకోవాలనుకున్నాడు. ఒక సైనికాధిపతికి చెప్పి ఆరాతీయమన్నాడు. ఓ పల్లెటూరులోని రైతు చెప్పాడని తెలిసింది. వెంటనే మంత్రి అక్కడికి వెళ్లి ఆ ప్రశ్నకు సమాధానం చెప్పమన్నాడు. 'రాజుగారు చెప్పకూడదు. దయచేసి అడగకండి' అన్నాడు. వెంటనే వంద నాణేలను బహుమతిగా ఇచ్చాడు. అన్ని బంగారు నాణేలను చేత్తో జాగ్రత్తగా చూసి ఎంచుకున్నాడు. ఆ తర్వాతనే రాజు సమాధానం చెప్పాడు. మంత్రి సంతోషంతో ఇంటికి వెళ్లిపోయాడు.

మరుసటి రోజు సభ దగ్గరకు వెళ్లిపోయి సమాధనం చెప్పాడు మంత్రి. వెంటనే రాజుకు సందేహం వచ్చింది. వెంటనే మంత్రిని అడిగాడు. 'అయ్యా.. నేను రైతు దగ్గరకు వెళ్లి సమాధానం తెలుసుకున్నా'నని చెప్పాడు. రాజుకు కోపం వచ్చింది. వెంటనే రైతు దగ్గరకు కోపంతో వెళ్లాడు. 'నేను నీ ముఖం చూడలేదు. పొరబాటున కూడా నువ్వు నా దగ్గరకు రాలేవు. నువ్వు చేసిన వాగ్దానం మర్చిపోయావు. అందుకే నీ తల ఖండిస్తాను' అన్నాడు. వెంటనే 'ఒక్క క్షణం మహారాజావారు. నన్ను మాట్లాడనివ్వండి' అన్నాడు. 'ఇదే నీ చివరి కోరిక' అన్నాడు రాజుగారు. 'మంత్రిగారు వచ్చి వంద బంగారు నాణేలు ఇచ్చారు. ప్రతి బంగారు నాణెం మీద మీ బొమ్మ ఉంది. మరి నేను ఇతరులకు చెప్పొచ్చు కదా' అన్నాడు. రైతు తెలివి నచ్చి.. రాజు మరిన్ని బంగారు నాణేలు బహుమతిగా ఇచ్చాడు.


దారి కనుక్కోండి



10 తేడాలను గుర్తించండి



జంతువులు ఎన్ని?



డైలీ సుడోకు - 231

				7	1		4	
			6					
6			4	3		7	8	
	2			8				
5	4						1	8
				1			3	
	5	3		4	8			1
					3			
	6		5	9				

సుడోకు - 230 సమాధానం

1	3	8	5	4	9	6	7	2
7	5	6	3	1	2	4	8	9
4	9	2	7	6	8	3	1	5
5	6	4	8	9	3	7	2	1
2	1	9	4	7	5	8	6	3
3	8	7	6	2	1	5	9	4
9	4	3	1	8	7	2	5	6
8	2	5	9	3	6	1	4	7
6	7	1	2	5	4	9	3	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.